Postel No. MBN/08/2016-2018




పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,చర్మవ్యాధులతోపాటు అన్ని రకాల రోగాలకు వనమూలికలతో వైద్యంచేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరాలయము
నారాయణపేట రోడ్డు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895


# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక


website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar | సంపుటి :24 | సంచిక :336 | సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు | ఆదివారం 05 ఏప్రిల్ 2026 | పేజీలు :12 | వేల రూ5 /-


## బెర్త్ కోసం వ్యూహాలు



**హైదరాబాద్, ఏప్రిల్ 4:**తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు అందరి దృష్టి మంత్రివర్గ విస్తరణపైనే ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని సర్కారులో మార్పులు జరుగుతాయనే అంశంపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. ప్రస్తుత పరిస్థితులు, పార్టీ వ్యూహాలను విశ్లేషిస్తే, ఈ విస్తరణ అంశం ఎందుకు ఆసక్తికరంగా మారిందో అర్థం చేసుకోవచ్చు.తెలంగాణ మంత్రివర్గంలో ప్రస్తుతం రెండు బెర్తులు ఖాళీగా ఉన్నాయి. వాస్తవానికి, ఏప్రిల్ మొదటి వారంలోనే ఈ ఖాళీలను భర్తీ చేస్తారని, మంత్రివర్గ విస్తరణ ఉంటుందని అందరూ భావించారు. అసెంబ్లీ సమావేశాలు ముగియగానే ఈ ప్రక్రియ వేగవంతం అవుతుందని రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది. అయితే, తాజా పరిణామాల దృష్ట్యా ఈ విస్తరణ ప్రస్తుతానికి వాయిదా పడినట్లు తెలుస్తోంది.మంత్రివర్గ విస్తరణ వాయిదా పడటానికి ప్రధాన కారణం ఐదు రాష్ట్రాల ఎన్నికలేనని సమాచారం. ప్రస్తుతం కాంగ్రెస్ అధిష్టానం కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించింది. ముఖ్యంగా కేరళలో అధికారంలోకి వస్తామనే ధీమాతో ఉన్న కాంగ్రెస్ అగ్రనాయకత్వం, అక్కడ ప్రచారంలో నిమగ్నమైంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు కూడా కేరళలో ఎన్నికల ప్రచారానికి వెళ్లారు. ఈ కీలక సమయంలో మంత్రివర్గ విస్తరణ వంటి కీలక నిర్ణయాలు తీసుకోవడం వల్ల పార్టీ దృష్టి మళ్లుతుందని అధిష్టానం భావిస్తున్నట్లు కనిపిస్తోంది.కేవలం రెండు ఖాళీలను భర్తీ చేయడమే కాకుండా, మంత్రివర్గంలో పూర్తి స్థాయి ప్రక్షాళన - మిగతా3లో

## కాళేశ్వరం చుట్టూ రాజకీయం

**హైదరాబాద్, ఏప్రిల్ 4:**తెలంగాణ రాజకీయ ముఖచిత్రం ఇప్పుడు మళ్లీ 'కాళేశ్వరం' చుట్టూ తిరుగుతోంది. నిన్నటి వరకు కేవలం రాష్ట్రానికి పరిమితమైన ఈ వివాదం, ఇప్పుడు పార్లమెంట్ వేదికగా జాతీయ స్థాయి చర్చగా మారింది. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొదటి నుంచి చేస్తున్న "కూలేశ్వరం" విమర్శలకు, కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ రాజ్యసభలో ఇచ్చిన సమాధానం ఒక ఆయుధంలా మారింది. దీంతో అటు కాంగ్రెస్, ఇటు బీజేపీ పకడ్బందీగా వేస్తున్న వ్యూహాల మధ్య బీఆర్ఎస్ ఆత్మరక్షణలో పడిపోయింది.రాజ్యసభలో అమరావతిపై చర్చ



జరుగుతున్న సమయంలో - మిగతా3లో

## గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పై దాడి

### ప్రజాస్వామ్యంపై సీఎం రేవంత్ రెడ్డి చేయించిన దాడి: మాజీ మంత్రి హరీష్ రావు



**సిద్దిపేట:**గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి జరిగింది. కార్యాలయంపై కాంగ్రెస్ గూండాల దాడి చేశారని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు.ముమ్మాటికీ ఇది సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో జరిగిన దాడి అని ఆరోపించారు.మాజీ మంత్రి హరీష్ రావు,ప్రజాస్వామ్యంపై సీఎం చేయించిన దాడి అన్నారు.పట్టపగలు అధికార మదం తో విర్రవీగుతూ సోయి మరచి వ్యవహ రిస్తున్న కాంగ్రెస్ నాయకుల తీరు బీహార్ గ్యాంగ్‌ను తలపిస్తోందన్నారు. ఏకంగా ప్రజా ప్రతినిధుల క్యాంపు కార్యా లయాల పైనే ముప్పేట దాడులు చేస్తుంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నట్లా లేనట్లా? అని ప్రశ్నించారు.కాంగ్రెస్ పాలనలో ప్రజా ప్రతినిధులపై దాడులు, ప్రజా సంఘాలపై దాడులు, మీడియాపై దాడులు నిత్యకృత్యం కావడం సిగ్గుచేటన్నారు.శాంతి భద్రతలను కాపాడాల్సిన పోలీసు యంత్రాంగం కాంగ్రెస్ పార్టీకి ప్రైవేట్ సైన్యంలా మారిపోయారా ఎందుకు అడ్డుకోవడం లేదు అని ప్రశ్నించారు.



## త్వరలో తెలంగాణలో ఐదు కొత్త పథకాలు!

**హైదరాబాద్:**తెలంగాణ త్వరలో రేవంత్ సర్కార్ కొత్తగా 5 ప్రతిష్టాత్మక పథకాలను అమలు చేసేందుకు సిద్ధమైంది. మొదటగా సీఎం బ్రేక్‌ఫాస్ట్ స్కీం అమలు చేయనుంది. అలాగే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం, విద్యార్థులకు పోషకాహారం అందించే దిశగా మధ్యాహ్న భోజన పథకం విస్తరణ చేయాలని నిర్ణయించింది. దివ్యాంగ విద్యార్థులకు మోటారైజ్డ్ వాహనాలు అందించనుంది. అలాగే రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా వివిధ పంటలు పండించేలా, ప్రత్యామ్నాయమార్గాల వైపు ప్రోత్సహిస్తున్నారు. దీనికోసం రూ.10 వేల వరకు ప్రోత్సాహకాన్ని ఇవ్వాలని భావిస్తోంది.

## వైఎస్ బాటలనే రేవంత్...

### సలహాదారుడిగా వేం నరేందర్ రెడ్డి

**మహబూబ్ నగర్ ,ఏప్రిల్ 4:**ముఖ్యమంత్రికి నీడలాగ ఉండే పోస్ట్. తెలంగాణలో ఆ కీలక పదవి ఎవరికి దక్కబోతోంది? సీఎం సన్నిహితుడు రాజీనామా చేసిన ఆ పోస్టు దక్కేదెవరికి? ఆ పదవి విషయంలో సీఎం రేవంత్ రెడ్డి మనసులో ఏముంది? ఇప్పుడిదే అధికార కాంగ్రెస్‌తో పాటు రాజకీయవర్గాల్లో జరుగుతున్న చర్చ. రేవంత్ రెడ్డి స్నేహితుడు వేం నరేందర్ రెడ్డి స్థానంలో ఎవరిని నియమిస్తారన్నదే ఆసక్తికరంగా మారింది. అత్యంత కీలకమైన ప్రభుత్వ సలహాదారు పదవి అంశంలో ముఖ్యమంత్రి మదిలో ఏముందనేది ఉత్కంఠ రేపుతోంది. వేం నరేందర్ రెడ్డి ప్లేస్‌లో మరొకరిని నియమిస్తారా? అసలు సలహాదారుల పదవిపై సీఎం ఆలోచన ఏంటి?తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా ఉన్న వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ సభ్యుడిగా ఎలక్ట్ అయ్యారు. దీంతో వేం నరేందర్ రెడ్డి రాజీనామా చేసిన సలహాదారు పోస్ట్‌ను ఎవరితో భర్తీ చేస్తారన్న అంశం అధికార కాంగ్రెస్ పార్టీలో జోరుగా చర్చ జరుగుతోంది. తెలంగాణ ప్రభుత్వంలో ఎంతమంది సలహాదారులు ఉన్నా వేం నరేందర్‌రెడ్డికి ఉన్న ప్రాముఖ్యత వేరుగా ఉంటూ వచ్చింది. సీఎం రేవంత్‌రెడ్డికి అత్యంత



సన్నిహితుడే కాకుండా..ఆయనకు అత్యంత నమ్మకస్తుడు కూడా.ఏ విషయాన్నైనా నేరుగా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి - మిగతా3లో

## ఆ గ్యాస్ సిలిండర్‌లకు అడ్రస్ ప్రూఫ్ అక్కర్లేదు : కేంద్రం




పశ్చిమాసియా లో యుద్ధం కారణంగా పెరుగుతున్న ఉద్రిక్తతలు, ఫలితంగా భయపెడుతున్న ఇంధన కొరత నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఇకపై 5 కిలోల ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ను అడ్రస్ ప్రూఫ్ అవసరం లేకుండా కేవలం ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు చూపించి కొనుగోలు చేయవచ్చని స్పష్టంచేసింది. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన చేసింది. సమీపంలోని ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ల దగ్గర ఈ సదుపాయం అందుబాటులో ఉంటుందని పెట్రోలియం శాఖ తెలిపింది. అదేవిధంగా దేశంలో పెట్రోల్, డీజిల్ లేదా ఎల్పీజీకి ఎలాంటి కొరత లేదని ప్రభుత్వం భరోసా ఇచ్చింది. ప్రజలు ఆందోళనచెంది ఇంధనాన్ని అధికంగా కొనుగోలు చేయవద్దని విజ్ఞప్తి చేసింది. దేశవ్యాప్తంగా అన్ని రిటైల్ ఔట్‌లెట్లు సాధారణంగా పనిచేస్తున్నాయని, తగినన్ని నిల్వలు అందుబాటులో ఉన్నాయని చెప్పింది. ముఖ్యంగా వలస కార్మికులు, స్థానిక చిరునామా పత్రాలులేని వారిని దృష్టిలో ఉంచుకుని 5 కేజీల సిలిండర్ నిబంధనను సరళతరం చేసినట్లు అధికారులు వెల్లడించారు. మార్చి 23 నుంచి ఇప్పటివరకు సుమారు 5.7 లక్షల సిలిండర్లను అడ్రస్ ప్రూఫ్ నిబంధన లేకుండా విక్రయించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఇంధన సరఫరాలో స్థిరత్వాన్ని కొనసాగించడానికి దేశీయ ఎల్పీజీ ఉత్పత్తిని పెంచామని, రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని తెలిపింది. మరోవైపు అక్రమ నిల్వలు, నల్ల బజారును అరికట్టేందుకు నిఘా పెంచామని, ఇటీవల 3,700కు పైగా దాడులు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన డిస్ట్రిబ్యూటర్లపై కఠిన చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది.

## బాసర ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండాలి..

### అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం



**హైదరాబాద్, ఏప్రిల్ 4:** బాసర ఆలయ అభివృద్ధిపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు(శనివారం) సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను సీఎంకు అధికారులు వివరించారు. మాస్టర్ ప్లాన్‌పై అధికారులకు పలు సూచనలు చేశారు సీఎం. ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ, శాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధి ఉండాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను, రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రోడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆలయ పరిసరాల్లో ఈవీ వాహనాలను మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా నిబంధనలు కఠినతరం చేయాలని ఆదేశించారు. తిరుమల తరహాలో అన్ని ఆలయాల పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా నిబంధనలు ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశానికి మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ నెల 6న బాసర ఆలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. రూ.225 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు.

## ట్రంప్ నియంత్రణలో మోదీ, ఆయన నియంత్రణలో పినరయి...

### రాహుల్ విసుర్లు

**ఇడుక్కి:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి విమర్శలు గుప్పించారు. నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నియంత్రణలో ఉన్నారని, అత్యంత అవమైనకరమైన విషయం ఏమిటంటే ట్రంప్‌ను 'సర్' అని ఆయన పిలుస్తారని చెప్పారు. మోదీ ఇంకా బ్రిటిష్ కాలంలో ఉన్నానని అనుకుంటున్నారని విమర్శించారు. మోదీని ట్రంప్ నియంత్రిస్తున్నట్టే పినరయి విజయన్‌ను మోదీ నియంత్రిస్తున్నారని అన్నారు. కేరళంలోని ఇడుక్కిలో శనివారంనాడు జరిగిన ఎన్నికల ప్రచారసభలో రాహుల్ మాట్లాడుతూ, బీజేపీతో లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ కుమ్మక్కయిందని ఆరోపించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్, లెఫ్ట్ ఫ్రంట్ మధ్య సంబంధాలను ఇవాళ ప్రతి ఒక్కరూ చూడొచ్చు. లెఫ్ట్ ఫ్రంట్‌లో సిద్ధాంతాల కోసం ఎళ్లతరబడి పనిచేసిన అవకాశవాదులు కాని కొందరు ఇప్పుడు తమను పార్టీ వంచించిందని ఆవేదన చెందుతున్నారు' అని రాహుల్ తెలిపారు. బీజేపీ-ఆర్ఎస్ఎస్‌తో కుమ్మక్కయినందునే ఎల్‌డీఎఫ్ తన వామపక్ష భావజాలాన్ని కోల్పోయిందన్నారు. కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ ఎప్పుడూ సైద్ధాంతిక ప్రత్యర్థిగా ఎల్‌డీఎఫ్‌తో పోరాడేదని, ఇప్పుడు ఎల్డీఎఫ్ మారిపోయిందని, ఎల్‌డీఎఫ్‌లో 'లెఫ్ట్' అనేదే లేదని, ఎన్నికల తర్వాత అందులో ఏదీ మిగలదని అన్నారు. కేరళలోని ప్రభుత్వాన్ని ఒక చీకటి శక్తి ప్రభావితం చేస్తోందని, అది రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ ప్రజలపై దాడి చేస్తోందని పరోక్షంగా బీజేపీ-ఆర్ఎస్ఎస్‌పై రాహుల్ విమర్శలు గుప్పించారు. ప్రధానమంత్రి మోదీ ఏ రాష్ట్రానికి వెళ్లిగా



మతం, ఆలయాలు గురించి మాట్లాడతారని, కేరళ అంశాల విషయానికి వచ్చేసరికి మాత్రం పెదవి విప్పరని శబరిమల బంగారం కేసును ప్రస్తావిస్తూ అన్నారు. ఎల్‌డీఎఫ్‌కు హెల్ప్ చేయాలని ఆయన అనుకోవడమే అందుకు కారణమని వివరించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో పోరాడుతున్నందున తనపై చాలా కేసులు పెట్టారని, ఇంటరాగేట్ చేశారని, అయినా కూడా తాను వెనుదీయలేదని చెప్పారు. మోదీ ప్రతిరోజూ తనపై విమర్శల దాడి చేస్తారని, కానీ కేరళ సీఎం గురించి కానీ, ఆయన కుటుంబం గురించి కానీ ఒక్క మాట మాట్లాడరని అన్నారు. జాతీయ అంశాలపై మోదీని ఎల్డీఎఫ్ ఎప్పుడూ సవాలు చేయకపోవడమే ఇందుకు కారణమని అన్నారు. ఏప్రిల్ 9న కేరళ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# సంపాదకీయం

## ఓబీసీ మహిళలకు.. ప్రత్యేక కోటా ఇవ్వాల్సిందే!

చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని 33 శాతానికి పెంచే నారీశక్తి వందన్ అధినియం ప్రజాస్వామ్యానికి ఒక శుభపరిణామం. దేశ రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచాల్సిన అవసరం ఎప్పటినుంచో వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఈ చట్టం ఒక కీలక ముందడుగు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలైతే దేశ రాజకీయాల్లో స్త్రీ పురుష సమానత్వం దిశగా మరో కీలక ముందడుగు పడినట్లే. అయితే శాసనపరమైన ప్రక్రియలు ఏళ్ల తరబడి సాగితే, మహిళలు ఈ అవకాశాల కోసం ఇంకా ఎక్కువకాలం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉంది. ఓబీసీ మహిళల ప్రాతినిధ్యం గురించి కూడా నేతలు స్పష్టత ఇవ్వాలి. దేశ రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచాల్సిన అవసరం ఎప్పటినుంచో వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఈ చట్టం ఒక కీలక ముందడుగు.. 33 శాతం రిజర్వేషన్ ఒక పెద్ద నిర్ణయం అయినప్పటికీ, ఆ రిజర్వేషన్లలో సామాజిక న్యాయం ప్రతిఫలించాలంటే ఓబీసీ మహిళలకు ప్రత్యేక కోటా తప్పనిసరి. అందుకు తగ్గ ప్రకటన ప్రభుత్వం నుండి రావాల్సి ఉంది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలైతే దేశ రాజకీయాల్లో స్త్రీ-పురుష సమానత్వం దిశగా మరో కీలక ముందడుగు పడినట్లే. ప్రస్తుతం లోక్‌సభలో 74 మంది మహిళా ఎంపీలు ఉన్నారు.. లోక్‌సభ మొత్తం సభ్యుల సంఖ్య 534లో ఇది కేవలం 13.8 శాతం మాత్రమే.. జనాభాలో సగభాగం ఉన్న స్త్రీలు దేశాన్ని శాసించే లోక్‌సభలో ఇంత తక్కువ ప్రాతినిధ్యం కలిగి ఉండటం ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. 33 శాతం రిజర్వేషన్ అమలులోకి వస్తే, ఇప్పుడున్న సీట్ల పరంగా లోక్‌సభలో మహిళల సంఖ్య ఒకేసారి 180కి పెరుగుతుంది. ఓబీసీ వర్గాలు ఇప్పటికే అనేక అడ్డంకులను, ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్థికంగా బలమైన వర్గాలకు చెందిన మహిళలు ఎన్నికల్లో సులభంగా పోటీ చేసే స్థితిలో ఉన్నారు.. వారికి అవసరమైన వనరులు, మద్దతు, వ్యవస్థాపక బలం అందుబాటులో ఉంటాయి. కానీ ఓబీసీ మహిళలు మాత్రం ఆర్థిక వనరుల కొరత, సామాజిక అడ్డంకులు, రాజకీయ పరిచయాల లోపం వంటి సమస్యలను ఎదుర్కొంటూ ముందుకు రావాల్సి వస్తోంది. రిజర్వేషన్ ఉన్నప్పటికీ, పోటీ చేయడానికి అవసరమైన వనరులు లేకపోతే ఆ రిజర్వేషన్ ఎంతవరకు ప్రయోజనం చేకూరుస్తుంది అందుకే మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు ప్రత్యేకంగా కోటా కల్పించడం అత్యవసరం. ఇది ఒక వర్గానికి ఇచ్చే ప్రత్యేక ప్రయోజనం కాదు. సమాజంలో ఉన్న అసమానతలను సరిచేయడానికి తీసుకోవాల్సిన న్యాయబద్ధమైన చర్య. ఒకవేళ ఈ అంశాన్ని విస్మరిస్తే, మహిళా రిజర్వేషన్లు ప్రధానంగా అగ్రవర్గ మహిళలకే పరిమితమయ్యే ప్రమాదం ఉంది. కేంద్ర ప్రభుత్వం ఈ అంశాన్ని సమగ్రంగా పరిశీలించాలి. రాజకీయ పార్టీల బాధ్యత కూడా కీలకం. టికెట్లు కేటాయించే సమయంలో ఓబీసీ మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలి. మహిళా సాధికారత అనేది సమగ్ర భావన. ఒక మహిళా నేత ఎన్నికల బరిలో ఉంటే మహిళా ఓటింగ్ శాతం పెరగడమే కాకుండా, మౌలిక సమస్యలపై చర్చ జరుగుతుంది. అవకాశాల కోసం ఎదురుచూసే దశ నుంచి, అవకాశాలను శాసించే దశకు మహిళలు చేరుకోవాలి. చట్టసభల్లో మహిళల భాగస్వామ్యం పెరగడం వల్ల పాలనలో మానవత్వం, పారదర్శకత పెరుగుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు.. ఈ మార్పు కేవలం అగ్రవర్ణాలకు మాత్రమే పరిమితం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క బీసీ నేతకు ఉంది. అందుకే మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు ప్రత్యేకంగా కోటా కల్పించడం అత్యవసరం. ఇది ఒక వర్గానికి ఇచ్చే ప్రత్యేక ప్రయోజనం కాదు; సమాజంలో ఉన్న అసమానతలను సరిచేయడానికి తీసుకోవాల్సిన న్యాయబద్ధమైన చర్య. ఒకవేళ ఈ అంశాన్ని విస్మరిస్తే, మహిళా రిజర్వేషన్లు ప్రధానంగా అగ్రవర్గ మహిళలకే పరిమితమయ్యే ప్రమాదం ఉంది. కేంద్ర ప్రభుత్వం ఈ అంశాన్ని సమగ్రంగా పరిశీలించాలి. రాజకీయ పార్టీల బాధ్యత కూడా కీలకం – టికెట్లు కేటాయించే సమయంలో ఓబీసీ మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలి. మహిళా సాధికారత అనేది సమగ్ర భావన. ఒక మహిళా నేత ఎన్నికల బరిలో ఉంటే మహిళా ఓటింగ్ శాతం పెరగడమే కాకుండా, మౌలిక సమస్యలపై చర్చ జరుగుతుంది. అవకాశాల కోసం ఎదురుచూసే దశ నుంచి, అవకాశాలను శాసించే దశకు మహిళలు చేరుకోవాలి. చట్టసభల్లో మహిళల భాగస్వామ్యం పెరగడం వల్ల పాలనలో మానవత్వం, పారదర్శకత పెరుగుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ మార్పు కేవలం అగ్రవర్ణాలకు మాత్రమే పరిమితం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క బీసీ నేతకు ఉంది. మహిళా ప్రజాప్రతినిధుల్లో కోటీశ్వరులే అధికంగా ఉన్నారని ఏడీఆర్ వెల్లడించింది. మొత్తం 464 మంది మహిళా ప్రజాప్రతినిధుల సగటు ఆస్తుల విలువ రూ.17.30 కోట్లు కాగా, మొత్తం ఆస్తుల విలువ రూ.8,234 కోట్లు అని తెలిపింది. అత్యధిక ఆస్తులు కలిగిన మహిళా ఎమ్మెల్యేగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టీడీపీ నేత వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఉన్నారు. ఆమె ఆస్తుల విలువ రూ.291 కోట్లుగా ఏడీఆర్ తెలిపింది. ఇంతటి పోటీని తట్టుకుని పేద బీసీలు నిలబడగలరా ఆర్థికంగా బీసీలు ఏ స్థాయిలో ఉన్నారో అందరికీ తెలిసిందే.. ఇప్పుడిప్పుడే కష్టాలను దాటి ముందుకు వస్తున్నారు. అందుకే ఓబీసీ మహిళలకు ప్రత్యేక కోటా తప్పనిసరి చేయాలని డిమాండ్ చేస్తున్నాం. మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు ప్రత్యేక కోటా ఇస్తేనే న్యాయం, ధర్మం.

# రాష్ట్రాల్లో చట్టంగా మారుతున్న యూసీసీ

దేశవ్యాప్తంగా పలు రాష్ట్ర అసెంబ్లీలు యూనిఫాం సివిల్ కోడ్ బిల్లుకు వరుసగా ఇప్పుడు అది చట్టంగా మారనుంది. ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) అవసరంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడారు. ఒకే కుటుంబంలో ఇద్దరికి భిన్నమైన నిబంధనలు వర్తించకూడదు. అసలు ఒకే ఇంట్లో రెండు విధానాలు ఎలా సాధ్యం?" అని ప్రధాని మోదీ ప్రశ్నించారు. ఒకవేళ ఒకే ఇంట్లోని కుటుంబంలో ఇద్దరు వ్యక్తులకు రెండు రకాల చట్టాలుంటే, ఆ ఇల్లు నడవదు" అని అన్నారు. చట్టం కూడా సమానత్వం గురించే మాట్లాడుతుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని మోదీ అన్నారు. ఈ బిల్లు మహిళలకు ప్రయోజనకరమని ప్రజావేదికల పైనా, మీడియాతోనూ, శాసనసభలోనూ మంత్రులు పదేపదే చెబుతున్నారు. ఈ బిల్లు ఆమోదం పొందాక, గుజరాత్‌లో మహిళల స్థితిగతులు, లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌ల గురించి కూడా చర్చ మొదలైంది. ఈ బిల్లు వల్ల మహిళలకు పెద్దగా ప్రయోజనం ఉండదని, పైగా సామాజిక సమస్యలు పెరుగుతాయని కొందరు నిపుణుల అభిప్రాయం. మరోవైపు, అణగారిన వర్గాల మహిళలకు ఈ బిల్లు వల్ల మేలు జరుగుతుందని మరికొందరు అంటున్నారు. యూనిఫాం సివిల్ కోడ్ బిల్లులో మహిళల కోసం ఉన్న ముఖ్యమైన నిబంధనలు ఏమిటి, వారికి ఎలాంటి కొత్త హక్కులు కల్పించబోతున్నారు? నిపుణులు ఏమంటున్నారు? ప్రతి మహిళకు వారసత్వ ఆస్తిలో సమాన వాటా లభిస్తుంది. మతం ఆధారంగా మహిళల కోసం ఎటువంటి ప్రత్యేక నిబంధనలు ఉండవు సామాజిక సంప్రదాయాల ప్రకారం ఇచ్చే విడాకులు కాకుండా, కోర్టు ద్వారా మంజూరయ్యే విడాకులు మాత్రమే చెల్లుబాటు అవుతాయి. వివాహం ప్రతి మతంలో వారి ఆచారాల ప్రకారం చేసుకోవచ్చు, కానీ వివాహం రిజిస్ట్రేషన్ చేయించుకోవడం తప్పనిసరి. లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉన్న మహిళను భాగస్వామి వదిలేస్తే, ఆమెకు భరణం పొందే హక్కు ఉంటుంది, వారికి పుట్టిన బిడ్డకు వారసత్వ హక్కులు లభిస్తాయి. వారసత్వ ఆస్తికి సంబంధించి ఎటువంటి వీలునామా రాయకపోతే స్థిరాస్తులు, చరాస్తులలో మహిళకు సమాన హక్కు లభిస్తుంది. ఏ మతంవారైనా సరే ఒక భార్య ఉండగా రెండో వివాహం చేసుకోకూడదనే నియమం తీసుకొచ్చారు. భర్త విడిచిపెట్టిన మహిళలకు న్యాయం చేసే అంశం కూడా ఈ బిల్లులో ఉంది. కోర్టు ద్వారానే కచ్చితంగా విడాకులు తీసుకోవాలనే నిబంధన గురించి రిటైర్డ్ జడ్జి జ్యోత్స్నా యాజ్ఞిక్ మాట్లాడారు. "యూనిఫాం సివిల్ కోడ్‌లో సామాజిక పద్ధతుల్లో ఇచ్చే విడాకులను అంగీకరించే బదులు, కోర్టు ద్వారానే విడాకులు తీసుకోవడం తప్పనిసరి చేశారు. అయితే ప్రస్తుత పరిస్థితిని గమనిస్తే, ఫ్యామిలీ కోర్టులలో ఇప్పటికే విడాకుల కేసులు భారీగా పెండింగ్‌లో ఉన్నాయి. అటువంటప్పుడు రాబోయే రోజుల్లో విడాకుల కేసుల భారం మరింత పెరుగుతుంది" అన్నారు యాజ్ఞిక్. "ప్రస్తుతం చాలా కులాల్లో సామాజిక పద్ధతుల్లో జరిగే విడాకులు ఇకపై చెల్లకుండా పోతాయి. దీనివల్ల ఫ్యామిలీ కోర్టుల్లో కేసుల పరిష్కారానికి ఎక్కువ సమయం పడుతుంది. కొన్ని కేసుల్లో తక్కువ వయసున్న అమ్మాయిలు లేదా అబ్బాయిల విడాకుల పిటిషన్లు సరైనవే అయినప్పటికీ, ఇటువంటి పరిస్థితుల్లో కేసులు సుదీర్ఘకాలం కొనసాగుతాయి. దీనివల్ల విడాకుల తర్వాత తిరిగి వివాహం చేసుకునే అవకాశం చాలామందికి తగ్గిపోతుంది" అని జ్యోత్స్నా యాజ్ఞిక్ చెప్పారు. "చాలా సమాజాలలో 'లేఖణి', 'సాటాపాటా' వంటి ఆచారాలు ఇంకా కొనసాగుతున్నాయి. ఇటువంటి సంప్రదాయ పద్ధతుల ద్వారా జరిగే విడాకుల ప్రక్రియ దుర్వినియోగమవుతున్నట్లు 2021 చివరిలో గుజరాత్ హైకోర్టులో జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ నానావతి ధర్మాసనం గుర్తించింది. అయినప్పటికీ, నేటికీ ఈ పద్ధతులు కొనసాగుతున్నాయి. తక్కువ చదువుకున్నవారు, ఆత్మగౌరవం కోసం విడాకులు తీసుకునే మహిళలు ఈ పద్ధతుల ద్వారా విడాకులు పొందినా స్వల్ప కాలంలోనే మరో వివాహం చేసుకోగలుగుతున్నారు. ఇప్పుడు కోర్టులలో ఇటువంటి కేసుల భారం పెరిగి, న్యాయమూర్తుల సంఖ్య తక్కువగా ఉంటే, కొన్ని కులాలకు చెందిన మహిళలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది" అని ఆమె అభిప్రాయపడ్డారు. "మహిళలకు అత్యంత ప్రమాదకరమైన నిబంధన ఏదైనా ఉందంటే, అది లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌కు గుర్తింపునివ్వడమే. ఈ సంబంధాలను రిజిస్ట్రేషన్ చేసుకోవడం తప్పనిసరి చేశారు. గతంలో లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉండేవారు సమాజానికి భయపడేవారు. కానీ ఇప్పుడు బహిరంగంగా, చట్టబద్ధంగా ఇటువంటి సంబంధాల్లో ఉండవచ్చు. కొత్త తరంలో లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లకు ఈ విధంగా గుర్తింపు లభిస్తే, సమాజాన్ని ఏకంగా ఉంచే వివాహ వ్యవస్థ బలహీనపడిపోతుంది. ఇది రాబోయే రోజుల్లో ప్రమాదకరం" అని న్యాయవాది పూజా ప్రజాపతి అభిప్రాయపడ్డారు "లివ్-ఇన్ రిలేషన్‌షిప్ ద్వారా జన్మించిన బిడ్డకు కూడా హక్కులు కల్పించే అంశం ఈ చట్టంలో ఉంది. ఈ సంబంధాల వల్ల కలిగే పిల్లల విషయంలో స్త్రీ, పురుషుల మధ్య కొత్త చట్టపరమైన వివాదాలు తలెత్తుతాయి. లివ్-ఇన్‌లో ఉన్న మహిళపై ఆరోపణలు వస్తే, కొత్త గొడవలు మొదలయ్యే అవకాశం ఉంది. దీనివల్ల మహిళలకు ఎక్కువ నష్టం కలగవచ్చు. అంతేకాకుండా, 18 నుంచి 21 ఏళ్ల లోపు యువతీ యువకులు లివ్-ఇన్ రిజిస్ట్రేషన్ చేయించుకుంటే వారి తల్లిదండ్రులకు సమాచారం అందించాలనే నిబంధన ఉంది. దీనివల్ల కొత్త సామాజిక సంఘర్షణలు మొదలవుతాయి. ఈ యూనిఫాం సివిల్ కోడ్ వల్ల దీర్ఘకాలంలో ప్రయోజనం కంటే వివాహ వ్యవస్థకే ముప్పు పొంచి ఉంది" అని చెప్పారు. యూనిఫాం సివిల్ కోడ్ ద్వారా విడాకుల కేసుల్లో మహిళలకు తక్షణమే భరణం అందడం, వివాహం జరిగిన ఏడాది తర్వాతే విడాకుల కేసు దాఖలు చేయాలనే నిబంధనలు మంచి పరిణామాలే. అయితే, మహిళలకు దీనివల్ల ఏవో పెద్దఎత్తున ప్రయోజనాలు కలుగుతాయని మాత్రం అనిపించడం లేదు" అని పూజా ప్రజాపతి అన్నారు.

# హర్మూజ్‌ను తెరవడానికి 35 దేశాలు ప్రయత్నాలు..

**భారత్‌కు ఆహ్వానంపై స్పందించిన కేంద్రం**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 4:** ఇరాన్‌తో తాము చేస్తున్న యుద్ధానికి మద్దతు ఇవ్వడం లేదని నాటో సహా మిత్ర దేశాలపై అమెరికా అధినేత డొనాల్డ్ ట్రంప్ కాలుగాలిన పిల్లిలా చిందులు వేస్తున్నారు. నాటో నుంచి అమెరికా వైదొలగుతుందని ఆయన బెదిరింపులకు దిగారు. బ్రిటన్ మాత్రం ఈ యుద్ధంతో తమకు ఎలాంటి సంబంధం లేదని ఖరాఖండిగా చెప్పింది. అవసరమైతే హర్మూజ్ తెరవడానికి దౌత్య మార్గాల్లో ప్రయత్నిస్తామని ప్రకటన చేసింది. దీంతో 35 దేశాలతో సమావేశం నిర్వహిస్తుండగా.. దీనికి భారత్‌ను ఆహ్వానించింది. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా దాదాపు మూసివేసిన హర్మూజ్ జల సంధిని తెరిపించడానికి యూకే నాయకత్వంలోని 35 దేశాలు ఏర్పాటుచేసిన సమావేశానికి భారత్‌కు ఆహ్వానం అందినట్టు కేంద్ర విదేశాంగ శాఖ వెల్లడించింది. ఆ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మీడియాతో మాట్లాడుతూ.. గురువారం జరగబోయే సమావేశంలో భారత్ తరపున విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్త్రీ వర్చువల్‌గా హాజరవుతారని ఆయన తెలిపారు. ' హర్మూజ్ జల సంధి అంశంపై చర్చించేందుకు



ఏర్పాటుచేసిన సమావేశానికి భారత్ సహా పలు దేశాలను యూకే ఆహ్వానించింది.. భారత తరపున విదేశాంగ కార్యదర్శి హాజరవుతారు' అని జైస్వాల్ తెలిపారు. చమురు, ఎల్పీజీ, ఎల్ఎన్జీ సహా ఇంధనం మోసుకొచ్చే నౌకల సురక్షిత ప్రయాణం కోసం ఇరాన్, ఇతర దేశాలతో మేము సంప్రదింపులు జరుపుతున్నాం.. గత కొన్ని రోజులుగా జరిపిన చర్చల ఫలితంగా భారత్‌కు చెందిన ఆరు ట్యాంకర్లు హర్మూజ్‌ను సురక్షితంగా దాటాయి.. నిరంతరం సంబంధిత పార్టీలతో సంప్రదింపులు కొనసాగిస్తున్నాం" అని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి వెల్లడించారు. ప్రపంచ ఇంధన సరఫరాకు హర్మూజ్ అత్యంత కీలకమైంది. దీని ద్వారానే ప్రపంచ ఐదో వంతు ఇంధనం సరఫరా అవుతుండగా.. భారత్ దిగుమతి చేసుకునే చమురులో 40 శాతం, ఎల్ఎన్జీలో 50 శాతం, ఎల్పీజీలో 80 శాతం హర్మూజ్ నుంచే వస్తుంది. ఈ జలసంధిని తిరిగి తెరవడం తన కీలక ప్రాధాన్యతలలో ఒకటని చెబుతూ వచ్చిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం మాట మార్చారు. యూకేతో సహా అమెరికా మిత్రదేశాలను వారి చమురును వారే సమకూర్చుకోవాలని కోరారు. ఇకపై అమెరికా వారికి సహాయం చేయదని ఆయన నొక్కి చెప్పారు. అమెరికాకు అండగా నిలవని దేశాలకు.. తాము కూడా సహాయం చేయబోమని పేర్కొన్నారు. యూకే వంటి దేశాలకు రెండే మార్గాలున్నాయని ఒకటి ఇంధనం పుష్కలంగా ఉన్న తమ నుంచి ఆయిల్ కొనాలని.. రెండు ధైర్యం ఉంటే హర్మూజ్ దగ్గరకు వెళ్లి తెచ్చుకోవాలని బెదిరింపులకు దిగారు.

# రాములమ్మ శాపనార్థాలు....

**హైదరాబాద్, ఏప్రిల్ 4:** కాంగ్రెస్ పార్టీ నాయకురాలు.. ఎమ్మెల్సీ విజయశాంతి.. ఉరఫ్ రాములమ్మ.. ఇటీవల మండలి సమావేశా ల్లో చివరి రోజు పెద్ద ఎత్తున మాట్లాడిన విషయం తెలిసిందే. తెలంగాణ ఉద్యమంలో పాలు పంచుకున్న వారికి న్యాయం చేయాలని.. లేక పోతే.. కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్ర హీనంగా మిగిలిపోతుందని ఆమె సంచ లన వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు.. 25 వేల రూపాయల పింఛను, ఉద్యోగాలు, భూములు ఇవ్వాలని కూడా సూచించారు. దీనిపై వేసిన కమిటీ కాలయాపన కమిటీగా ఉందన్నారు. ఉద్యమ కారుల తరఫున విజయశాంతి మండలిలో పలు వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వంపై( బీ ఆర్ ఎస్)పైనా విమర్శలు చేసినా.. అవి సునిశితంగా సున్నితంగా ఉన్నాయన్న వాదన వినిపించింది. ఇక, ఈ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీలో గుసగుస మొదలైంది. ఆమె లేవనెత్తిన అంశాలపై ఎవరూ విభేదిం చకపోయినా.. ఆమె తీరును మాత్రం కొందరు తప్పుబడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా.. బీఆర్ ఎస్ వంటి ప్రత్యర్థి పార్టీలకు ఊతమిచ్చేలా ఆమె వ్యాఖ్యానించారని ఓ మంత్రి ఆఫ్ దిరికార్డుగా అన్నారు. ఇదే మాట మరికొందరు కూడా చెబుతున్నారు. గతంలో బీఆర్ ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు.. విజయశాం తి ప్రకటనలకే పరిమితం అయ్యారని అప్పట్లో ఎందుకు ప్రశ్నించలేదని వ్యాఖ్యానించడం గమనార్హం. అంతేకాదు.. ఇప్పుడు సొంత పార్టీ ప్రభుత్వం ఎన్నో అమలు చేస్తోందని.. కానీ, విజయశాంతికి అవేవీ కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం పింఛన్లు ఇస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. కానీ.. విజయశాంతి ప్రత్యేక ఎజెండా పెట్టుకుని మాట్లాడారని.. ఒక వర్గాన్ని రెచ్చగొట్టే ధోరణి కనిపించిందని మెజారిటీ నాయకులు వ్యాఖ్యానించారు. . కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నప్పటికీ.. రాములమ్మ ప్రత్యేక శైలిని అవలంభిస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్రస్థాయి నాయకుల కంటే కూడా ఆమె జాతీయ స్థాయి నాయకులతోనే ఎక్కువగా టచ్‌లో ఉంటున్నారు. అంతేకాదు.. రాష్ట్ర ప్రభుత్వ పనిలోనూ ఆమె భాగస్వామ్యం తక్కువగానే ఉంది. కొన్ని కొన్నిసందర్భాల్లో అసలు లేనే లేదన్న వాదన కూడా ఉంది. ఈ నేపథ్యంలోనే



గత రెండు రోజులుగా విజయశాంతి వ్యవహారంపై పార్టీలో చర్చసాగుతోంది.

రేసులో మహేశ్ గౌడ్, విజయశాంతి, రాజగోపాల్..

రెండు బెర్తులనే ఫిలప్ చేస్తే..ఆశావహులను ఎలా సంతృప్తి పరుస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి అమాత్య యోగం కోసం గట్టి పట్టుబడుతున్నారు. ఇక బీసీ వర్గం నుంచి కూడా పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ పేరు ప్రధానంగా చర్చకు వస్తున్నా..విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, బీర్ల అయిలయ్య వంటి వారు పోటీ పడుతున్నారు. విజయశాంతి పేరు కూడా రేసులో ప్రధానంగా వినిపిస్తోంది. అయితే రెండు బెర్తుల కోసం అరడజను మంది ఆశావహులు సీరియస్‌గా ట్రై చేస్తుండటంతో ఎవరికి అవకాశం కల్పిస్తారనే ఉత్కంఠ కంటిన్యూ అవుతోంది. ఖాళీగా ఉన్న రెండు మంత్రి పదవులపై అటు రాములమ్మకు..ఇటు రాజన్న బోలెడు ఆశలు పెట్టుకున్నారు. కాంగ్రెస్ పార్టీలో ఈ ఇద్దరిది స్పెషల్ కాంబినేషన్. మనుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ విజయశాంతి. ఈ ఇద్దరి కల, ఆశ ఒకటే. అదే క్యాబినెట్ మినిస్టర్. అయితే అమాత్య యోగం కోసం వెయిటింగ్‌లో ఉన్న వీళ్లిద్దరు..తమకు మంత్రివర్గంలో చోటు దక్కకపోవడంతో అసంతృప్తిగా ఉన్నారు. ఈ క్రమంలోనే సమయం సందర్భం దొరికినప్పుడల్లా సొంత ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేలా కామెంట్స్ చేస్తున్నారు. ఈ మధ్యే అటు మండలిలో రాములమ్మ, ఇటు అసెంబ్లీ రాజగోపాల్‌రెడ్డి చేసిన కామెంట్స్ అధికార కాంగ్రెస్‌ను ఇరకాటంలో పడేశాయన్న చర్చ నడుస్తోంది. వారి అసంతృప్తి చల్లార్చేందుకు హస్తం పార్టీ పెద్దలు పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. రాజగోపాల్‌రెడ్డికి అధిష్టానమే హామీ ఇచ్చి ఉండటంతో ఆయనకు బెర్త్ పక్కా అంటున్నారు. ఇక లేడీ ఫైర్ బ్రాండ్‌గా..బీఆర్ఎస్‌పై బాణాలు ఎక్కు పెట్టాలంటే రాములమ్మకు మంత్రివర్గంలోకి తీసుకుంటే బాగుంటుందన్న చర్చ జరుగుతోందట. ఇప్పటికే రెండున్నరేళ్ల పాలన పూర్తి కావొస్తోంది. ఎన్నికలకు ఇంకో రెండున్నరేళ్లే ఉన్నట్లు. ఈ అంశాన్ని దృష్టిలో క్యాబినెట్‌లో ఖాళీగా ఉన్న రెండు బెర్తుల భర్తీపై ఫోకస్ పెట్టింది. అయితే విప్‌లుగా పని చేస్తున్న వారు ప్రమోషన్ కోసం ఎదురుచూస్తున్నారు. గతంలో ఇద్దరికి ప్రమోషన్ దక్కగా..మరో ఇద్దరు కూడా అమాత్య యోగం కోసం వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నారు. విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య ఇద్దరు కూడా మంత్రివర్గంలో ఛాన్స్ కోసం ఆశలు పెట్టుకున్నారు. మున్నూరుకాపు సామాజిక వర్గం నుంచి ఆది శ్రీనివాస్..యాదవ సామాజిక వర్గం నుంచి బీర్ల అయిలయ్య తనకు క్యాబినెట్‌లో చోటు కల్పించాలని కోరుతున్నారు. అయితే విస్తరణకే పరిమితం అయితే మాత్రం ఈ ఇద్దరి ఆశలు నెరవేరుతాయో లేదోనన్న డైలమా కంటిన్యూ అవుతోంది. క్యాబినెట్ విస్తరణతో పాటు షఫ్లింగ్ చేస్తే మాత్రం ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్యకు ప్రమోషన్ దక్కే చాన్సెస్ ఎక్కువగా ఉన్నాయంటున్నారు. అదే జరిగితే ఇప్పటికే క్యాబినెట్‌లో ఉన్నవారిలో ఎవరికి ఉద్వాసన పలుకుతారన్నది మరో చర్చ. క్యాబినెట్ ఎక్స్‌ప్యాన్షన్‌తోనే సరిపెడుతారా? లేక ప్రక్షాళన చేస్తారా అనేది చూడాలి.

# ఎగుమతులకు యుద్ధం సెగ

పశ్చిమాసియా యుద్ధ బీభత్సం అంతర్జాతీయ సరఫరా గొలుసులను చిన్నాభిన్నం చేసి చమురు, గ్యాస్ ఇతర కీలక అవసరాలు ఎవరికీ అందకుండా ఎంత కల్లోలం సృష్టిస్తోందో తెలిసిందే. భారతదేశం నుంచి ఇతర దేశాలకు ఎగుమతి కావలసినవి కాకుండా ఆటంకాలు ఏర్పడి ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ నుంచి అమెరికా, యుఎఇ, సౌదీ అరేబియా, తదితర దేశాలకు ఎగుమతులు స్తంభించిపోతున్నాయి. దీంతో ఎగుమతిదారులకు ఏం చేయాలో దిక్కుతోచడం లేదు. ఇతర దేశాలతో ముడిపడి ఉన్న మార్కెట్ వ్యవస్థ తలకిందులవుతోంది. తెలంగాణ నుంచి ఇతర దేశాలకు సంబంధించి మొత్తం పది ప్రధాన ఎగుమతి గమ్యస్థానాలలో అయిదు ప్రస్తుతం గందరగోళానికి గురవుతున్నాయి. అమెరికా, సౌదీ అరేబియా, కువైట్, బంగ్లాదేశ్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలకు ఇప్పుడు తెలంగాణ నుంచి కీలకమైన పరికరాలు ఎగుమతికాక స్తంభించిపోతున్నాయి ఎగుమతి మార్కెట్లలో 50% ఈ విదేశీ మార్కెట్లపై నిమగ్నమై ఉంటున్నాయి. అత్యధికంగా ఎగుమతి జరిగే ప్రధాన దేశాల్లో అమెరికా 23.64 శాతం, యుఎఇ 11.74 శాతం, సౌదీ అరేబియా 6.74 శాతం వరకు ఎగుమతి వాణిజ్యంలో పాలుపంచుకుంటున్నాయి. ఇంకా చైనా 3.69 శాతం, ఫ్రాన్స్ 3.38 శాతం, బ్రిటన్ 2.72 శాతం, టర్కీ 2.32 శాతం, జెక్ రిపబ్లిక్ 1.95 శాతం, బంగ్లాదేశ్ 1.83 శాతం, కువైట్ 1.75 శాతం వరకు తెలంగాణతో వాణిజ్యం సాగిస్తున్నాయి. ఇప్పుడు ఈ దేశాలన్నీ యుద్ధ సంక్షోభంతో వాణిజ్య ఒప్పందాల్లో అనిశ్చితిని ఎదుర్కొంటున్నాయి. ఇంతవరకు ప్రతికూలతలు ఉన్నప్పటికీ, తెలంగాణ ఎగుమతుల పనితీరు పటిష్టంగానే సాగింది. 2023 24లో రూ. 1,16,182 కోట్ల విలువైన సరకుల ఎగుమతులు జరగ్గా, 202425లో రూ. 1,61,843 కోట్ల విలువైన ఎగుమతులు జరిగి 39.3 శాతం ఆధిక్యాన్ని చూపించాయి. ఎయిర్ క్రాఫ్ట్, స్పేస్‌క్రాఫ్ట్ విడిభాగాలు, ఫార్మాక్యూటికల్ ఉత్పత్తులు, ఆర్గానిక్ కెమికల్స్, ఎలక్ట్రిక్, ఇంజినీరింగ్ పరికరాలు తదితర ఎగుమతులు విరివిగా జరిగాయి. మరిన్ని కనుగొనండి ఎడిటోరియల్ విశ్లేషణ ఎయిర్ పోర్ట్ సేవలు పిల్లల పుస్తకాలు దీంతోపాటు వ్యవసాయ ఉత్పత్తులు, ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు చెప్పుకోదగిన విధంగా ఎగుమతులు అవుతున్నాయి. వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి 500 రిజిస్టర్డ్ ఎగుమతిదారులు తెలంగాణలో ఉన్నారు. అయినప్పటికీ ప్రస్తుత సంక్షోభంతో గల్ఫ్‌దేశాలకు, ఇతర దేశాలకు ఎగుమతులు తగ్గుముఖం పడుతున్నాయి. వాణిజ్య ఒప్పందాలు ఇంకా ఖరారు కాకపోవడమే ప్రధాన కారణంగా అగ్రికల్చరల్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడెక్ట్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎపిఇడిఎ) వెల్లడించడం గమనార్హం. నీతి ఆయోగ్ ఎక్స్‌పోర్టు సన్నాహక సూచిక 2024 ప్రకారం ఎగుమతుల్లో అన్ని రాష్ట్రాల కన్నా మొత్తం మీద తెలంగాణ ఎనిమిదో స్థానం వహించింది. లాజిస్టిక్స్ అండ్ సేఫ్టీ 2024 రిపోర్టు ప్రకారం తెలంగాణ ఎచీవర్స్ కేటగిరీలో ఉంది. అయితే రవాణా ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడంతో తీవ్ర అస్థిరతకు దారితీస్తోందని ఎగుమతిదారులు చెబుతున్నారు. తలకు మించిన భారంతో యూరప్ మీదుగా గల్ఫ్‌దేశాలకు నౌకల ద్వారా రవాణా చేస్తుండడం తమకు కష్టం అవుతోందని కొందరు చెబుతున్నారు. పశ్చిమాసియాలో సాధారణ పరిస్థితి ఏర్పడితేనే కానీ తమకు వెసులుబాటు లభించదని అంటున్నారు. ఇతర ఎగుమతిదారులు విమాన రవాణా ఛార్జీలు భరించలేక పోవడంతో ఇప్పుడు తమకు ఎగుమతి ఆర్డర్లు ఎక్కువగానే వస్తున్నాయని పేర్కొన్నారు. హోర్ముజ్ జలసంధి ద్వారా నౌకల రాకపోకలకు నిర్బంధం ఉండడంతో ఇతర విభాగాలపై కూడా ఈ ప్రభావం కనిపిస్తోంది. దుబాయ్, సౌదీ అరేబియా, కువైట్ దేశాలకు ఎగ్ పౌడర్, ఫ్రోజెన్ ఎగ్ లిక్విడ్ ఎగుమతి చేయడానికి ఇదివరకటిలా నౌకలు లభించడం లేదని దాంతో రవాణా ఛార్జీల భారం పెరిగిపోతోందని కొందరు ఎగుమతిదారులు ఆందోళన వెలిబుచ్చారు. హైదరాబాద్ కేంద్రంగా చాక్లెట్‌లు రవాణా చేసేవారు తమకు గతం కన్నా ఆర్డర్లు తగ్గాయని చెప్పారు. మరిన్ని కనుగొనండి వార్తల సబ్‌స్క్రిప్షన్ ఆధ్యాత్మిక కంటెంట్ స్థానిక పర్యాటక ప్యాకేజీలు ఇక పెట్రోలు నుంచి వెలువడే ఉప ఉత్పత్తులతో రసాయనాలు, ఎరువులు తయారు చేసే సంస్థలు తగిన ఉత్పత్తి చేయలేక మూతపడుతున్నాయి. ఫార్మాక్యూటికల్, సెమీకండక్టర్లు, డిటెర్జంట్, రంగులు, ప్లాస్టిక్స్ వంటి ఉత్పత్తుల తయారీకి కూడా ఆటంకం ఏర్పడుతోంది. దేశంలోని ఎరువుల ఉత్పత్తి గత నెల రోజుల్లో నాలుగో వంతు పడిపోయింది. ఇంధనం కొరతతో సూరత్ లోని వస్త్రాల తయారీ యూనిట్లు వారానికి ఐదు రోజులే పనిచేస్తున్నాయి. గుజరాత్ లోని సిరామిక్ హబ్‌గా ఉన్న మోర్బీలో మూడింట ఐదు వంతుల మంది కార్మికులు తమ పనులు సాగక ఇళ్లకు తిరిగి వచ్చేస్తున్నారు.

# కేరళ ను ముంచెత్తుతున్న కమలం నేతలు

**తిరువనంతపురం, ఏప్రిల్ 4:** కేరళ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ తన వ్యూహాలకు పదును పెడుతోంది. దక్షిణాదిన కర్ణాటక తర్వాత కేరళను తన తదుపరి లక్ష్యంగా మార్చుకున్న కమలదళం, ఈసారి మిషన్ కేరళ' పేరుతో అత్యంత పకడ్బందీగా ముందుకు సాగుతోంది. ముఖ్యంగా యువ నాయకత్వానికి పెద్దపీట వేస్తూనే, జాతీయ స్థాయి దిగ్గజాలను క్షేత్రస్థాయి ప్రచారంలోకి దించుతూ ప్రత్యర్థి పార్టీలైన ఎల్‌డిఎఫ్ , యుడిఎఫ్ లకు సవాల్ విసురుతోంది.మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కేరళలో సుడిగాలి పర్యటనలు చేస్తూ శ్రేణుల్లో ఉత్సాహం నింపుతున్నారు. తాజాగా ఎర్నాకులం జిల్లాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన పాల్గొని, కేరళ అభివృద్ధికి మోదీ నాయకత్వమే శరణ్యమని ఉద్ఘాటించారు. ఎర్నాకులంను ఇండస్ట్రియల్ పవర్ హౌస్ గా మారుస్తామని హామీ ఇస్తూ, స్థానిక ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేశారు.



కేరళలో కేవలం ఓట్లు పెంచుకోవడమే కాకుండా, ఈసారి గణనీయమైన సంఖ్యలో సీట్లు గెలుచుకోవడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి గత మూడు, నాలుగు వారాలుగా కేరళలోనే మకాం వేసి, ఎర్నాకులం జిల్లా ఇంచార్జ్‌గా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జాతీయ నేతల పర్యటనలను సమన్వయం చేయడంతో పాటు, స్థానిక కేడర్‌ను ఎన్నికలకు సిద్ధం చేయడంలో ఆయన చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ఎర్నాకులం జిల్లాలోని త్రిపునిత్తుర ఎన్డీయే అభ్యర్థి అంజలి నాయర్, ఇతర అభ్యర్థుల గెలుపు కోసం వ్యూహ ప్రతివ్యూహాలను రచిస్తూ, క్షేత్రస్థాయిలో పార్టీ పట్టును పెంచేందుకు కృషి చేస్తున్నారు.కేరళలో ఈసారి బిజెపి అగ్రనేతలంతా రంగంలోకి దిగుతున్నారు. జె.పి. నడ్డా, స్మృతి ఇరానీ వంటి నేతలు రాష్ట్రవ్యాప్తంగా రోడ్ షోలు, బహిరంగ సభలతో హోరెత్తిస్తున్నారు. గతంలో త్రిపుర, అస్సాంలలో బిజెపి ఎలాగైతే అసాధ్యమైన విజయాలను సాధించిందో, కేరళలో కూడా అదే చరిత్ర పునరావృతమవుతుందని బిజెపి వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. క్రైస్తవ ఓటర్లను ఆకర్షించేందుకు ప్రత్యేక ప్రణాళికలు, మౌలిక సదుపాయాల కల్పన వంటి హామీలతో బిజెపి ఈసారి గట్టి పోటీనిస్తోంది.

# వైఎస్ బాటలనే రేవంత్...

- మొదటి పేజీ తరువాయి

తీసుకెళ్లగలిగిన చనువు, చొరవ ఒక్క వేం నరేందర్ రెడ్డికే ఉన్నాయి. అందుకే సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణలో ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వేం నరేందర్ రెడ్డిని తన రాజకీయ సలహాదారుగా నియమించుకున్నారు. అయితే రాజ్యసభ ఎంపీగా నామినేషన్ వేయడానికి ముందే ప్రభుత్వ సలహాదారు పదవికి రిజైన్ చేశారాయన. దీంతో ఇప్పుడు వేం నరేందర్ రెడ్డి స్థానంలో వచ్చే సలహాదారు ఎవరనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా జరుగుతోంది.రేవంత్ రెడ్డితో సాన్నిహిత్యం విషయంలో వేం నరేందర్ రెడ్డి స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు. కానీ ఆయన రాజీనామా చేసిన ప్రభుత్వ సలహాదారు పదవిపై మాత్రం చాలా మందే ఆశలు పెట్టుకున్నారట. ముఖ్యమంత్రికి సన్నిహితంగా ఉండే కొందరు నేతలు గవర్నమెంట్ అడ్వైజర్ పోస్ట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారట. తమ మనసులోని మాటను కొందరు ఇప్పటికే రేవంత్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. అయితే సీఎం మాత్రం ఇప్పటివరకు ఎవరికీ హామీ ఇవ్వలేదని అంటున్నారు.ఇక ఈ మధ్య ప్రభుత్వ సలహదారు నియామకం విషయంలో కాస్త కాంట్రవర్సీ చర్చ



జరుగుతోంది. ఈ మధ్యే కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన మాజీమంత్రి జీవన్ రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. ముఖ్యంగా సలహాదారులనే టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పించారు. వేం నరేందర్ రెడ్డి..పోచారం శ్రీనివాస్ రెడ్డి ఎవరంటూ మండిపడ్డారు. వాళ్లిచ్చిన సలహాలేంటి అంటూ ప్రశ్నించారు. దీంతో అడ్వైజర్ల అంశంలో విమర్శలు రాకుండా చూసుకోవాలనే ఆలోచనలో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నట్లు చర్చ జరుగుతోంది.ప్రస్తుతం వేం నరేందర్ రెడ్డి రాజీనామా చేసిన సలహాదారు పోస్టు చాలా కీలకమని చెప్పొచ్చు. సీఎంకు రాజకీయ సలహాదారుగా ఉండే ఈ పోస్టులో అత్యంత నమ్మకమైన వ్యక్తిని పెట్టుకుంటారు. సీఎంకు ఎక్కడా ఎలాంటి రిమార్క్ రాకుండా చూడాల్సిన బాధ్యత ఈ పోస్టులో ఉండేవారికి ఉంటుంది. అందుకే కీలకమైన పోస్టు విషయంలో ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నారట సీఎం రేవంత్‌రెడ్డి. గతంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా వైఎస్ఆర్ ఉన్నప్పుడు కేవీపీ రామచందర్‌రావు కూడా సేమ్ టు సేమ్ వేం నరేందర్ రెడ్డి రోల్‌ను పోషించారు. అప్పట్లో కేవీపీ రాజ్యసభ ఎంపీగా ఎన్నికైన తర్వాత..రాష్ట్ర ప్రభుత్వంలో కీరోల్‌లో కంటిన్యూ అయ్యారు.వైఎస్..కేవీపీని నమ్మినంతగా మరే నేతను నమ్మలేదు. ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా సేమ్ సిచువేషన్‌ను కంటిన్యూ చేసేలా ఉందనే చర్చ కూడా బలంగా వినిపిస్తోంది. పొలిటికల్ అడ్వైజరీ పోస్ట్‌ను కూడా ఎవరికి ఇవ్వకుండా..ఇన్ డైరెక్ట్‌గా వేం నరేందర్ రెడ్డినే కొనసాగిస్తారనే చర్చ కూడా జరుగుతుంది. సలహాదారు పోస్ట్ విషయంలో నేతల ఆశలు మాటేమిటి? సీఎం రేవంత్ ఆలోచన ఏంటో ఇప్పట్లో అయితే క్లారిటీ వచ్చే అవకాశం లేదంటున్నారు.

## బడా కంపెనీలే లక్ష్యంగా వాట్సాప్ లో

# కొత్త తరహా మోసం.. జాగ్రత్త

**హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్**

వ్యాపార సంస్థల అధినేతలు, సీఈఓలు, సీఎఫ్ఓలే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు సరికొత్త వాట్సాప్ మోసాలకు పాల్పడుతున్నారని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్, తెలిపారు. సంస్థల అధికారిక ఈమెయిల్స్‌కు హానికరమైన ఫిషింగ్ లింకులు పంపడం ద్వారా కంప్యూటర్లలోకి మాల్వేర్‌ను ప్రవేశపెడుతున్నారని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల సిస్టమ్స్‌పై నేరగాళ్లు పూర్తిస్థాయి రిమోట్ యాక్సెస్‌ను పొందుతూ అక్రమాలకు తెరలేపుతున్నారని చెప్పారు. సిస్టమ్ నియంత్రణలోకి వచ్చిన తర్వాత అందులో యాక్టివ్‌గా ఉన్న వాట్సాప్ వెబ్ సెషన్లను నేరగాళ్లు చాకచక్యంగా వినియోగిస్తున్నారని అన్నారు. సీఈఓ లేదా సీఎఫ్ఓల పేరుతో అకౌంటెంట్లకు తప్పుదారి పట్టించే సందేశాలను పంపిస్తూ నమ్మిస్తున్నారని తెలిపారు. తాము అత్యవసర సమావేశంలో ఉన్నామని, ఫోన్ ఎత్తడం వీలుపడదని చెబుతూ కోట్లాది రూపాయలు కాజేస్తున్నారని పేర్కొన్నారు. సోషల్ ఇంజనీరింగ్ వ్యూహాలతో తక్షణమే తమ ఖాతాలకు డబ్బును బదిలీ చేయించుకుంటున్నారని చెప్పారు. పై అధికారుల నంబర్ల నుంచే సందేశాలు వస్తుండటంతో అకౌంటెంట్లు కూడా



నిజమేనని నమ్మి మోసపోతున్నారని అన్నారు. ఇటీవల హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఇటువంటి కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. ప్రతి కంపెనీ కూడా ఇటువంటి సైబర్ దాడుల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాట్సాప్‌లో పై అధికారుల పేరుతో వచ్చే ఆర్థిక అభ్యర్థనలను గుడ్డిగా నమ్మకూడదని పేర్కొన్నారు. వెంటనే అధికారులకు నేరుగా ఫోన్ చేసి ఆ సందేశం నిజమేనా కాదా అని ధృవీకరించుకోవాలని చెప్పారు. ఆఫీసు సిస్టమ్స్‌లో నాణ్యమైన ఫైర్‌వాల్స్ మరియు యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్‌లను నిరంతరం అప్‌డేట్ చేసి ఉంచాలని అన్నారు. వాట్సాప్ వెబ్ వాడిన ప్రతిసారి తప్పకుండా లాగౌట్ చేయడం మర్చిపోవద్దని తెలిపారు. సాంకేతిక భద్రతా ప్రమాణాలను పాటించడం ద్వారానే ఇటువంటి దాడులను ఎదుర్కోగలమని పేర్కొన్నారు.ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని సజ్జనర్ చెప్పారు. అలాగే బాధితులు http://cybercrime.gov.in పోర్టల్‌లో తమ ఫిర్యాదును వెంటనే నమోదు చేయాలని అన్నారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా జాగ్రత్త వహించాలని ఆయన తెలిపారు.

# బెర్త్ కోసం వ్యూహాలు

- మొదటి పేజీ తరువాయి



చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యోచిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న మంత్రుల పనితీరును బేరీజు వేసి, అవసరమైతే ఒకరిద్దరిని తప్పించి కొత్త వారికి అవకాశం ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో అధిష్టానం నుంచి గ్రీన్ సిగ్నల్ రావాల్సి ఉంది. అయితే, ఈ మార్పుల వల్ల పార్టీలో అంతర్గత విభేదాలు లేదా అసంతృప్తి తలెత్తకుండా జాగ్రత్త పడాలని అధిష్టానం సూచించినట్లు సమాచారం.విస్తరణ వార్తలతో ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. పదవి దక్కుతుందని ఆశపడ్డ నాయకులు విస్తరణ వాయిదా పడటంతో కొంత నిరాశకు గురైనప్పటికీ, తమ ప్రయత్నాలను మాత్రం కొనసాగిస్తూనే ఉన్నారు. కొందరిలో రిలాక్స్ కనిపిస్తుంటే, మరికొందరిలో టెన్షన్ పెరుగుతోంది. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాతే తెలంగాణలో కేబినెట్ విస్తరణపై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉంది.మొత్తానికి, తెలంగాణ మంత్రివర్గ విస్తరణ కేవలం రాష్ట్ర రాజకీయాలకే పరిమితం కాకుండా, జాతీయ స్థాయిలో కాంగ్రెస్ అనుసరిస్తున్న ఎన్నికల వ్యూహాలతో ముడిపడి ఉంది. ఐదు రాష్ట్రాల ఎన్నికల సందడి ముగిసిన తర్వాతే రేవంత్ రెడ్డి తన టీమ్ లో ఎవరికి చోటు కల్పిస్తారు, ఎవరిని మారుస్తారనేది స్పష్టమవుతుంది. అప్పటి వరకు ఆశావహులు వేచి చూడక తప్పని పరిస్థితి నెలకొంది.

# కాళేశ్వరం చుట్టూ రాజకీయం

- మొదటి పేజీ తరువాయి



బీఆర్ఎస్ ఎంపీలు అడ్డుతగలడం వికటించింది. కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ దీనిపై ఘాటుగా స్పందించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో దాదాపు లక్ష కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అయిందని కుండబద్దలు కొట్టారు. ప్లానింగ్, డిజైన్ లోపాల వల్లే మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిందని కేంద్రం అధికారికంగా ప్రకటించడం బీఆర్ఎస్‌కు చావుదెబ్బ వంటిది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏవైతే ఆరోపణలు చేస్తోందో, వాటన్నింటినీ కేంద్రం ధ్రువీకరించినట్లయింది.సాధారణంగా తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటాయి. కానీ, కాళేశ్వరం విషయంలో మాత్రం ఈ రెండు పార్టీల వాదన ఒకేలా ఉంది. కాళేశ్వరం ఒక అవినీతి తిమింగలమని, దీనివల్ల తెలంగాణకు ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువని రేవంత్ రెడ్డి వాదిస్తున్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సైతం కాళేశ్వరాన్ని గత ప్రభుత్వం ఒక ఏటీఎం లాగా వాడుకుందని, కేవలం కమీషన్ల కోసమే రీ-డిజైనింగ్ పేరుతో వేల కోట్లు అదనంగా ఖర్చు చేశారని విమర్శించారు. ఢిల్లీ వేదికగా బీఆర్ఎస్ ఇమేజ్‌ను దెబ్బతీయడంలో బీజేపీ సక్సెస్ కాగా, దానిని రాష్ట్రంలో పొలిటికల్ మైలేజీగా మార్చుకోవడంలో రేవంత్ రెడ్డి దూకుడు ప్రదర్శిస్తున్నారు.నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చిన నివేదికలు ఇప్పటికే బీఆర్ఎస్ నాయకత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో లీకేజీలు బయటపడటం సాంకేతిక వైఫల్యాలు మాత్రమే కాదు, అవి రాజకీయ వైఫల్యాలుగా ముద్రపడ్డాయి. పార్లమెంట్‌లో అమరావతి అంశంపై మాట్లాడబోయి, కాళేశ్వరం అంశాన్ని తెరపైకి తెచ్చి బీఆర్ఎస్ ఎంపీలు సెల్ఫ్ గోల్ చేసుకున్నారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ప్రస్తుతం కాళేశ్వరంపై అటు రాష్ట్రంలో విజిలెన్స్ విచారణ, ఇటు కేంద్ర సంస్థల నివేదికలు కొనసాగుతున్నాయి. "లక్ష కోట్లు నీళ్లపాలు" అనే మాట బీఆర్ఎస్ కు ఇబ్బందికరంగా మారింది. దీనిని కప్పిపుచ్చుకోవడానికి బీఆర్ఎస్ చేస్తున్న ప్రయత్నాలు వర్కవుట్ కావట్లేదు. ప్రాజెక్టు వైఫల్యంపై సమాధానం చెప్పలేక, అటు కాంగ్రెస్ ఇటు బీజేపీలను ఎదుర్కోలేక గులాబీ దళం ప్రస్తేతుతం రక్షణలో పడిపోయింది.

# మమతకు ముస్లిం కూటమి కష్టాలు



**బెంగాల్, ఏప్రిల్ 4:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో దశాబ్దాలుగా తృణమూల్ కాంగ్రెస్ వెన్నంటి ఉన్న ముస్లిం ఓటు బ్యాంకు లో ఈసారి అనూహ్యమైన మార్పులు కనిపిస్తున్నాయి. ముఖ్యం అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఎంఐఎం , మాజీ టీఎంసీ ఎమ్మెల్యే హుమాయున్ కబీర్ స్థాపించిన ఆమ్ జనతా ఉన్నయన్ పార్టీ జతకట్టడం బెంగాల్ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీసింది. ఈ కూటమి మమతా బెనర్జీ విజయ అవకాశాలను దెబ్బతీస్తుందా? లేక బీజేపీకి పరోక్షంగా లాభం చేకూరుస్తుందా? బెంగాల్ జనాభాలో సుమారు 30 శాతం ఉన్న ముస్లిం ఓటర్లు 2011 నుండి మమతా బెనర్జీకి రక్షణ కవచంగా నిలుస్తూ వస్తున్నారు. అయితే, ఈసారి ఎంఐఎం-ఏజేయూపీ కూటమి 182 స్థానాల్లో పోటీ చేస్తామని ప్రకటించడం టీఎంసీ గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. ముఖ్యంగా ముర్షిదాబాద్, మాల్దా, ఉత్తర దినాజ్‌పూర్ వంటి జిల్లాల్లో ఈ కూటమి ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉంది. హుమాయున్ కబీర్ లాంటి క్షేత్రస్థాయి పట్టున్న నేత తోడవ్వడం ఒవైసీకి కలిసివచ్చే అంశం.ఒవైసీ తన ప్రసంగాల్లో మమతా బెనర్జీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నారు. ముస్లింలను కేవలం ఓటు బ్యాంకుగా చూశారు తప్ప, వారికి రాజ్యాధికారంలో వాటా ఇవ్వలేదు అని ఆయన ఆరోపిస్తున్నారు. లక్షలాది మంది ముస్లింల ఓబీసీ సర్టిఫికెట్లను రద్దు చేయడాన్ని ప్రధాన అస్త్రంగా మార్చుకుని, మైనారిటీలలో అసంతృప్తిని రగిలిస్తున్నారు. కేరళ, తమిళనాడు ఎన్నికలకు దూరంగా ఉండి కేవలం బెంగాల్‌పైనే దృష్టి సారించడం ఒవైసీ సీరియస్‌నెస్‌ను తెలియజేస్తోంది.టీఎంసీ శ్రేణులు ఈ కూటమిని బీజేపీకి బి టీమ్ అని అభివర్ణిస్తున్నాయి. ముస్లిం ఓట్లు చీలితే అది సహజంగానే బీజేపీకి లాభిస్తుందని, అందుకే కేంద్రంలోని పెద్దల కనుసన్నల్లోనే ఈ పొత్తు కుదిరిందని మమత ఆరోపిస్తున్నారు. అయితే, మమత అసమర్థ పాలన వల్లే బీజేపీ బెంగాల్‌లో 77 స్థానాలకు చేరుకుంది, దానికి మేము కారణం కాదు అని ఒవైసీ ధీటుగా సమాధానమిస్తున్నారు. ముస్లింలకు స్వతంత్ర రాజకీయ నాయకత్వం కావాలన్నదే తన లక్ష్యమని ఆయన స్పష్టం చేస్తున్నారు. ఈ కూటమి కేవలం ముస్లింలకే పరిమితం కాకుండా, దళితులు, ఆదివాసీలను కూడా కలుపుకుని వెళ్లాలని చూస్తోంది. ముఖ్యంగా భవానీపూర్‌లో మమతపై పూనమ్ బేగంను బరిలోకి దించడం ద్వారా సామాన్య ముస్లిం ఓటర్లను ఆకర్షించాలని చూస్తున్నారు. దాదాపు 80 నుండి 90 నియోజకవర్గాల్లో ముస్లింలు గెలుపోటములను శాసించే స్థితిలో ఉండటంతో, అక్కడ పడే ప్రతి ఓటు మమతకు నష్టం, బీజేపీకి లాభం అన్నట్లుగా మారింది.బెంగాల్ ప్రజలు ఈసారి సెక్యులరిజం పేరుతో మమతకు మద్దతు ఇస్తారా? లేక తమ సొంత గొంతుక కోసం ఒవైసీ-కబీర్ కూటమి వైపు మొగ్గు చూపుతారా? అన్నది తేలాల్సి ఉంది. ఒకవేళ ముస్లిం ఓట్లలో స్వల్పంగా 5 నుండి 10 శాతం చీలిక వచ్చినా, అది బెంగాల్ పీఠంపై మమత కూర్చోవడానికి అడ్డంకిగా మారవచ్చు. మే 4న వెలువడే ఫలితాలు ఈ ముస్లిం రాజకీయాల భవిష్యత్తును నిర్ణయించనున్నాయి.

వార్తాతరంగాలు ఆదివారం 05 ఏప్రిల్ 2026

# బాలల చట్టాలపై అవగాహన..

**బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి పనిలో కాదు...**

**అనాథ బాలలకు "మిషన్ వాత్సల్య పథకం" జి . విద్యాసాగర్**

**బాలల పరిరక్షణ, మహిళా శిశు సంక్షేమ శాఖ సూర్యాపేట జిల్లా అధికారి.**

**చదువుతోపాటు సంస్కారం ముఖ్యము...**

**పనిని 100% పూర్తి చేయాలి. ....**

**మానవ అభ్యుదయ అధ్యయన సంస్థ, ఆచార్య రమేష్ గురూజీ.**




శనివారం నాడు కోదాడ పట్టణంలో పీఎంశ్రీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ"ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన" బాలల చట్టాలపై అవగాహన" కార్యక్రమంలో బాలల పరిరక్షణ, మహిళా –శిశు సంక్షేమ శాఖ సూర్యాపేట జిల్లా అధికారి జి. విద్యాసాగర్, పాల్గొని మాట్లాడినారు. బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి పనిలో కాదు, బాల్యవివాహాలు, బాలలపై లైంగిక వేధింపులు నేరం, మిషన్ వాత్సల్య పథకం ద్వారా మత్తు పదార్థాలకు బానిసలైన బాలలకు పునరావాసం ఏర్పాటు చేయడం ,అనాథ బాలలకు స్పాన్సర్ షిప్ కార్యక్రమాలు నిర్వహించడం, చట్టబద్ధమైన దత్తత కార్యక్రమాలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించినారు. బాలల చట్టాలు పరిరక్షణ కోసం హెల్ప్ లైన్ నెంబర్లు 100 ,108,1098 ఉపయోగించుకోవాలని తెలిపినారు ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటుచేసిన "సంస్కార వికాస సాధన యోగ విజ్ఞాన శిబిరం" కార్యక్రమంలో మానవ అభ్యుదయ అధ్యయన సంస్థ ఆచార్య రమేష్ గురూజీ పాల్గొని విద్యార్థులకు ఏకాగ్రత జ్ఞాపకశక్తి చదువుపై శ్రద్ధ సృజనాత్మక శక్తి పెరిగే ఆలోచన విధానాలను వివరించారు. చదువుతోపాటు సంస్కారం ముఖ్యమని, అమ్మ నాన్న గురువులు అతిథులను గౌరవించడం గురించి విద్యార్థులకు తెలియజేసినారు. మానవతా విలువలు, జీవిత సత్యాలు, సేవా నాయకత్వ లక్షణాల గురించి విద్యార్థులకు వివరించారు. ప్రారంభించిన పనిని మధ్యలో వదిలేయకుండా 100% పూర్తిచేసే అలవాటును విద్యార్థులు సాధన చేయాలని తెలిపారు. కార్యక్రమాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోదాడ మండల విద్యాధికారి ఎండి .సలీం షరీఫ్, పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు డి మార్కండేయ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 'పోలీస్ మామలు' అంటూ వాట్సాప్ గ్రూప్.. ఎస్ఐ ఎంట్రీతో సభ్యులు షాక్..

**హైదరాబాద్, ఏప్రిల్ 3**: పెద్దపల్లి జిల్లాలో ఓ వింత సంఘటన చోటుచేసుకుంది. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల నుంచి తప్పించుకోవటానికి కొందరు వాహనదారులు వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసుకున్నారు. అందులో వచ్చే సమాచారం ఆధారంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల నుంచి తప్పించుకుని తిరుగుతున్నారు. అయితే, ట్రాఫిక్ ఎస్ఐ గ్రూప్‌లోకి ఎంట్రీ ఇవ్వటంతో సభ్యులు షాక్ అయ్యారు. భయంతో గ్రూపు నుంచి ఎగ్జిట్ అయ్యారు. సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ వ్యక్తి పట్టుబడ్డాడు. పోలీసులు అతడి ఫోన్ చెక్ చేయగా 'పోలీస్ మామలు' అనే వాట్సాప్ గ్రూప్ కనిపించింది. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల నుంచి తప్పించుకోవడానికి కొంతమంది వాహనదారులు కలిసి ఆ గ్రూప్‌ను క్రియేట్ చేశారు. ఆ గ్రూప్‌లో వచ్చే సమాచారం ఆధారంగా సభ్యులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలనుంచి తప్పించుకుని తిరుగుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన ట్రాఫిక్ ఎస్ఐ.. ఆ వాట్సాప్ గ్రూప్‌లోని సభ్యులకు షాక్ ఇచ్చే పని చేశారు. ఆ గ్రూపులో జాయిన్ అయ్యారు. తమ గ్రూప్‌లో ఎస్ఐ జాయిన్ అయ్యాడని తెలియగానే సభ్యులందరూ భయపడిపోయారు. వెంటనే గ్రూప్ నుంచి ఎగ్జిట్ అయ్యారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ ఎస్ఐ ఆ గ్రూప్‌లో ఓ వీడియో మెసేజ్ పెట్టారు. ఆ వీడియో మెసేజ్‌లో.. 'మీ నంబర్లు అన్నీ సేవ్ చేసుకున్నాను. త్వరలో అందరికీ కౌన్సిలింగ్ ఏర్పాటు చేస్తాను' అని అన్నారు. ఆ వీడియో కాస్తా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# తెలంగాణలో బిజెపి అధికారంలోకి రావాలని రామయ్యను కోరుకున్నాము...

**ఎంపీ ఈటల రాజేందర్**



**హుజూరాబాద్:**హుజురాబాద్ నియోజకవర్గం ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి రథోత్సవ కార్యక్రమానికి మల్కాజిగిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్ ముఖ్యఅతిథిగా హాజరైయారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కలు చెల్లించుకున్నారు. రథోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లందకుంట సీతారామచంద్ర స్వామి ఆలయం శ్రీరాముడు నడిగాడిన ప్రాంతంగా పేరుగాంచింది.. స్వయంభు దేవాలయం. వందల సంవత్సరాల క్రితం ఈ దేవాలయం కట్టబడింది. ఈ చుట్టుపక్క ప్రాంత ప్రజలందరూ వేలాదిగా తరలివచ్చి సీతారామ కళ్యాణోత్సవం మొదలుపెట్టి రథోత్సవం వరకు గొప్పగా నిర్వహించుకుంటున్నారని అన్నారు. జైశ్రీరామ్ నినాదాలతో ఈ ప్రాంతమంతా దద్దరిల్లుతుంది. ఈ ఆలయాన్ని గొప్పగా నిర్మించుకోవాలని పాత ఆలయం కి సౌకర్యాలు పెంచి గ్రామస్తుల సహకారంతో గొప్ప రథాన్ని నిర్మాణం చేసుకున్నాము. ఈ ఆలయ ప్రాంగణమంతా కొన్ని కోట్ల రూపాయలతో బాగు చేయించాము. వేలాదిమంది ఇక్కడ పెళ్లిళ్లు చేసుకుంటారు, అనేక దైవిక కార్యక్రమాలు జరుపుకునేందుకు వీలుగా..ఈ ప్రాంత ప్రజలకు సౌకర్యాలు ఉండాలని రెండు పెద్ద షెడ్డులు నిర్మాణం చేయడం జరిగింది. ఒక మాటలో చెప్పాలంటే ఈ ఆలయంలో నేను ఇక్కడ ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న కాలంలో గొప్పగా అభివృద్ధి చేశాము. రాబోయే కాలంలో మరింత అభివృద్ధి చేసుకుందాము. వేలమంది భక్తులు ఇక్కడికి వచ్చేలా చేయడంలో ఇక్కడ ఉన్న యాజమాన్యం తోడ్పాటు అందించాలని కోరుతున్నామని అన్నారు. ఈరోజు మొక్కులు చెల్లించుకున్నాము. రాబోయే కాలంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావాలని ప్రజలకు మంచి జరగాలని మనస్ఫూర్తిగా కోరుకున్నామని అన్నారు.

# స్కూల్ ఫీజులపై తల్లిదండ్రుల ఆందోళన....

**హైదరాబాద్:**హైదరాబాద్లోని షేక్పేట్ ఇంటర్నేషనల్ స్కూల్ వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. అడ్మిషన్ సమయంలో ప్రతి మూడు సంవత్సరాలకు కేవలం 10 శాతం మాత్రమే ఫీజు పెంపు ఉంటుందని హామీ ఇచ్చినప్పటికీ, ప్రస్తుతం ప్రతి ఏడాది ఫీజులను పెంచుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధంగా తరచూ పెరుగుతున్న ఫీజులు తమపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నాయని తల్లిదండ్రులు తెలిపారు. అంతేకాకుండా, జూలైలో చెల్లించాల్సిన ఫీజును ముందుగానే మార్చిలోనే వసూలు చేయడం, మళ్లీ జూలైలో సెకండ్ టర్మ్ ఫీజు పేరుతో వసూలు చేస్తున్నారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు చెల్లింపులో ఒకరోజు ఆలస్యమైనా రోజుకు పది రూపాయల పెనాల్టీ విధించడం కూడా తీవ్రంగా బాధిస్తున్న అంశమని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యా, వైద్య రంగాలు బలంగా ఉన్నప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమని చెబుతూ, ప్రైవేట్ విద్యాసంస్థల ఇలాంటి ఫీజు విధానాలను ప్రభుత్వం కట్టడి చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఈ సమస్యపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# కాంగ్రెస్ కు దూరమౌతున్న సీనియర్లు

**హైదరాబాద్, ఏప్రిల్ 4:**సీనియర్లు, సీనియర్ లీడర్ల వారసులు. వాళ్లంతా కాంగ్రెస్ పార్టీకి లాయలిస్ట్‌లు. కానీ ఒక్కక్కొరుగా హస్తం పార్టీకి గుడ్ బై చెప్తున్నారు. పార్టీని నమ్ముకుని ఉంటే నట్టేట ముంచుతున్నారని మండిపడుతూ..ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీతో ఉన్న అనుబంధాన్ని తెంచుకుంటున్నారు. లేటెస్ట్‌గా దివంగత నేత డీఎస్ తనయుడు సంజయ్ కూడా కాంగ్రెస్ గూటి నుంచి బయటికి వచ్చేందుకు రెడీ అయ్యారు. ఈ మధ్యే సీనియర్ మోస్ట్ కాంగ్రెస్ లీడర్ జీవన్‌రెడ్డి కూడా హస్తం పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఎక్కడైనా ప్రతిపక్షాల నుంచి అధికార పార్టీలోకి జంపింగ్స్ ఉంటాయ్. లేటెస్ట్‌గా తెలంగాణలో డిఫరెంట్ సీన్ కనిపిస్తోంది. కాంగ్రెస్ అంటే ఆ నేతలు..ఆ నేతల పేరు ఎత్తితే కాంగ్రెస్ గుర్తుకు వచ్చే లీడర్లు..హస్తం పార్టీకి హ్యాండ్ ఇస్తున్నారు. ఇప్పటికే జగిత్యాలకు చెందిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి పార్టీని వీడారు. నాలుగు దశాబ్ధాలకు పైగా కాంగ్రెస్‌తో అనుబంధం ఉన్న ఆయన పార్టీ కష్టకాలంలో అండగా నిలిచారు. అలాంటి నేత కాంగ్రెస్‌ను వీడటం చర్చనీయాంశంగా మారింది.తనకు అన్యాయం జరిగిందని, గుర్తింపు ఇవ్వలేదన్న ఆవేదనతో..సొంత పార్టీ అధిష్టానం, రాష్ట్ర పెద్దల తీరుపై అసహనం వ్యక్తం చేస్తూ హస్తం పార్టీకి గుడ్‌బై చెప్పారు జీవన్‌రెడ్డి. ఇప్పుడు మరో కుటుంబం కూడా కాంగ్రెస్‌తో బంధం తెచ్చుకుంది. దివంగత నేత డి. శ్రీనివాస్ తనయుడు ధర్మపురి సంజయ్ కాంగ్రెస్‌కు రాజీనామా చేయడానికి రెడీ అయ్యారట. గత ఎన్నికల్లో నిజామాబాద్ అర్బన్ టికెట్ ఆశిస్తే ఇవ్వలేదని..కార్పొరేషన్ పదవి ఇస్తామని మొండి చెయ్యి చూపారని అసహనం వ్యక్తం చేస్తున్నారు.



పార్టీకి లాయల్‌గా ఉన్నా పదవి ఇవ్వలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు సంజయ్.కాంగ్రెస్ పార్టీకి ఉమ్మడి రాష్ట్రంలో రథసారథిగా పని చేసిన డి.శ్రీనివాస్‌కు..రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక స్థానం ఉంది. డీఎస్ పీసీసీ చీఫ్‌గా ఉన్నప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రెండుసార్లు అధికారంలోకి వచ్చింది. అలాంటి డీఎస్ తెలంగాణ ఏర్పడిన తర్వాత అనివార్య కారణాలతో కాంగ్రెస్‌ను వీడారు. బీఆర్ఎస్‌లోకి రాజ్యసభ సభ్యుడు అయ్యారు. ఆ తర్వాత కొంతకాలానికి మళ్లీ కాంగ్రెస్ గూటికి చేరారు. కాంగ్రెస్ పార్టీపై మమకారంతో తిరిగి వస్తున్నానని..తాను చనిపోతే తనపై కాంగ్రెస్ జెండా కప్పాలంటూ చెప్పిన నాయకుడు డీఎస్.ఆయన కాంగ్రెస్‌లోకి వచ్చినా తన ఇద్దరు కుమారుల్లో నిజామాబాద్ ఎంపీ అరవింద్ బీజేపీలో ఉన్నారు. డీఎస్ మరో తనయుడు కాంగ్రెస్‌లో ఉన్నారు. డీఎస్ మరణానంతరం కూడా..ఆయన పెద్ద కొడుకు సంజయ్ కాంగ్రెస్‌తోనే ఉంటూ వచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అవుతున్నా..సంజయ్ విషయంలో పార్టీ పెద్దలు పెద్దగా పట్టించుకోవడం లేదట. పైగా ప్రస్తుతం పీసీసీ చీఫ్‌గా ఉన్న మహేష్ గౌడ్‌కు డీఎస్ కుటుంబానికి కాస్త గ్యాప్ ఉందనే ప్రచారం ఉంది. పీసీసీ చీఫ్‌గా మహేష్ గౌడ్ ఉన్నంత కాలం పార్టీలో కానీ, ప్రభుత్వంలో కానీ తనకు ఎలాంటి ప్రాధాన్యత దక్కదనే ఆలోచనకు వచ్చిన సంజయ్..కాంగ్రెస్ వీడుతున్నారట.కాంగ్రెస్‌తో బలమైన బంధం ఉన్న జీవన్ రెడ్డి దారిలోనే డీఎస్ కొడుకు సంజయ్ నడవాలనే ఆలోచనలో ఉన్నారట. జీవన్ రెడ్డికి, డీఎస్‌కు మధ్య మంచి స్నేహం ఉండేది. అందుకే జీవన్ రెడ్డి దారిలో సంజయ్ వెళ్లాలనే ఆలోచన చేస్తున్నారట. సంజయ్ కూడా బీఆర్ఎస్‌లో చేరే ఛాన్స్ ఉందనే చర్చ జోరుగా నడుస్తోంది. పైగా ఇద్దరు నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అంతో ఇంతో పట్టున్న నేతలు కావడంతో..కాంగ్రెస్‌కు అంతో ఇంతో డ్యామేజ్ తప్పదన్న చర్చ జరుగుతోంది.మరో దివంగత నేత పీజేఆర్ మరణానంతరం తనయుడు కూడా గతంలోనే కాంగ్రెస్ పార్టీని వీడి ప్రస్తుతం బీఆర్ఎస్‌లో కొనసాగుతున్నారు. తన తండ్రి పార్టీకి చేసిన సేవలను గుర్తించైనా తగిన గుర్తింపు ఇవ్వలేదన్న అసహనంతో విష్ణువర్ధన్‌రెడ్డి హస్తం పార్టీని వీడారు. ఇలా కాంగ్రెస్‌తో అవినాభావ సంబంధం ఉన్న కీలక నేతలు..లీడర్ల వారసులు పార్టీని వీడుతుండటం తెలంగాణ పాలిటిక్స్‌లో చర్చనీయాంశంగా మారింది.

# టీఆర్ఎస్ పేరు వాడేసుకుంటారా..?

**హైదరాబాద్, ఏప్రిల్ 4:**టీఆర్ఎస్ (తెలంగాణ రాష్ట్రసమితి).. ఒకప్పుడు గ్రామ గ్రామాన నినదించిన పేరు.. వినిపించిన పేరు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి తెలంగాణ ఆవిర్భావం వరకు.. కూడా టీఆర్ ఎస్ తెలంగాణ పల్లె నుంచి పట్నం వరకు ప్రజల నరాల్లో జీర్ణించుకుపోయింది. పూర్తిస్థాయి పేరు పలకడం రాని వారు కూడా –టీఆర్ఎస్– జపం చేసిన రోజులు ఇంకా గుర్తుండే ఉన్నాయి. టీఆర్ ఎస్ అధినేత కేసీఆర్.. అధికారంలోకి వచ్చిన ఏడు సంవత్సరాల వరకు టీఆర్ ఎస్ పార్టీనే ఉంది. ఆ తర్వాత.. దానిని బీఆర్ ఎస్‌గా మార్పు చేశారు. .. ఇప్పుడు ఈ –టీఆర్ ఎస్– పేరును వినియోగించుకునే దిశగా కేసీఆర్ తనయ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అడుగులు వేస్తున్నారా? అంటే.. ఔననే సమాధానమే వినిపిస్తోంది. ప్రస్తుతం టీఆర్ ఎస్ ఖాళీగా ఉందని.. దానిని ఎవరూ వినియోగించుకోవడం లేదని.. దీనిని ఎవరైనా వినియోగించుకునే సౌకర్యం ఉందని కవిత వ్యాఖ్యానించారు. దీనిని బట్టి.. ఆమెస్థాపించ బోయే కొత్త పార్టీకి ఈ పేరు పెట్టినా ఆశ్చర్యంలేదన్న వాదన వినిపిస్తోంది వాస్తవానికి కొన్ని రోజుల కిందట.. కవిత.. తన పార్టీ పేరును తెలంగాణ –జాగృతి–గానే పేర్కొన్నారు. ఈ పేరునే కేంద్ర ఎన్నికల సంఘంలో నమోదు చేసేందుకు ఇచ్చినట్టు ప్రచారం కూడాఉంది. కానీ, ఇంత లోనే ఆమె తనదైన శైలిలో వ్యూహం మార్చినట్టు తెలుస్తోంది. తెలంగాణ జాగృతి కంటే.. –టీఆర్ఎస్– పేరు ఇప్పటికే ప్రజలకు చేరువైన నేపథ్యంలో ప్రజల నాలుకలపై ఒకప్పుడు పెద్ద ఎత్తున కదలాడిన పేరు కూడా కావడంతో ఆ పేరునే ఆమె ఓన్ చేసుకునే అవకాశం కనిపిస్తోంది. ఈ విషయాన్ని నర్మగర్భంగా చెప్పుకొచ్చిన కవిత.. --పాత పేరు, కొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తా-- అని వ్యాఖ్యానించారు. టీఆర్ఎస్ పేరు ఫ్రీ అయిందని అన్నారు. ఈ పేరును ఇప్పుడు ఎవరైనా వాడుకోవచ్చని వ్యాఖ్యానించారు. అయితే.. తాను తీసుకుంటున్నట్టుగా ఆమె స్పష్టం చేయలేదు. ఇదిలావుంటే..



ఆచార్య జయశంకర్ సిద్ధాంతాల ప్రకారమే తమ పార్టీ నడుస్తుందని కవిత వెల్లడించారు. తాము ఏ బీహార్‌కు చెందిన వ్యక్తుల సలహాలను తీసుకునేది లేదన్నారు. సో.. దీనిని బట్టి కవిత పార్టీ –టీఆర్ ఎస్– అయ్యే అవకాశం ఉందన్న చర్చకు తెరలేచింది.

# ఖానాపూర్ చైర్మన్ ఎన్నిక వాయిదా..

**బీజేపీ, బీఆర్ఎస్ సీరియస్**




**నిర్మల్ జిల్లా:** జిల్లాలో ఉత్కంఠ రేపిన ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా వేయడంపై బీజేపీ, బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహించారు. ఖానాపూర్ మున్సిపల్ కార్యాలయంలోనే బైఠాయించి ఆందోళనకు దిగారు. బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థిని చైర్మన్‌గా ఎన్నుకోవడానికి సరిపడా కోరం ఉన్నప్పటికీ.. ఎన్నికను అధికారులు వాయిదా వేయడంపై మండిపడుతున్నారు. దీంతో ఆగ్రహించిన ఇరుపార్టీల కౌన్సిలర్లు, నేతలు, కార్యకర్తలు నిరసనకు దిగారు. వారికి మద్దతుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితీశ్ రాథోడ్, బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ జాన్సన్ నాయక్ ఆందోళనలో పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ వచ్చి ఖానాపూర్ మున్సిపల్ ఎన్నికను నిర్వహించాలని, లేదంటే చనిపోయే వరకూ ఇక్కడే కూర్చుంటామని వారు తేల్చి చెప్పారు. అలా కాకుంటే హైదరాబాద్ ఎన్నికల సంఘం వద్ద ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని డిమాండ్ చేశారు. కౌన్సిల్ సభ్యులకు అధికారులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా చైర్మన్ ఎన్నిక ఎలా వాయిదా వేస్తారని కౌన్సిలర్లు ప్రశ్నిస్తున్నారు. ఈ నిరసన కారణంగా తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో ఖానాపూర్ 8వ వార్డు బీజేపీ కౌన్సిలర్ బొప్పారావు సత్యవతి కళ్లు తిరిగి పడిపోయారు. ఆమెను తోటి కౌన్సిలర్లు అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఖానాపూర్ మున్సిపల్ ఎన్నిక వాయిదా పడినప్పటికీ నేడు మరో రెండు మున్సిపాలిటీలకు ఎన్నికలు సజావుగా జరిగాయి. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీని బీఆర్ఎస్– సీపీఐ కూటమి దక్కించుకుంది. చైర్‌పర్సన్‌గా బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ గుడిసెల సంధ్యారాణి ఎన్నిక కాగా.. వైస్ చైర్‌పర్సన్‌గా సీపీఐ అభ్యర్థి సరిత ఏకగ్రీవం అయ్యారు. కాంగ్రెస్ పార్టీకి బలం లేకపోవడంతో ఎన్నికకు దూరంగా ఉంది. అలాగే రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ పీఠాన్ని బీఆర్ఎస్, బీజేపీ కైవసం చేసుకున్నాయి. చైర్మన్‌గా బీఆర్ఎస్ అభ్యర్థి టేకుల సుదర్శన్ రెడ్డి, వైస్ చైర్‌పర్సన్‌గా బీజేపీ అభ్యర్థి శ్యామల ఎన్నికయ్యారు.

# రసాయన శాస్త్రంలో నాగులంచ భుజంగరావు కు పీహెచ్.డీ...



**పటాన్ చెరు:**హైదరాబాదు లోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి భుజంగరావు నాగులంచ డాక్టరేట్ కు అర్హత సాధించారు. ఆర్ పి, ఎచ్పీఎల్సి, ఎల్ సి ఎం ఎస్, ఓ బి డీ విధానాల ద్వారా ఔషధ మోతాదు రూపాలలో జన్య విష మలినాలు, ఐసోమర్లు, విఘటన ఉత్పత్తులను అంచనా వేయడానికి, స్థిరత్వాన్ని సూచించే పద్ధతుల అభివృద్ధి, ధ్రువీకరణ'పై ఆయన సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.కోటేశ్వరరావు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఔషధాలలో ఉండే మలినాలను కచ్చితంగా విశ్లేషించడానికి, పటిష్టమైన, నియంత్రణ ప్రమాణాలకు అనుగుణంగా ఉండే విశ్లేషణా పద్ధతులను అభివృద్ధి చేయడంపై ఈ అధ్యయనం దృష్టి సారించినట్టు తెలియజేశారు. డాక్టర్ భుజంగరావు సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, తదితరులు అభినందించారు

# రోజు ఎంత మంది పేషంట్స్ వస్తున్నారు

**మందులు అందుబాటులో ఉన్నాయా..!!**

**మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు**

**సిద్దిపేట ప్రతినిధి:**హరీష్ రావు మాట్లాడుతూ సకాలంలో డాక్టర్ లు అందుబాటులో ఉండాలి పేద ప్రజలకు వైద్య సేవలు అందించాలానే లక్ష్యం తో గట్ల మల్యాల లో ఆరోగ్య కేంద్రం ఏర్పాటు.వాగు అవుతలి గ్రామాల కు వైద్య సేవల కోసమే ఆరోగ్య సేవలు పేద ప్రజలకు వైద్య సేవల్లో ఎలాంటి ఇబ్బందులు కావద్దు.అన్ని రకాల మందులు మందులు అందుబాటులో ఉంచాలి బ్లడ్ శ్యాంపిల్స్ ఎప్పటికప్పుడు టి దయాగ్నోస్టిక్ కి పంపాలి ఆసుపత్రి నిర్వహణ బాగుండాలి.నంగునూర్ మండలం గట్ల మల్యాల గ్రామం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు. రోజు ఎంత మంది పేషంట్స్ వస్తున్నారు.. మందులు అందుబాటులో ఉన్నాయా. అంటూ మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు నంగునూర్ మండలం గట్ల మల్యాల గ్రామం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు.. ఆసుపత్రి లో అందుతున్న సేవలను అడిగి తెల్సు కున్నారు. సకాలంలో



డాక్టర్ లు అందుబాటులో ఉండాలని, పేద ప్రజలకు వైద్య సేవలు అందించాలానే లక్ష్యం తో గట్ల మల్యాల లో వాగు అవుతలి గ్రామాల ప్రజలకి వైద్య సేవల కోసమే ఏర్పాటు చేశామని చెప్పారు.. పేద ప్రజలకు వైద్య సేవల్లో ఎలాంటి ఇబ్బందులు కావద్దని సూచించారు. రోజు వారి పేషంట్స్ వివరాల రిజిస్టర్ ను పరిశీలించారు. అన్ని రకాల మందులు మందులు అందుబాటులో ఉంచాలని చెప్పారు. బ్లడ్ శ్యాంపిల్స్ ఎప్పటికప్పుడు టి దయాగ్నోస్టిక్ కి పంపాలని ఒక్క రోజుల్లోనే రిపోర్ట్ వారికి అందించాలని చెప్పారు. ఆసుపత్రి నిర్వహణ బాగుండాలని పలు సమస్య ల పై సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని చెప్పారు.

వార్తాతరంగాలు
ఆదివారం 05 ఏప్రిల్ 2026

# వైద్యాధికారుల పనితీరు మెరుగుపడాలి

## వైద్య సిబ్బంది సమయపాలన కచ్చితంగా పాటించాలి
## బయోమెట్రిక్ విధానంలో హాజరు నమోదు తప్పనిసరి చేయాలి
## ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెరగాలి

**జోగులాంబ గద్వాల, ఏప్రిల్ 4 (స్కై న్యూస్):**జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ఇతర ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే వైద్యాధికారులు, సిబ్బంది తమ పనితీరును మెరుగుపరచుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. శనివారం ఐడిఓసి సమావేశపు మందిరంలో నిర్వహించిన వైద్య, ఆరోగ్యశాఖ సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. తాను ఇటీవల జిల్లాలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులను ఆకస్మికంగా తనిఖీ చేసినప్పుడు వివిధ సమస్యలను గుర్తించానన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా పాత ఫైల్స్ క్లియరెన్స్, పనికిరాని ఫర్నిచర్ తొలగించాలని ఆదేశించినప్పటికీ చాలాచోట్ల చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత మెడికల్ అధికారులు బాధ్యతాయుతంగా లేకుంటే తమ కిందిస్థాయి సిబ్బంది కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారన్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, లీవ్ లెటర్ రాయకుండా విధులకు గైర్హాజరైతే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ని పీహెచ్ సీలు, ఇతర ప్రభుత్వ ఆసుపత్రిల్లో బయోమెట్రిక్ విధానంలో హాజరు తప్పనిసరి చేయాలని, యంత్రాల్లో ఏమైనా సమస్యలుంటే పరిష్కరించుకుని వినియోగించాలన్నారు.




ఆయా ఆసుపత్రుల్లోని వివిధ రిజిస్టర్ల నిర్వహణ, వ్యాక్సినేషన్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఆయా ఆసపత్రుల వైద్యాధికారులు తమ సమీపంలోని సబ్ సెంటర్స్ కు, ఇతర క్యాంపులకు వెళ్లినప్పుడు ముందుగానే సంబంధిత రిజిస్టర్లో పేర్కొన్నాలన్నారు. ఎన్సిడి స్క్రీనింగ్ తో పాటు ఇతర కార్యక్రమాలన్నీ వంద శాతం విజయవంతం చేసేలా పనిచేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరగాల్సి ఉందన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా నుంచి వైద్య సేవలకు చాలామంది రోగులు కర్నూలుకు



వెళ్లాల్సిన అవసరం ఏముందని, జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులలోనే మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఏరియా ఆసుపత్రులతో పాటు సబ్ సెంటర్స్ సాయి వరకు ప్రతి 15 రోజులకోసారి వైద్యాధికారులు తమ సిబ్బందితో సమన్వయ సమావేశాలు నిర్వహించి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. వైద్యాధికారులు, డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బంది తమ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. అనంతరం 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల ఆరవ తేదీ నుంచి 11వ తేదీ వరకు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వివిధ కార్యక్రమాల గురించి డిఎంహెచ్వో సంధ్య కిరణ్మయి తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లాలోని అన్ని వైద్య కేంద్రాల డాక్టర్లు, ఇతర వైద్యాధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విజిలెన్స్ తనిఖీలు



**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఏప్రిల్ 4 :** రంగారెడ్డి జిల్లా ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు ఈ తనిఖీల్లో సిబ్బంది హాజరులో లోపాలు, సిటిజన్ ఛార్టర్ లేకపోవడం ఆర్టీఐ బోర్డు దెబ్బతినడం వంటి పలు అవకతవకలు బయటపడ్డాయి అక్రమ రిజిస్ట్రేషన్లు నియమావళి ఉల్లంఘనలు జరిగినట్లు అధికారులు గుర్తించారు ప్రజలు అనుమానాస్పద అంశాలను 14432కు ఫోన్ చేసి సమాచారం అందించాలని విజిలెన్స్ అధికారులు కోరారు ఈ సంఘటన ఉప్పల్, అంబర్పేట్ ప్రాంతాల్లో కలకలం రేపింది.

# నూతన గృహప్రవేశం హాజరైన ఎమ్మెల్యే



**జోగులాంబ గద్వాల, ఏప్రిల్ 4 (స్కై న్యూస్):** గద్వాల జిల్లా కేంద్రంలోని నల్లకుంట నందు పెట్రోల్ బంక్ నాగేంద్ర వారి నూతన గృహప్రవేశం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరై నాగేంద్ర హార్దిక శుభాకాంక్షలు తెలపారు.ఎమ్మెల్యే కి ఇంటికి యజమాని శాలువా కప్పి ఘనంగా సత్కరించార.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి నర్సింహులు యాదవ్, వైస్ చైర్మన్ శంకర్, మాజీ కౌన్సిలర్స్ మురళి, నరహరి శ్రీనివాసులు, నరహరి గౌడు, ఇసాక్, నాయకులు సుదర్శన్, లక్ష్మన్న, రామాంజనేయులు, నాగేంద్ర యాదవ్, ధర్మనాయుడు, వీరేష్, షాషా, రామచంద్రుడు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీని శుబ్రం చేసిన మున్సిపల్ సిబ్బంది



**నారాయణపేట ఏప్రిల్ 4: (స్కైన్యూస్)** నారాయణపేట మున్సి పాలిటీ లోని 8వవార్డులో ఎంతోకాలంగా శుభ్రం చేయకుండా ఉండిపోయిన మెయిన్ రోడ్డులోని మురికి కాలువను శనివారం మున్సి పల్ శానిటరీ సిబ్బంది శుభ్రం చేశారు. ఇందుకు గాను 8వ వార్డు కౌన్సిలర్ సత్యమ్మ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సిద్ధన్ లక్ష్మణ్ మున్సి పల్ కమిషనర్ నర్సయ్య,శానిటరీ ఇన్ స్పెక్టర్ నరేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గొల్ల లక్ష్మణ్, కురువ మనోజ్ జరాగ్ రాముతదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ చెక్కుల పంపిణీ



**నారాయణపేట ఏప్రిల్ 4: (స్కైన్యూస్)** మరికల్ మండలం తీలేరు గ్రామంలో శనివారం డిసిసి అధ్యక్షుడు కే.ప్రశాంత్ రెడ్డి పలువురికి సీఎం రిలీఫ్ చెక్కుల ను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రేవతమ్మ జిల్లా నాయకులు సూర్య మోహన్ ,మాజీ ఎంపిటిసి ఆంజనేయులు ,మాజీ ఉపసర్పంచ్ బజరప్ప, మరికల్ మండల అధ్యక్షుడు వీరన్న ,కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేకంగా మాజీ సర్పంచ్ రేవతమ్మ గ ఎన్నికల హామీ6 మేరకు ఒక నిరుపేద కుటుంబానికి గ్యాస్ సిలిండర్ అందజేశారు.

# బావోజీ ని దర్శించుకున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్....



**నారాయణపేట ఏప్రిల్ 4: (స్కైన్యూస్)**నారాయణపేట జిల్లా కొత్త పల్లి మండలంలోని తిమ్మా రెడ్డి పల్లి లో గత మూడు రోజులుగా కొనసాగుతున్న శ్రీ గురు లోక్ మాసంద్ ప్రభు ( బావోజి) జాతర బ్రహ్మోత్స వాలకు శనివారం జిల్లా కలె క్టర్ ప్రతీక్ జైన్ పాల్గొని బావోజీ నీ దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల పర్యవేక్షణ అధికారి,ఆర్డీవో రామచందర్ నాయక్, ఆలయ కమిటీ సభ్యులు కలెక్టర్ కు గౌరవ పూర్వక స్వాగతం పలికారు. అనంతరం గురు లోక్ మాసంద్ ప్రభును, పక్కనే ఉన్న కాళీకా దేవి మాత ను కలెక్టర్ దర్శించుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం కమిటీ సభ్యులు కలెక్టర్ ను ఆర్డీవో ను సన్మానించారు. కాగా జాతర ఏర్పాట్లపై కలె క్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం వరకు జాతర ఉత్సవాలు ముగు స్తాయనీ, అధికారులంతా జాతర ముగిసే వరకు దగ్గ రుండి పర్యవేక్షణ చేయాలని సూచించారు. అలాగే భక్తు లందరూ తిరిగి వారి వారి స్వగ్రామాలకు వెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుం డా చూడాలని, ట్రాఫిక్ సమ స్య లేకుండా వాహన రాక పోకలను సజావుగా కొన సాగించాలని, జాతర ముగిసే వరకు పటిష్ట బందోబస్తు నిర్వహించాలని కలెక్టర్ పోలీసు అధికారులకు సూచించారు. ఈ కార్యక్ర మంలో డిఆర్డిఓ మొగులప్ప, డిపివో సుధాకర్ రెడ్డి, డీపీ ఆర్ వో రషీద్, తహశీల్దార్ జయరాములు, మద్దూరు, కొత్తపల్లి ఎంపీడీవోలు, సీఐ సైదులు పాల్గొన్నారు.

# పదోన్నతి ఉత్సాహంతో పాటు మరింత బాధ్యత పెంచుతుంది జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

**నారాయణపేట ఏప్రిల్ 4 (స్కైన్యూస్)** ప్రజలకు బాధ్యతాయుతంగా సేవలు అందిస్తే సమాజంలో పోలీసుల పట్ల గౌరవం, మర్యాదలు మరింత పెరుగుతాయని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు.నర్వ పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐ విధులు నిర్వర్తిస్తున్న మన్యం పదోన్నతి పొందారు. శనివారం ఆయన జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ని ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ తన చేతుల మీదుగా పదోన్నతి పొందిన మన్యం కి రెండు స్టార్లు అలంకరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా పదోన్నతి పొందిన మన్యం కి తాత్కాలికంగా రూరల్ పోలీస్ స్టేషన్ కు బదిలీ చేయడం జరిగింది.అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, పదోన్నతి అనేది కేవలం ఉత్సాహానికే కాదు, మరింత బాధ్యతను కూడా తీసుకువస్తుందని చెప్పారు. పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు భరోసా, నమ్మకం కలిగించే విధంగా పని చేయాలని, ముఖ్యంగా నిరుపేద ప్రజలకు పోలీసులు అండగా నిలవాలని సూచించారు.



# కబ్జా కోరల్లో విధవరాలు స్థలం

## మేయర్ గణేష్ ని ఆశ్రయించిన బాధితురాలు
## తక్షణమే న్యాయం చేయవలసిందిగా అధికారులను ఆదేశించిన మేయర్ మూడు గణేష్

**కొత్తగూడెం ఏప్రిల్ 4( స్కై న్యూస్ ):**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 11వ డివిజన్లో 2006వ సంవత్సరంలో 100 గజాల స్థలం చింతల చెరువు రాణి పేరు మీద ఉండేది నేడు ఆ స్థలం నాది అంటూ విధవరాలైన రాణి మీద దౌర్జన్యాన్ని కి దిగుతూ స్థలం కబ్జా చేసిన వైనం పాత కొత్తగూడెం రామచంద్ర స్కూల్ ఎదురుగా చోటుచేసుకుంది. పూర్తి వివరాల్లోకెళ్తే 2006వ సంవత్సరంలో 1-2-236/2 ఏ/2× గల ఇంటి నెంబర్ లో చింతల చెరువు రాణి భర్త పేరు వెంకట్ (లేట్) కులము మాదిగ నివాసం ఉండేవారు. కొన్ని సంవత్సరాల అనంతరం భర్త అనారోగ్యంతో చనిపోవడంతో దిక్కులేని రాణి బంధువుల వద్ద పాల్వంచలో ఉండేది. ఆ క్రమంలో గత మూడు సంవత్సరాల నుండి ఈ స్థలం నాది అంటూ మహిళా ఓర్సు కృష్ణ వేణి కులం వడ్డెర వారు వచ్చి బాధితురాలు రాణిని దుర్భాషలాడుతూ నీ దిక్కున కాడ చెప్పుకో అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. దిక్కులేని బాధితురాలు కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడు గణేష్ ని ఆశ్రయించి వినతి పత్రం అందజేసిన రాణి .ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సిపిఐ పార్టీ పేదల పక్షపాతి అని కొత్తగూడెం శాసనసభ్యులు కూణంనేని



సాంబశివరావు నేతృత్వంలో కొత్తగూడెం అభివృద్ధి చెందుతుందని పేదల కష్టాలు తీర్చడమే సిపిఐ పార్టీ లక్ష్యమని ఎమ్మెల్యే దృష్టికి సమస్యను తీసుకువెళ్లి త్వరలోనే పరిష్కరిస్తామని వారు విధవరాలు అయిన రాణి కి హామీ ఇవ్వడం జరిగింది. అనంతరం బాధితురాలు రాణి మాట్లాడుతూ దిక్కులేని వారికి దేవుడే దిక్కు అని భావించి మేయర్ కు వినతి పత్రం అందజేశానని వారు దయా హృదయంతో వెంటనే స్పందించి అధికారులను అప్రమత్తం చేసి కబ్జా గురైన ల్యాండ్ వివరాలు వెంటనే సేకరించాలని తక్షణమే బాధితురాలికి న్యాయం జరగాలని వారు ఆదేశించడం చాలా సంతోషంగా ఉందని పేదలమైన మా అవసరాలను తీరుస్తానడము పేదల పార్టీ సిపిఐ వెంటే మేము ఉంటామని వారు ఆనందాన్ని వ్యక్తపరిచినారు.

# మెనూ ప్రకారం భోజనం అందించాలి: ఏం ఏ రషీద్



**నారాయణపేట ఏప్రిల్ 4:( స్కైన్యూస్)**విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఎంఏ రషీద్ తెలి పారు. శనివారం నారాయ ణపేటబి1 బాలుర మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో ఆకస్మిక తనికి నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఉద యకాల ప్రార్థనలు పాల్గొని వంటగదిని పరిశీలించారు. పాఠశాల ప్రాంగణం పారిశు ధ్యం మరుగుదొడ్లను పరిశీ లించి ఎప్పటికప్పుడు పరి శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే పదవ తరగతి విద్యా ర్థులతో మాట్లాడి పరీక్షలు బాగా రాయాలని విద్యా ర్థులకు తెలిపారు. అనం తరం సిబ్బందితో సమావే శమై మాట్లాడారు.

# పోక్సో చట్టంపై అవగాహనా సదస్సు


**నారాయణపేట ఏప్రిల్ 4:( స్కైన్యూస్):** రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాలకు అనుగుణంగా శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నారాయణపేట వారి ఆధ్వర్యంలో నారాయణపేట టౌన్ గవర్నమెంట్ హై స్కూల్ లో బాల బాలికలకు చట్టా లపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సద స్సుకు డిఫెన్స్ కౌన్సిల్ కే. లక్ష్మిపతి గౌడ్ హాజరైయ్యారు.పోక్సో చట్టం గురించి ఆయన మాట్లాడుతూ పోక్సో చట్టం 2012 నవంబరు 14, 2012 నుండి అమలులోకి వచ్చినదని, ఈ చట్టమును అతిక్రమిస్తే కఠిన శిక్షలు వుంటాయని తెలిపా రు.18 ఏళ్ల లోపు బాలబాలి కలపై జరిగే లైంగిక వేధింపు లను అరికట్టడానికి, బాధితు లకు సత్వర న్యాయం అందించడానికి, పిల్లల భద్రతను కాపాడటానికి రూపొందించబడిందని తెలిపారు . గుడ్ టచ్ , బ్యాడ్ టచ్ గురించి వివరిస్తూ బాలికలను అనవసరంగా తాకడం, లైంగిక వేధింపులకు గురి చేయడం, అశ్లీల చిత్రాలు వంటి వివిధ రకాల నేరాలకు పాల్పడితే ఇందులో కఠిన శిక్షలు ఉన్నాయని, లైంగిక నేరం జరిగినట్లు తెలిస్తే, వెంటనే పోలీసులకు లేదా చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి సమాచారం ఇవ్వడం ప్రతి ఒక్కరి




బాధ్యత అని , సమాచారం దాచడం కూడా నేరమేనని, నేరం గురించి తెలిసినా, అనుమానం వచ్చినా వెంటనే పోలీసులకు లేదా స్పెషల్ జువెనైల్ పోలీస్ యూనిట్కు తెలపడం చట్టరీత్యా తప్పనిసరి అని తెలిపారు .ఈ కార్యక్రమానికి హాజరైన పారా లీగల్ వాలంటీర్ హాజమ్మ విద్యా ర్థిని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పోక్సో చట్టం గురించి తెలుసుకొని తమని తాము రక్షించుకుంటూ ఇతరులు కూడా ఈ చట్టం ధ్వారా రక్షణ పొందే విధంగా ఉండాలని కోరారు . ఈ కార్యక్రమములో స్కూల్ బి హెడ్ మాస్టర్ దత్తు రావు, స్కూల్ బోధన, బోధనేతర సిబ్బంది , విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు .

# బి ఆర్ ఎస్ పార్టీకి గుడ్ బై!

## ఎమ్మెల్యే జిఎం ఆర్ సమక్షంలోకాంగ్రెస్ పార్టీలో చేరిక




**దేవరకద్ర, మూసాపేట్ ఏప్రిల్ 4 (స్కై న్యూస్);** మూసాపేట్ మండలం తాళ్లగడ్డ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు నారాయణ గౌడ్, యాదయ్య గౌడ్, రమేష్ గౌడ్, తిరుపతయ్య గౌడ్, భాస్కర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, నరసింహులు గౌడ్, రమేష్ గౌడ్, ఈశ్వర్ గౌడ్, ఆంజనేయులు గౌడ్, సత్యం గౌడ్, సురేంద్రమ్మ, నీలమ్మ, అంజమ్మ గార్లతో పాటు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, గ్రామస్తులు శనివారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే జియంఆర్.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే జియంఆర్ పెద్ద ఎత్తున నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు నచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరామని పేర్కొన్నారు.

# అమెరికా సాంకేతికతపై ఇరాన్ సవాలు




పశ్చిమాసియాలో 2026 ఫిబ్రవరి 28న ప్రారంభమైన యుద్ధం కేవలం రెండు దేశాల మధ్య ఘర్షణ మాత్రమే కాక, దశాబ్దాలుగా కొనసాగుతున్న ఏకధ్రువ ప్రపంచ క్రమం కుప్పకూలుతున్న ఒక చారిత్రక ఘట్టంగా పరిణమించింది. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై ప్రారంభించిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ', 'ఆపరేషన్ రోరింగ్ లయన్' ప్రారంభంలో కొన్ని విజయాలను సాధించినప్పటికీ, ఇరాన్ పటిష్టమైన యుద్ధతంత్రం, అసిమెట్రిక్ యుద్ధ నైపుణ్యం ముందు ఆ అగ్రరాజ్యాల సాంకేతిక గర్వం నీరుగారిపోయింది. ముఖ్యంగా, అమెరికా గర్వపడే గగనతల నిఘా వ్యవస్థలకు వెన్నెముకవంటి అవాక్స్ విమానాన్ని ఇరాన్ కూల్చివేయడం,ఆ దేశపు రక్షణ వ్యవస్థలోని లొసుగులను ప్రపంచానికి చాటిచెప్పింది. ఈ యుద్ధం కేవలం సైనికపరంగానే కాకుండా, ఆర్థికంగా కూడా అమెరికాను దివాలా అంచుకు నెట్టివేసింది. అదే సమయంలో ఇజ్రాయెల్ ఒక పరాన్న దేశంగా తన ఉనికిని కాపాడుకోవడానికి ఎంతగా అమెరికాపై ఆధారపడి ఉందో స్పష్టమైంది. రష్యా, చైనా, ఇండియా వంటి ఎదుగుతున్న శక్తులు ఇప్పుడు ఏకమై ఒక చిన్న తోపు తోస్తే, పాత ప్రపంచ క్రమం అంతమై ఒక నూతన బహుధ్రువ ప్రపంచం ఆవిర్భవించే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. మార్చి 2026 చివరి వారంలో జరిగిన ఒక కీలక పరిణామం యుద్ధగమనాన్ని పూర్తిగా మార్చివేసింది. సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్‌మీద ఇరాన్ జరిపిన డ్రోన్, మిస్సైల్ దాడిలో అమెరికాకు చెందిన అత్యంత శక్తివంతమైన ఇ-3 సెంట్రీ(అవాక్స్) విమానం ధ్వంసమైంది. ఈ విమానం కేవలం ఒక వాహనం కాదు. అది గగనతలంలో కదిలే ఒక కమాండ్ సెంటర్. ఇది సుమారు 250 మైళ్ల (375 కిలోమీటర్లు) పరిధిలోని ప్రతి చిన్న కదలికను -అవి డ్రోన్లు కావచ్చు, క్షిపణులు కావచ్చు, యుద్ధవిమానాలు కావచ్చు- అన్నింటినీ గుర్తించి సమాచారాన్ని అందిస్తుంది. ఈ సాంకేతిక పరిజ్ఞానంతోనే అమెరికా ప్రపంచ దేశాలపై ఇన్నాళ్లూ తన పెత్తనాన్ని చలాయించింది. అయితే ఇరాన్ తన పటిష్టమైన యుద్ధతంత్రంతో ఈ 'కదిలే రాడార్'ను మట్టుబెట్టడం ద్వారా అమెరికా గగనతల ఆధిపత్యాన్ని సవాలు చేసింది.

అవాక్స్‌ను కోల్పోవడంవల్ల అమెరికా సైన్యానికి యుద్ధ రంగంలో ఏం జరుగుతుందో తెలియని 'అంధత్వం' ఏర్పడింది. దీనివల్ల క్షేత్రస్థాయిలో ఉన్న రాడార్లపై ఆధారపడాల్సి రావడం, అవి కూడా ఇరాన్ దాడులకు గురవుతుండడంతో అమెరికా రక్షణ వ్యవస్థలో తీవ్రమైన అసమతుల్యత ఏర్పడింది. నిఘా విమానమైన ఇ-3 సెంట్రీ (అవాక్స్) పూర్తిగా ధ్వంసం కావడంతో 270 మిలియన్ డాలర్ల నష్టం వాటిల్లింది. కెసి-135 స్ట్రాటోట్యాంకర్ యుద్ధ విమానాల్లో ఒకటి కూలిపోగా, ఐదు ధ్వంసమయ్యాయి. ఇవి ఒక్కో విమానం 165 మిలియన్ డాలర్లు ఉంటుంది. ఎఫ్-15 ఈ స్ట్రైక్ ఈగిల్ యుద్ధ విమానాలు మూడు కూలిపోయాయి. ఇవి ఒక్కోటి 100 మిలియన్ డాలర్లు ఉంటుంది. అత్యాధునిక జెట్ అయిన ఎఫ్-35ఎ లైట్నింగ్ ఎఎ అత్యవసర ల్యాండింగ్ అయి ధ్వంసమైంది. దీనికి 82.5 మిలియన్ డాలర్లు ఉంటుంది. దాదాపు పన్నెండుకు పైగా ఎంక్యూ-9 రీపర్ డ్రోన్లు కూలిపోయాయి. వీటితో 30- 40 మిలియన్ డాలర్ల నష్టం వాటిల్లింది. రక్షణ రాడార్ ఎఎన్/ టిపివై-2 (థాడ్) ధ్వంసం కావడంతో 500 మిలియన్ డాలర్ల నష్టం జరిగింది. దీనిని విశ్లేషిస్తే, అమెరికా తన అత్యాధునిక సాంకేతికతను ఇరాన్ వంటి దేశం ఎదురుదాడులనుంచి కాపాడుకోవడంలో విఫలమైందని స్పష్టమవుతోంది. ముఖ్యంగా ఎఫ్-15ఇ విమానాలు కువైట్ విమానాల ద్వారా పొరపాటున కూల్చివేయబడడం, అమెరికా నాయకత్వంలోని కూటమిలో సమన్వయ లోపాన్ని సూచిస్తోంది. అమెరికా తన అత్యంత ఖరీదైన క్షిపణి రక్షణ వ్యవస్థ అయిన థాడ్ (టర్మినల్ హై ఆల్టిట్యూడ్ ఏరియా డిఫెన్స్), దాని రాడార్ ఎఎన్/టివివై-2పై అమితమైన విశ్వాసాన్ని ఉంచింది. ఈ వ్యవస్థ అంతరిక్షం నుంచి వచ్చే హైపర్సోనిక్ క్షిపణులను కూడా గుర్తించగలదు. కానీ ఇరాన్ యుద్ధం ఒక 'సాంకేతిక వైరుధ్యాన్ని' బయటపెట్టింది. కోట్లాది డాలర్ల విలువైన ఈ రాడార్ వ్యవస్థలు కేవలం 35,000 డాలర్ల విలువ చేసే చిన్న డ్రోన్ల దాడికి ఛిద్రమైపోయాయి. జోర్డాన్‌లోని మువాఫక్ సల్తీ ఎయిర్ బేస్ వద్ద ఉన్న ఎఎన్/టిపివై-2 రాడార్ ఇరాన్ దాడుల్లో ధ్వంసం కావడం అమెరికాకు కోలుకోలేని దెబ్బ. ఈ రాడార్‌లు ఒకచోట స్థిరంగా ఉండడంవల్ల శత్రువులకు సులభమైన లక్ష్యాలుగా మారుతున్నాయి. అత్యాధునిక రాడార్ అరేలు ఎంత సున్నితంగా ఉంటాయంటే, ఒక చిన్న పేలుడు కూడా ఆ వ్యవస్థను పూర్తిగా పనికిరాకుండా చేయగలదు. ఈ వైఫల్యం వల్ల ఇరాన్‌నుంచి వచ్చే క్షిపణులను గుర్తించడంలో జాప్యం జరుగుతోంది. ఇది ఇజ్రాయెల్, ఇతర గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలను మరింత ప్రమాదంలోకి నెట్టివేస్తోంది. ఈ యుద్ధం అమెరికా ఆర్థిక వ్యవస్థపై పెను ప్రభావాన్ని చూపుతోంది. ఇప్పటికే 39 ట్రిలియన్ డాలర్ల రుణభారంతో ఉన్న అమెరికా, ఈ యుద్ధం కోసం అదనంగా 200 బిలియన్ డాలర్ల అత్యవసర నిధుల కోసం పెంటగాన్ ద్వారా వైట్ హౌస్‌ను కోరింది. యుద్ధం మొదలైన మొదటి మూడు వారాల్లోనే సుమారు 3 బిలియన్ డాలర్ల విలువైన సైనిక పరికరాలు ధ్వంసమయ్యాయి. అమెరికా ట్రెజరీ బాండ్ల మార్కెట్, సాధారణంగా యుద్ధ సమయాల్లో సురక్షితమైన పెట్టుబడిగా భావించబడుతుంది. కానీ ఈసారి పరిస్థితి భిన్నంగా ఉంది. పెట్టుబడిదారులు అమెరికా ప్రభుత్వం తన అప్పులను తీర్చగలదా అనే అనుమానంతో బాండ్లను విక్రయిస్తున్నారు. దీనివల్ల గ్లోబల్ బాండ్ మార్కెట్ నుంచి మార్చి నెలలోనే 2.5 ట్రిలియన్ డాలర్ల విలువ ఆవిరైపోయింది. ద్రవ్యోల్బణం 4.2 శాతానికి పెరగడం, పెట్రోల్ ధరలు గ్యాలన్‌కు 4 డాలర్లకు చేరువ కావడం అమెరికా సామాన్యుడి నడ్డి విరుస్తోంది. ఈ గణాంకాలు అమెరికా ఆర్థికంగా ఎంత పటిష్టమైన దేశమో నిరూపిస్తున్నాయి. ప్రపంచంలో డాలర్ ఆధిపత్యం తగ్గిపోతుండడం ఈ పతనానికి ప్రధాన సంకేతం. ఇజ్రాయెల్ తన సాంకేతిక నైపుణ్యంతో ఇరాన్‌పై దాడులు చేస్తున్నప్పటికీ, లోతుగా పరిశీలిస్తే ఆ దేశం అమెరికా ఇచ్చే 'సైనిక ప్రాణవాయువు' (స్ట్రాటజిక్ ఆక్సిజన్ పైపులైన్) మీద పూర్తిగా ఆధారపడి ఉందని అర్థమవుతోంది. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు గతంలో తాము స్వయం సమృద్ధి సాధిస్తామని ప్రగల్భాలు పలికినప్పటికీ, యుద్ధం మొదలైన కొద్ది రోజుల్లోనే ఆ దేశ మందుగుండు సామాగ్రి నిల్వలు నిండుకున్నాయి. అమెరికా సరఫరా చేసే మందుగుండు లేకపోతే ఇజ్రాయెల్ ఒక్క వారం కూడా యుద్ధం చేయలేదని విశ్లేషకులు చెబుతున్నారు. ఇజ్రాయెల్ ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు పూర్తిగా 'యుద్ధ ఆర్థిక వ్యవస్థ'గా (వార్‌ఎకానమీ) మారిపోయింది. పౌర రంగాలు, పర్యాటకం, వ్యవసాయం పూర్తిగా కుప్పకూలిపోయాయి.

కేవలం సైనిక ఎగుమతులు మాత్రమే ఆ దేశాన్ని కాపాడుతున్నాయి. 2024లో 15బిలియన్ డాలర్ల రక్షణ ఎగుమతులు చేసిన ఇజ్రాయెల్, ఇప్పుడు తన ఉనికి కోసం ప్రతి వనరును యుద్ధానికే మళ్లిస్తోంది. ఇది ఇజ్రాయెల్‌ను ఒక 'సూపర్ స్పార్టా' దేశంగా మార్చేసింది. అంటే నిరంతరం యుద్ధం మీదనే ఆధారపడే స్థితి. మార్చి 4, 2026న ఇరాన్ హార్మూజ్ జలసంధిని మూసివేయడం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఒక అణుబాంబు వంటి ప్రభావాన్ని చూపింది. ప్రపంచంలోని 20% చమురు సరఫరా, గణనీయమైన గ్యాస్ సరఫరా ఈ మార్గం ద్వారానే జరుగుతుంది. ఇరాన్ ఇప్పుడు ఈ మార్గాన్ని తన నియంత్రణలోకి తీసుకొని, చమురు రవాణా చేసే నౌకల నుంచి సుంకాలను కేవలం చైనీస్ యువాన్‌లో మాత్రమే వసూలు చేస్తోంది. ఇది అమెరికా డాలర్ ఆధిపత్యానికి పడిన అతిపెద్ద దెబ్బ. చైనా క్రాస్-బోర్డర్ పేమెంట్ సిస్టమ్‌ద్వారా లావాదేవీలు జరగడం వల్ల అమెరికా ఆంక్షలు నిర్వీర్యమయ్యాయి. గల్ఫ్ దేశాలు కూడా ఇప్పుడు అమెరికా రక్షణ కవచం బలహీనపడడంతో తమ ఆర్థిక మార్గాలను చైనా వైపు మళ్లిస్తున్నాయి. ప్రస్తుత యుద్ధం ఒక సరికొత్త భౌగోళిక రాజకీయ మార్పును తెచ్చినట్టు కనిపిస్తోంది. అమెరికా అస్థిరమైన నాయకత్వాన్ని చూసిన జపాన్, జర్మనీ వంటి దేశాలు కూడా ఇప్పుడు తమ భద్రత కోసం ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కుంటున్నాయి. రష్యా బహిరంగంగా అమెరికా దాడులను ఖండిస్తూనే, తెరవెనుక ఇరాన్‌కు ఉపగ్రహ సమాచారాన్ని, డ్రోన్ యుద్ధతంత్రాలను అందిస్తోంది. ఉక్రెయిన్ యుద్ధంలో బిజీగా ఉన్నప్పటికీ, ఇరాన్‌ను అమెరికా పతనానికి ఒక ఆయుధంగా రష్యా వాడుకుంటోంది. చైనా నేరుగా యుద్ధంలోకి దిగకుండానే ఆర్థికంగా అమెరికాను దెబ్బతీస్తోంది. ఇరాన్‌కు ఆర్థిక అండగా నిలుస్తూ, బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌతాఫ్రికా) కూటమి ద్వారా ప్రత్యామ్నాయ ప్రపంచ క్రమాన్ని నిర్మిస్తోంది. భారతదేశం వ్యూహాత్మక మౌనాన్ని పాటిస్తూనే, తన ఇంధన భద్రత కోసం రష్యా, ఇరాన్‌లతో సంబంధాలను కొనసాగిస్తోంది. అమెరికా బలహీనపడడంవల్ల దానికి సాగిలపడకపోతే ఇండియా వంటి దేశాలకు ప్రపంచ స్థాయిలో నిర్ణయాత్మక పాత్ర పోషించే అవకాశం పెరుగుతుందనుకోవచ్చు. జపాన్, జర్మనీ దేశాలు ఇన్నేండ్లూ అమెరికా రక్షణ గొడుగు కింద ఉన్నాయి. కానీ ఇప్పుడు అమెరికా స్వయంగా యుద్ధంలో చిక్కుకోవడంతో, అవి తమ రక్షణ వ్యయాన్ని పెంచుకుంటూ సొంత వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నాయి. 2026 ఇరాన్ యుద్ధం అమెరికా అజేయత అనే భ్రమను తొలగించింది. ప్రపంచ పెద్దన్నగా చలామణి అవుతున్న అమెరికా, ఇప్పుడు తన సొంత ఆర్థిక సమస్యలు, సైనిక వైఫల్యాలతో సతమతమవుతోంది. ఇజ్రాయెల్ తన మనుగడకోసం పూర్తిగా ఇతరులపై ఆధారపడే బలహీన దేశంగా మిగిలిపోయింది. ఇరాన్ చూపిన పటిష్టమైన యుద్ధతంత్రం, ఆధునిక సాంకేతికత కంటే వ్యూహాత్మక ధైర్యం గొప్పదని నిరూపించింది. ఇప్పుడు రష్యా, చైనా, ఇండియా వంటి శక్తులు ఏకమై ఆర్థిక, రాజకీయ ఒత్తిడిని కొనసాగిస్తే, పాత సామ్రాజ్యాల పతనం పూర్తి కావడం ఖాయం. ప్రపంచం ఇప్పుడు ఏకధ్రువ ఆధిపత్యం నుంచి బహుళ ధ్రువ సహకారంవైపు అడుగులు వేస్తోంది. ఇది కేవలం ఒక యుద్ధం ముగింపు కాదు. ఒక నూతన శకానికి ఆరంభం. అమెరికా ఇక ఎంతమాత్రం ప్రపంచ గమనాన్ని శాసించలేదు.

# అసమాన శాస్త్ర పరిశోధకుడు

విలియం క్రూక్స్ ప్రఖ్యాత బ్రిటిష్ భౌతిక, రసాయన శాస్త్రవేత్త. క్రూక్స్ రేడియో వికిరణ మాపకం ఆవిష్కర్త. అయన ఉత్సర్గ నాళం రూపకల్పనకు మార్గదర్శి. థాలియం అనే క్రొత్త మూలకాన్ని కనుగొన్నాడు. రాయల్ కాలేజ్ ఆఫ్ కెమిస్ట్రీ, లండన్ లో వర్ణపట శాస్త్రం పై విస్తృత పరిశోధనలు చేశాడు. ఆయన తయారుచేసిన ఉత్సర్గ నాళాన్ని క్రూక్స్ నాళం అనికూడా అంటారు. ఆయన పరిశోధనల ఫలితంగా సెలేనియం యొక్క సంయోగ పదార్థములు కనుగొనబడ్డాయి. ఆయన కేంద్రక రేడియో ధార్మికతను అధ్యయనం చేయుటకు ఉపయోగించే పరికరంను కనుగొన్నాడు. పదార్థం స్థితులలో (ఘన, ద్రవ, వాయు) నాల్గవ స్థితి అయిన ప్లాస్మాను కనుగొనుటలో, ఆ స్థితిని గుర్తించుటలో మొదటి శాస్త్రవేత్తగా నిలచాడు. క్రూక్స్ చేసిన పరిశోధనల వల్ల భౌతిక, రసాయన శాస్త్రాలలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకున్నాయి. క్రూక్స్ తన జీవన గమనంలో ఒక అంతరిక్ష శాస్త్రవేత్తగా, ఉపన్యాసకునిగా వివిధ ప్రాంతాలలో పనిచేశాడు. భౌతిక, రసాయన శాస్త్రాలలో అనేక పరిశోధనలు చేశాడు. తన పరిశోధన ముఖ్య లక్షణము ప్రయోగముల ద్వారా వివిధ భావనలను, వాస్తవాలను కనుగొనుటగా భావించాడు. ఆయన అభిరుచు లయిన అనువర్తిత భౌతిక శాస్త్రము, ఆర్థిక, ప్రాయోగిక సమస్యలు, మానసిక సంబంధమైన పరిశోధనలు, ఆయనను ఉన్నత వ్యక్తిగా నిలిపింది. ఆయన అనేక అవార్డులు, గౌరవాలను పొందాడు. ఆయన జీవితం ఒక అసాధారణ శాస్త్రీయ కృత్యాలలతో మమేకం అయింది. సర్ విలియం క్రూక్స్ లండన్ లో 1832 జూన్ 17 లో జన్మించాడు. 1850 నుండి 1854 మధ్య కాలంలో ఆయన కళాశాలలో సహాయకునిగా పనిచేశాడు. అనతి కాలంలో ఆయన కర్బన రసాయన శాస్త్రంలో కాకుండా ఆయనకు ఇష్టమైన రంగంలో ఆయన గురువు విల్‌హెల్మ్ వోన్ హోఫ్మాన్ ప్రేరణతో ప్రవేశించాడు. ఆయన పరిశోధనల ఫలితంగా సెలేనియం యొక్క సంయోగ పదార్థములు కనుగొన బడ్డాయి. ఆయన మొదటి పరిశోధనా పత్రాలను 1851 లో ప్రచురించాడు. ఆయన ఆక్స్‌ఫర్డ్ లో రాడ్‌క్లిఫ్ అబ్సర్వేటరీ విభాగంలో 1854 లో, ఛెస్టర్ డియోసియన్ ట్రయినింగ్ కళాశాలలో 1855లో ఉపన్యాసకునిగా పనిచేశాడు. 1859 లో ఆయన కెమికల్ న్యూస్ అనే విజ్ఞానశాస్త్ర పత్రికను ప్రారంభించాడు. అనేక సంవత్సరాలు ఆ పత్రికలో వివిధ మార్పులు చేస్తూ నిర్వహించి అన్ని విజ్ఞాన శాస్త్ర జర్నల్స్ లో అగ్రగామిగా నిలిపాడు. 1861 లో క్రూక్స్ థాలియం అనే క్రొత్త మూలకాన్ని కనుగొన్నాడు. ఈ మూలకం వర్ణపటంలో ఆకుపచ్చని కాంతిని ఉద్గారం చేయుటను గమనించాడు. గ్రీకు భాషలో థల్లోస్ అంటే ఆకుపచ్చని ఉద్గారం అని అర్థము. అలా దానికి థాలియం అని నామకరణం చేశాడు. థాలియంను వర్ణపట విశ్లేషణ సహాయంతో కనుగొన్నాడు. ఆ నూతన ఆవిష్కరణ ఆయనకు ఎనలేని కీర్తిని తెచ్చి తెచ్చింది. ఆయన 1863 లో రాయల్ సొసైటీకి ఫెలోగా ఎంపికయ్యాడు. ఆయన క్రూక్స్ నాళంను అభివృద్ధి చేశాడు. తద్వారా ఋణధృవ కిరణాల ఆవిష్కరణ జరిగింది. ఆయన అనేక పరిశోధనా పత్రాలను వర్ణపట శాస్త్రం పై ప్రచురించాడు. అల్ప పీడనం వద్ద వాయువుల గుండా విద్యుత్ ను ప్రవహింపజేయు పరిశోధనలలో ఆయన అతి తక్కువ పీడనం వద్ద వాయువుల గుండా విద్యుత్ ను ప్రవహింప జేసినపుడు ఋణ ధృవం (కాథోడ్) నుండి కొన్ని కిరణాలు ఉద్గారమగు చున్నట్లు కనుగొన్నాడు. వాటికి "ఋణధృవ కిరణాలు" అని పిలిచాడు. యివి ప్రస్తుతం స్వేచ్ఛా ఎలక్ట్రాన్ల ప్రవాహంగా పిలువ బడు తున్నాయి. ప్రస్తుతం ఇవి కాథోడ్ కిరణ నాళాలలో ఉపయోగ పడుతున్నాయి. ఈ ఉదాహరణల నుండి ఆయన భౌతిక దృగ్విషయాలను అధ్యయనం చేయుటకు ఉపయోగపడే ఉత్సర్గ నాళాల తయారీలో ప్రసిద్ధి పొందాడు. 1879 లో ఆయన పదార్థం యొక్క స్థితులలో (ఘన, ద్రవ, వాయు) నాల్గవ స్థితి అయిన ప్లాస్మాను కనుగొనుటలో, ఆ స్థితిని గుర్తించుటలో మొదటి శాస్త్రవేత్తగా నిలచాడు. క్రూక్స్ ఋణధృవ కిరణాలు లక్షణాలపై పరిశోధనలు చేశాడు. అవి ఋజుమార్గంలో ప్రయాణిస్తాయని, అవి వస్తువులపై పడినపుడు ప్రతిదీప్తిని కలుగ జేస్తాయని కనుగొన్నాడు. పదార్థంలో నాల్గవ స్థితి అయిన "ప్లాస్మా" స్థితిని ఆయన కనుగొన్నాడు. దానికి "రేడియంట్ మేటర్" అని పిలిచాడు. ఋణ ధృవ కిరణాలు అనేవి కొన్ని కణాల ప్రవాహమని నమ్మాడు. ఆ తర్వాత జె.జె.థామ్సన్ వాటిని కనుగొనడానికి భూమికను ఏర్పరచాడు. కాథోడ్ కిరణాలలో గల కణాలకు ఎలక్ట్రాన్ లుగా గుర్తించాడు. క్రూక్స్ చేసిన పరిశోధనల వల్ల భౌతిక, రసాయన శాస్త్రాలలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. దీని ఫలితంగా పరమాణువులో కొత్త కణాల ఆవిష్కరణకు మార్గం సుగమమైంది. 1880 తర్వాత క్రూక్స్ ప్రైవేటు ప్రయోగ శాలలో తన పరిశోధనలను చేశాడు. 1895 లో విలియం క్రూక్స్ హీలియం నమూనాను గుర్తించాడు. 1903 లో ఆయన తన దృష్టిని రేడియో ధార్మికత దృగ్విషయాలపై నిలిపాడు. యురేనియం -చీ (తర్వాత ప్రొటాక్టీనియంగా పిలువ బడుతున్నది. యురేనియాన్ని రేడియో ధార్మిక పరివర్తన ఆధారంగా వేరుచేయ గలిగాడు. ఉత్తేజిత పరివర్తన ఆధారంగా యురేనియం నుండి రేడియో ధార్మిక విఘటనాన్ని గమనించాడు. అదే సమయంలో ఆయన రేడియో ధార్మిక పదార్థం నుండి వెలువడే "జూ-కణముల"ను కనుగొన్నాడు. ఈ కణాలు జింక్ సల్ఫైడ్ తెరను ప్రభావితం చేయుట గమనించాడు. క్రూక్స్ 1909 లో "డైమండ్స్" అనే చిన్న పుస్తకాన్ని రాశాడు. 1910లో క్రూక్స్ "ఆర్డర్ ఆఫ్ మెరిట్"ను పొందాడు. ఆయన తన భార్య మరణానంతరం 2 సంవత్సరాల తర్వాత లండన్ లో 4 ఏప్రిల్ 1919 లో మరణించాడు.

## బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకం చేపట్టాలి



**జోగులాంబ గద్వాల, ఏప్రిల్ 4 (స్కై న్యూస్):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించి బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకానికి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పై రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి హైదరాబాదు నుంచి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాల వారీగా ఇప్పటికే ఏఈఆర్ఓ లకు, బూత్ లెవెల్ అధికారులకు బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకంపై సమావేశాలు చేసినందున ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతంకు రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారం తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు చేయనిచోట వెంటనే నిర్వహించాలన్నారు. బూత్ లెవెల్ అధికారుల యాప్ పై అవగాహన కలిగి ఉండాలని, మ్యాపింగ్ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. గద్వాల ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వీసీ అనంతరం సంబంధిత జిల్లా అధికారులతో మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియ జిల్లాలో 74 శాతానికి చేరుకుందని, మరింత వేగవంతం కావడానికి కృషి చేయాలన్నారు. గద్వాల మున్సిపాలిటీ పరిధిలో ప్రక్రియ కాస్త వెనుకబడిందని, వేగవంతం చేసేందుకు ప్రణాళికతో ముందుకెళ్లాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్డీవో శ్రీనివాసరావు, ఎన్నికల అధికారి మంజుల, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 19న డైమండ్ జూబ్లీ సెలబ్రేషన్ కు రావాలని మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరికి ఆహ్వాన పత్రిక

**కొత్త అరవింద్ కుమార్ రెడ్డి, పూర్వ విద్యార్థులు...**



**దేవరకద్ర, కౌకుంట్ల ఏప్రిల్ 4 (స్కై న్యూస్);** తెలంగాణ రాష్ట్రం మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కౌకుంట్ల మండల పరిధిలోని పేరూరు గ్రామంలో 1950 సంవత్సరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ప్రారంభించడం జరిగింది. కాబట్టి 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 19న డైమండ్ జూబ్లీ సెలబ్రేషన్స్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. కావున తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు పశుసంవర్థక పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్యశాఖ, క్రీడా, యువజన సర్వీసుల శాఖ వర్యులు వాకిటి శ్రీహరి ని హైదరాబాదులో శనివారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో స్కూల్ పూర్వ విద్యార్థులు , గ్రామ ప్రజలు మంత్రి ని ఆహ్వానించడం జరిగింది. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు కొత్త అరవింద్ కుమార్ రెడ్డి, పూర్వ విద్యార్థులు తెలిపారు.

## శ్రీనివాస్ చారి సేవా స్ఫూర్తితో చలివేంద్రం ప్రారంభం

**కార్యక్రమానికి హాజరైన షాద్ నగర్ బిజెపి ఇంచార్జ్ అందే బాబన్న**




**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఏప్రిల్ 4 :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ లోని పోచమ్మ గుడి వద్ద శ్రీనివాస్ చారి ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది ఈ కార్యక్రమానికి షాద్ నగర్ బిజెపి ఇన్చార్జ్ అందే బాబన్న నహాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు ఈ సమాజంలో అవసరం ఉన్నవారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు ఉపశమనం కలిగించడం అత్యంత గొప్ప విషయం అని పేర్కొన్నారు వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని చలివేంద్రాల ఏర్పాటు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు శ్రీనివాస్ చారి గత 2016 సంవత్సరం నుండి ప్రతి వేసవిలో నిరంతరంగా చలివేంద్రాన్ని నిర్వహిస్తూ సేవా కార్యక్రమాలకు నిదర్శనంగా నిలుస్తున్నారని వారు అభినందించారు ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి

**దేవరకద్ర, కొత్తకోట ఏప్రిల్ 4 (స్కై న్యూస్);** కొత్తకోట మండలంకు చెందిన కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు స్థానిక నాయకులు, అధికారులతో కలసి లబ్దిదారులకు చెక్ లు పంపిణీ చేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవరకద్ర నియోజకవర్గంలో ప్రతి కుటుంబానికి ప్రతి గడపకు ఏదో ఒక సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు.

# ఎవరి ట్రాప్ లో ఎవరు...

**విజయవాడ, ఏప్రిల్ 4:**అమరావతి రాజధాని ఎపిసోడ్ లో అధికార టీడీపీ విపక్ష వైసీపీ ఇద్దరూ ఢీ కొడుతున్నారు. ఎవరి ఆలోచనలు వారివిగా ఉన్నాయి. అమరావతి అసాధ్యం అని వైసీపీ అంటూంటే భవిష్యత్తు రాజధాని అని టీడీపీ అంటోంది. ఈ నేపథ్యంలో జగన్ మావిగాన్ పేరుతో ప్లాన్ బీని ప్రకటించారు. ఇక కూటమి అయితే అమరావతి చట్టబద్ధత మీద సంబరాలు చేసుకుంటోంది. వైసీపీని అమరావతి ద్రోహిగా టీడీపీ విమర్శిస్తూంటే వైసీపీ ఏపీకి అమరావతి రాజధాని ఒక అంతులేని కథ యాభై ఏళ్ళు అయినా పూర్తి కాదంటోంది. ఇలా అమరావతి మీద హీటెడ్ డిస్కషన్ తో ఎవరి ట్రాప్ లో ఎవరు పడుతున్నారు అన్నదే ఇపుడు చర్చగా ఉంది. గడచిన మూడు రోజులుగా వైసీపీ మీద ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శిస్తున్నారు దాని కంటే ముందు మార్చి 28న అమరావతికి చట్టబద్ధత కోసం ప్రత్యేక శాసనసభ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కూడా వైసీపీ తీరు మీదనే కూటమి ఎమ్మెల్యేలు మంత్రులు విరుచుకుపడ్డారు. ఈ సమావేశానికి వైసీపీ గైర్ హాజరు అయింది. నిజానికి వైసీపీ వస్తుందని ఒక దశలో అంతా అనుకున్నారు. కానీ అది జరగలేదు. అలా వైసీపీ వ్యూహాత్మకంగా సాగించిన అమరావతి రాజధాని ఎపిసోడ్ లో తనదైన ఎత్తుగడలు పార్లమెంట్ సాక్షిగా పదును తేరాయి. దాంతో టీడీపీకి ఇది ఇబ్బందికరంగా మారిందా అన్న చర్చ వస్తోంది. ఏపీలో రెండు పార్టీలు దశాబ్దాల రాజకీయ వైరం అన్నది అయిదు కోట్ల మంది ప్రజలకు తెలిసిందే. కానీ దేశమంతా చూసే పార్లమెంట్ లో వైసీపీ వ్యవహరించిన తీరు అయితే టీడీపీని ఇబ్బంది పెట్టిందనే అంటున్నారు. మొత్తం యాభై పార్టీలు కలసి అమరావతి రాజధానికి మద్దతుగా నిలిస్తే వైసీపీ మాత్రం వ్యతిరేకించి వాకౌట్ చేసింది. పైగా ఏపీకి చెందిన ఒక పార్టీ అమరావతి రాజధాని విషయంలో తాము ససేమిరా మద్దతు ఇవ్వమని అక్కడ రైతులకు అన్యాయం జరుగుతోంది అంటూ ఎలుగెత్తి చాటింది. అయితే బిల్లు పాస్ అయింది కానీ ఈ విషయం అయితే చర్చకు



జాతీయ స్థాయిలోనూ వచ్చింది. ఇదే ఇపుడు టీడీపీని మరింతగా ఇరిటేట్ చేస్తోందా అన్నదే చర్చ. బాబు మీడియా సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ మీద నిప్పులు చెరిగారు. ఒక్క వైసీపీ మినహా దేశంలోని అన్ని పార్టీలు ఏపీ రాజధాని అమరావతికి అండగా నిలిచాయని చంద్రబాబు చెప్పుకొచ్చారు. పార్లమెంటు ఉభయ సభల్లో అన్ని రాజకీయ పార్టీలూ, ఎంపీలు అమరావతి చట్టబద్దత కల్పించే బిల్లుపై మద్దతు పలికితే ఒక్క వైసీపీ ఎంపీలు మాత్రమే వ్యతిరేకించి వాకౌట్ చేశారని ఆయన వ్యాఖ్యానించారు. కొందరికి రాష్ట్రం గురించి తెలియదని రాష్ట్రంతో అవసరం కూడా ఉండకపోవచ్చు కానీ అలాంటి పార్టీలు కూడా రాజధాని చట్ట బద్దత కల్పించే బిల్లుకు సహకరించాయి, అనుకూలంగా ఓటేశాయని బాబు గుర్తు చేశారు. ఏపీలో ఓట్లు పొంది ఇక్కడి నుంచి ఎంపీలుగా ఎన్నికైన వ్యక్తులు రాష్ట్రానికే ద్రోహం చేసేలా వ్యవహరించారని బాబు మండిపడ్డారు. అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును వ్యతిరేకించారని అన్నారు. దేశంలోని పార్టీలన్నీ ఓవైపు ఉంటే వైసీపీ మాత్రం మరో వైపు నిలిచిందని బాబు విమర్శించారు. వైసీపీ మాత్రమే రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించిందని ఆయన ఆరోపించారు. రాష్ట్రం నాశనమైనా పర్వాలేదనే రీతిలో వైసీపీ ఆలోచిస్తోందని బాబు ఫైర్ అయ్యారు. కుట్రలు..కుతంత్రాలు : అమరావతి రాజధాని విషయంలో వైసీపీ చాలా డ్రామాలు ఆడిందని బాబు విమర్శించారు. అమరావతి మీద వైసీపీ వారు అడుగడుగునా కుట్రలు, కుతంత్రాలు చేస్తూనే ఉన్నారని అన్నారు. తుగ్లక్ లు కొత్తగా పాలనలోకి వచ్చి రాజధానిని ప్రతీసారీ మారుస్తామంటే ఎలా అని బాబు ప్రశ్నించరు. దీనికి అర్థం ఉంటుందా అని నిలదీశారు. శాశ్వత రాజధాని అని పార్లమెంటు చట్టం చేస్తే దానిని కూడా మార్చేస్తామని మాట్లాడతారా అని జగన్ మీద గుస్సా అయ్యారు. ఇదేం రాజకీయమని అంటూనే ఇలాంటి నాయకులు ఉండటం రాష్ట్ర దౌర్భాగ్యం అని బాబు అసహనం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కూడా అవహేళన చేసి మాట్లాడతారా అని ఆయన ప్రశ్నించారు. ఏకంగా ప్రజలకు, ప్రజాధనానికి నష్టం జరిగేలా వ్యవహరిస్తారా అని బాబు గద్దించారు. ప్రజలకు సంక్షేమం, జీవన ప్రమాణాలను కల్పించటంపైనే ఎవరైనా మాట్లాడుకోవాలి కానీ ఇలాంటి వారి పట్ల మాట్లాడటం కూడా అనవసరమని బాబు చివరికి అభిప్రాయపడ్డారు. సవాల్ గా తీసుకోవాల్సిందే : అమరావతి రాజధాని విషయంలో వైసీపీ వ్యతిరేకించింది అన్నది టీడీపీ అభిప్రాయంగా ఉంది. అయితే వైసీపీ తన స్టాండ్ చెప్పేసింది, ఆ మీదట ప్రజలు ఆ పార్టీ విషయంలో నిర్ణయించుకుంటారు. వైసీపీ అమరావతి నిర్మాణం అసాధ్యం అని అంటోంది. దానిని సవాల్ గా తీసుకుని టీడీపీ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు ముందుకు వేయాలి, వైసీపీని విమర్శిస్తూ కూర్చుంటే వారి వ్యూహంలోనే చిక్కుకున్నట్లు అవుతుందని అంటున్నారు. ఈ రోజున అయితే వైసీపీ మాటలను పక్కన పెట్టి మరీ అయిదు కోట్ల మంది ప్రజలు కూటమి వైపు చూస్తున్నారు. మరి కూటమి అమరావతికి ఒక రూపూ షేపూ తేవడం మీదనే అందరి భవిష్యత్తు ఆధారపడి ఉందన్నది మరవరాదు అంటున్నారు రాజకీయ విశ్లేషకులు.

# డేంజర్ లో డ్యామ్



**కర్నూలు, ఏప్రిల్ 4:**శ్రీశైలం డ్యామ్‌ను సెంట్రల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (సీడీఎస్ఏ) టీమ్ పరిశీలించింది. శ్రీశైలం జలాశయం వ్యూ పాయింట్ వద్ద అధికారులతో సమావేశం నిర్వహించారు. శ్రీశైలం డ్యామ్ గ్యాలరీ, క్రస్ట్ గేట్లను, ప్లంజిపూల్ పరిశీలించారు. ప్లంజ్‌పూల్‌తో ఆనకట్టకు నష్టం లేదని సీడీఎస్ఏ ఛైర్మన్ డీకే శర్మ తెలిపారు. ఎలాంటి అత్యవసరమైన చర్యలు అవసరం లేదని నిపుణుల టీమ్ తమకు తెలిపినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.శ్రీశైలం జలాశయానికి ప్లంజ్‌పూల్‌తో ఎలాంటి నష్టం లేదని సీడీఎస్ఏ (సెంట్రల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ) ఛైర్మన్ డీకే శర్మ తెలిపారు. అయితే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముందు జాగ్రత్తగా రెండు వైపులా గోడలు నిర్మించాలని సూచించారు. చిన్నచిన్న మరమ్మతులు చేసుకుంటూ ప్లంజ్‌పూల్ పనులు చేసుకోవచ్చని సూచించారు. ఢిల్లీ నుంచి వచ్చిన డీకే శర్మ నేతృత్వంలోని సీడీఎస్ఏ టీమ్ శ్రీశైలం జలాశయాన్ని, గ్యాలరీ, క్రస్ట్‌గేట్లను పరిశీలించింది.. మార్పు, చేర్పులతో పాటుగా మరమ్మతులపై ఇరిగేషన్ అధికారులకు కొన్ని సూచనలు చేశారు. ఏపీ ప్రభుత్వానికి ప్రస్తుతం జలాశయం దగ్గర జరుగుతున్న పనులపై నివేదిక అందజేస్తామన్నారు.శ్రీశైలం డ్యామ్ దగ్గర ఏడేళ్ల కాలంలో ప్లంజ్‌పూల్‌లో లోతు పెరగలేదని జల వనరులశాఖ చీఫ్ ఇంజినీరు కబీర్ బాషా తెలిపారు. ఢిల్లీ నుంచి వచ్చిన టీమ్ జలాశయం దగ్గర ప్రస్తుతానికి ఎలాంటి అత్యవసర చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేదని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం డ్యామ్ దగ్గర అప్రోచ్ రోడ్డు, షార్ట్ క్రీటింగ్ పనులు జరుగుతున్నాయన్నారు. ఈ పనుల కోసం ప్రభుత్వం మొత్తం రూ.30 కోట్లు మంజూరు చేసిందన్నారు.శ్రీశైలం ప్రాజెక్టు తెలుగు రాష్ట్రాలకు కీలకం.. సాగు, తాగునీరు అందించడంతో పాటుగా విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. డ్యామ్ దగ్గర గేట్లు కింద ఆప్రాన్ దగ్గర ప్లంజ్‌పూల్ (భారీ గొయ్యి) ఏర్పడింది. గేట్లు ఎత్తి నీళ్లు విడుదల చేసిన సమయంలో.. ఎత్తైన ప్రదేశం నుంచి నీళ్లు కిందపడటంతో ఇలా పెద్ద గొయ్యి ఏర్పడింది. అలా వెంటనే అధికారులు స్పందించి ఈ ప్లంజ్‌పూల్ విస్తరించకుండా డ్యాం పునాదులకు రక్షణగా ప్రొటెక్టివ్ స్టీల్ సిలిండర్లు ఏర్పాటు చేశారు. 2009లో వరదలతో ఆ స్టీల్ సిలిండర్లు కొట్టుకుపోయాయి. ఆ తర్వాత చిన్న, చిన్న మరమ్మతులు మాత్రం చేయించారు. ఈ ప్లంజ్ పూల్ విషయంలో ఆందోళన వ్యక్తం కావడంతో ఢిల్లీలోని కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ అధ్యయనం చేసింది.. నిపుణుల కమిటీలను ఏర్పాటు చేసింది.. వారంతా ప్రాజెక్టును పరిశీలించారు. తాజాగా సీడీఎస్ఈ టీమ్ ప్రాజెక్టును పరిశీలించి పలు కీలక సూచనలు చేసింది.

## అమరావతి అసలు
# చాలెంజ్ మొదలు



**విజయవాడ, ఏప్రిల్ 4:**అమరావతి రాజధాని అంశంలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపు తీసుకువచ్చాయి. పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొందడంతో ఈ రాజధానికి చట్టబద్ధత లభించిందనే భావన బలపడింది. దీంతో ఇప్పటివరకు ఉన్న అనుమానాలు, సందేహాలు చాలా వరకు తొలగిపోయాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు  చెప్పినట్లు అమరావతిని ఇక ఎవ్వరూ మార్చలేరనే నమ్మకం ప్రజల్లో పెరుగుతోంది. భవిష్యత్తులో ఏ ప్రభుత్వం వచ్చినా ఈ నిర్ణయాన్ని మార్చడం సులభం కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఇప్పటి నుంచి అసలు సవాలు అభివృద్ధి దిశగా ఉంటుంది. కూటమి ప్రభుత్వం  మీద భారీ బాధ్యత ఉంది. అమరావతి కోసం ఇప్పటికే వేలాది ఎకరాలు సేకరించబడ్డాయి. ఇప్పుడు ఆ భూముల్లో ప్రణాళికాబద్ధంగా నిర్మాణాలు చేపట్టాలి. ప్రభుత్వ పరంగా సచివాలయం , అసెంబ్లీ, హైకోర్టు భవనాలతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలకు నివాస సముదాయాలు నిర్మించాల్సి ఉంది. ఇవి ప్రారంభమైతే పరిపాలన క్రమంగా అమరావతికి మారే అవకాశం ఉంటుంది.అయితే అభివృద్ధి పూర్తిగా ప్రభుత్వంతోనే సాధ్యం కాదు. ప్రైవేట్ రంగం  కూడా కీలక పాత్ర పోషించాలి. వారికి కేటాయించిన భూముల్లో వేగంగా నిర్మాణాలు జరిగితేనే నగరానికి నిజమైన రూపం వస్తుంది. వ్యాపార సంస్థలు, విద్యా సంస్థలు, పరిశ్రమలు ఏర్పడితే ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. ఈ విధంగా జనసంచారం పెరిగితే అమరావతి ఒక జీవంతో నిండిన నగరంగా మారుతుంది.ఒక నగరం ఎదగాలంటే ఫ్లోటింగ్ పాపులేషన్ ( చాలా ముఖ్యం. ఉద్యోగాలు, వ్యాపార అవకాశాలు, విద్యా సౌకర్యాలు ఉన్నచోటే ప్రజలు చేరతారు. అందుకే పరిశ్రమలు, ఐటీ కంపెనీలు, విశ్వవిద్యాలయాలు వంటి సంస్థలను ఆకర్షించడం అవసరం. ఇది ఒక్కరోజులో జరిగే పని కాదు. దీర్ఘకాలిక ప్రణాళికతో క్రమంగా ముందుకు వెళ్లాలి. పాలకుల చిత్తశుద్ధి, పట్టుదల ఈ విషయంలో చాలా కీలకం.రైతులకు ఇచ్చే రీటర్న్ ప్లాట్లు  కూడా అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. వారు తమ భూముల్లో నిర్మాణాలు ప్రారంభిస్తే ప్రాంతంలో చురుకుదనం పెరుగుతుంది. అలాగే అధికారులు, ఉద్యోగులు అక్కడే నివసించేలా ప్రోత్సహిస్తే నగరానికి కొత్త ఉత్సాహం వస్తుంది. ప్రభుత్వం సరైన ప్రోత్సాహాలు, సౌకర్యాలు అందిస్తే ఈ ప్రక్రియ వేగవంతమవుతుంది.రాజకీయంగా చూస్తే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ  తమ అభిప్రాయాన్ని ఇప్పటికే వెల్లడించింది. అమరావతికి వ్యతిరేకం కాదని చెబుతూ, అభివృద్ధి ఖర్చులపై సందేహాలు వ్యక్తం చేసింది. అయితే ఈ అంశంపై ప్రజలు ఇప్పటికే 2024 ఎన్నికల్లో తీర్పు ఇచ్చారు. భవిష్యత్తులో వారి అభిప్రాయం ఎలా ఉంటుందో చూడాల్సి ఉంది.ఇప్పుడు అందరి దృష్టి కూటమి ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపైనే ఉంది. అమరావతిని విజయవంతంగా అభివృద్ధి చేస్తే చంద్రబాబు నాయుడు చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించే అవకాశం ఉంది. ఈ అవకాశం ప్రతి నాయకుడికి రాదు. అందుకే ఈ బాధ్యతను ఎలా నిర్వర్తిస్తారన్నది కీలకం. మొత్తంగా చూస్తే అమరావతి భవిష్యత్తు ఇప్పుడు కార్యాచరణపై ఆధారపడి ఉంది. సరైన దిశలో అడుగులు వేస్తే ఇది దేశంలోనే ఒక మోడల్ క్యాపిటల్‌గా నిలవొచ్చు. రాష్ట్రంలోని ప్రతి పౌరుడు ఈ అభివృద్ధిని ఆసక్తిగా గమనిస్తున్నాడనే విషయం గుర్తుంచుకోవాలి.

# సెల్ఫ్ గోల్ చేసుకుంటున్న జగన్

**విజయవాడ, ఏప్రిల్ 4:**ప్రస్తుతం రాజకీయంగా ఆత్మరక్షణలో పడటమే కాకుండా వరుస తప్పిదాలతో సెల్ఫ్ గోల్స్ వేసుకుంటోంది. అమరావతి రాజధాని అంశం మొదలుకొని తాజా మత మార్పిడి వ్యవహారాల వరకు ప్రతి నిర్ణయం పార్టీ ఉనికిని ప్రశ్నార్థకం చేస్తోంది. క్షేత్రస్థాయిలో ఉన్న కార్యకర్తలు సైతం నాయకత్వ ధోరణి చూసి అయోమయానికి గురవుతున్నారు.రాజధాని అమరావతికి పార్లమెంట్ సాక్షిగా చట్టబద్ధత లభిస్తున్న తరుణంలో వైసీపీ అనుసరించిన తీరు ఆ పార్టీకి తీరని నష్టం చేకూర్చింది. ఒకవైపు వికేంద్రీకరణ అంటూనే, మరోవైపు రాజ్యాంగబద్ధంగా జరుగుతున్న ప్రక్రియను అడ్డుకోలేక సభ నుంచి వాకౌట్ చేయడం ద్వారా ఓటమిని అంగీకరించినట్లయింది. ఈ పరిణామం ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లోనూ పార్టీ పట్ల నమ్మకాన్ని తగ్గించింది. రాజధాని విషయంలో స్పష్టమైన వైఖరి లేకపోవడం వల్ల అటు ప్రజలు, ఇటు క్యాడర్ తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తిరుపతిలో ఒక ముస్లిం జంటను హిందూ మతంలోకి మార్చిన ఉదంతం రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. హిందూ ఓటు బ్యాంకును ఆకట్టుకోవాలనే తాపత్రయంతో చేసిన ఈ పని వికటించేలా కనిపిస్తోంది. నిజానికి రాష్ట్రంలో క్రైస్తవ మతంలోకి మారిన వారిని తిరిగి హిందూత్వంలోకి తీసుకురావాలనే డిమాండ్లు ఎక్కువగా ఉన్నాయి. కానీ వాటిని పట్టించుకోకుండా, ఎప్పుడూ వివాదాలకు దూరంగా ఉండే ముస్లింలను మత మార్పిడి అంశంలోకి లాగడం చర్చనీయాంశమైంది.వైసీపీ ఆవిర్భావం నుండి ముస్లింలు ఆ పార్టీకి బలమైన అండగా నిలుస్తూ వచ్చారు. అయితే ఇప్పుడు భూమన కరుణాకర్ రెడ్డి నేరుగా ఒక ముస్లిం కుటుంబాన్ని మతం మార్చి దానిని గొప్పగా ప్రచారం చేసుకోవడం ఆ వర్గంలో ఆగ్రహాన్ని కలిగిస్తోంది. మైనారిటీల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్న ఈ చర్య వల్ల రాబోయే రోజుల్లో ఆ ఓటు బ్యాంకు పార్టీకి దూరం అయ్యే ప్రమాదం ఉంది. సొంత పార్టీ నేతలే ఈ వ్యవహారంపై లోలోపల మదనపడుతున్నారు.పార్టీ తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాల వల్ల క్షేత్రస్థాయిలో సమాధానం చెప్పుకోలేక వైసీపీ కార్యకర్తలు సతమతమవుతున్నారు. ఒక సమస్యను పరిష్కరించబోయి మరో కొత్త సమస్యను సృష్టించుకోవడం నాయకత్వ లోపంగా కనిపిస్తోంది. హిందూత్వ కార్డు వాడాలా లేక మైనారిటీలను కాపాడుకోవాలా అనే సందిగ్ధంలో పార్టీ కొట్టుమిట్టాడుతోంది.



ఇలాంటి గందరగోళ పరిస్థితుల వల్ల పార్టీ కేడర్ మానసికంగా కుంగిపోతోంది. రాజకీయాల్లో ఏ నిర్ణయమైనా ఆచితూచి తీసుకోవాలి. కానీ వైసీపీ మాత్రం వరుసగా వివాదాస్పద అంశాలను నెత్తిన వేసుకుంటోంది. అమరావతి విషయంలో ప్రజల నాడిని పట్టుకోలేకపోవడం, మతపరమైన అంశాల్లో అనవసర జోక్యం చేసుకోవడం వల్ల పార్టీ పునాదులు కదులుతున్నాయి. తక్షణమే దిద్దుబాటు చర్యలు తీసుకోకపోతే రాజకీయంగా కోలుకోలేని దెబ్బ తగిలే అవకాశం ఉంది.

## ఎట్టకేలకు తీరిన
# సిక్కోలు వాసుల కల

**శ్రీకాకుళం ఏప్రిల్ 4:**శ్రీకాకుళం జిల్లావాసుల చిరకాల కోరిక నెరవేరింది. శ్రీకాకుళం జిల్లాలోని పలాస ఇచ్ఛాపురం సెక్షన్‌లోని ఏడు రైల్వే స్టేషన్‌లను..ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలోని కుర్దా రోడ్ డివిజన్ నుంచి దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లోని విశాఖపట్నం డివిజన్‌కు మార్చారు. ఈ విషయాన్ని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఎన్నో ఏళ్ల కోరిక నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు.విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటైన దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిధికి సంబంధించి మరో కీలక ముందడుగు పడింది. ఒడిశాలోని ఖుర్దా డివిజన్‌లో ఉన్న పలాస-ఇచ్ఛాపురం సెక్షన్ తాజాగా విశాఖ డివిజన్ పరిధిలోకి మార్చేశారు. ఈ మేరకు రైల్వే బోర్డు నిర్ణయం తీసుకోగా.. దక్షిణ కోస్తా, తూర్పు కోస్తా జోన్ జనరల్ మేనేజర్లకు ఉత్తర్వులు అందాయి. దీనిపై కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు కీలక ప్రకటన చేశారు.. ఏడు రైల్వే స్టేషన్‌లు విశాఖపట్నం డివిజన్‌లోకి వచ్చినట్లు తెలిపారు.శ్రీకాకుళం జిల్లాలోని పలాస నుంచి ఇచ్ఛాపురం వరకు ఉన్న 7 రైల్వే స్టేషన్లను.. ఈస్ట్ కోస్ట్ రైల్వే కుర్దా రోడ్ డివిజన్ నుంచి దక్షిణ కోస్తా రైల్వే జోన్ విశాఖపట్నం డివిజన్‌కు బదిలీ చేసినట్లు తెలిపారు. 2019లో దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రకటించినప్పటి నుంచి తాను ఈ డిమాండ్‌ను ముందుకు తీసుకెళ్లానని.. ఎట్టకేలకు ఏడు రైల్వేస్టేషన్‌లు విశాఖపట్నం డివిజన్‌లోకి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇది శ్రీకాకుళం ప్రజల చిరకాల కోరికని.. మొత్తానికి నెరవేరినందుకు ఆనందంగా ఉందన్నారు.ఈస్ట్ కోస్ట్ రైల్వే కుర్దా రోడ్ డివిజన్ నుంచి దక్షిణ కోస్తా రైల్వే జోన్ విశాఖపట్నం డివిజన్‌కు మార్చిన ఆ 7 రైల్వే స్టేషన్‌లు ఇలా ఉన్నాయి. పలాస, సుమ్మా దేవి, మందస రోడ్, బారువ, సోంపేట, జాడుపూడి, ఇచ్ఛాపురం స్టేషన్లను.. దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిధిలోకి రావడం ద్వారా పరిపాలనా సామర్థ్యం పెరిగి, ప్రజలకు మెరుగైన సేవలు అందనున్నాయని




కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈ నిర్ణయం తీసుకున్నందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు శ్రీకాకుళం ప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.మరోవైపు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో వంశధార నదిపై నేరడి బ్యారేజి నిర్మాణంకు అనుకూలంగా ట్రిబ్యునల్ తీర్పు ఇవ్వడం.. అందుకు అనుగుణంగా కేంద్ర జలశక్తి శాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం ఆనందంగా ఉందన్నారు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు. రెండు రాష్ట్రాల మధ్య సున్నితమైన అంశంపై ఈ సమస్య పరిష్కారం కోసం ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నామన్నారు. పార్లమెంట్‌లో, కేంద్ర మంత్రులతో సమస్యను చర్చిస్తూ.. చివరికి పరిష్కారం సాధించుకున్నామన్నారు. నేరడి బ్యారేజి నిర్మాణంతో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా మరింత సస్యశ్యామలం అవుతుందని విశ్వసిస్తున్నానని.. ఈ విజయంలో తోడ్పాటు అందించిన కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్, ప్రధాని నరేంద్ర మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ పోరాటానికి సరైన కార్యాచరణతో పరిష్కారం దిశగా నడిపించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి శ్రీకాకుళం రైతాంగం తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.

**అద్దె కార్యాలయం రెడీ**

విశాఖ రైల్వే జోన్ పరిధిలో మార్పులు చేసింది. గత కొంతకాలంగా వస్తున్న డిమాండ్లకు అనుగుణంగా నిర్ణయం వెల్లడించింది. శ్రీకాకుళం జిల్లా పలాస- ఇచ్ఛాపురం మధ్య ఏడూ రైల్వే స్టేషన్లను విశాఖ రైల్వే జోన్ లో చేర్చింది. కొత్తగా ఏర్పడిన విశాఖ డివిజన్లో సైతం కలిపింది. ఈ నిర్ణయంతో ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛ నెరవేరింది. ఇచ్ఛాపురం నుంచి పలాస మధ్య ఉన్న 7 రైల్వే స్టేషన్లు ఇకనుంచి సౌత్ కొస్టల్ రైల్వే జోన్ పరిధిలోకి రానున్నాయి.. మొన్ననే విశాఖ రైల్వే జోన్ తో పాటు విశాఖ డివిజన్ ఏర్పాటు చేసింది రైల్వే శాఖ. ఈస్ట్ కోస్ట్ పరిధిలో ఉన్న చాలా స్టేషనులను విశాఖ జోన్ లో చేర్చింది. కానీ పలాస నుంచి ఇచ్ఛాపురం వరకు ఉన్న 7 రైల్వే స్టేషన్లను ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ లోనే ఉంచేసింది.మరోవైపు విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే డివిజన్ ఏర్పాటైన సంగతి తెలిసిందే. అయితే శాశ్వత భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. మరోవైపు ఓ ప్రైవేటు భవనంలో కార్యాలయానికి సంబంధించి కార్యకలాపాలు మొదలు పెట్టాలని నిర్ణయించుకుంది రైల్వే శాఖ. విశాఖ కేంద్రంగా ఏర్పాటైన దక్షిణ కోస్తా రైల్వే జోన్ ను నాలుగు డివిజన్ల తో ఏర్పాటు చేశారు. విజయవాడ, గుంటూరు, గుంతకల్, విశాఖ డివిజన్లుగా విభజించారు. ఎప్పటినుంచో ఉన్న వాల్తేరు డివిజన్ ను రెండుగా విభజించారు. ఒక భాగాన్ని విశాఖ డివిజన్ గా చేశారు. మరో భాగాన్ని ఒడిస్సాలోని రాయగడ కేంద్రంగా కొత్త డివిజన్ ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ రైల్వే డివిజన్ పరిధిలోకి శ్రీకాకుళం జిల్లాలో

# మనిషి శరీరంలో క్యాన్సర్ ఎలా పుడుతుంది?



క్యాన్సర్ అంటే ఏమిటి, అది ఎలా పుడుతుంది, ఎన్ని రకాలు అనే భయం చాలా మందిలో ఉంటుంది. కణాల అనియంత్రిత పెరుగుదలతో శరీరంలో క్యాన్సర్ మొదలవుతుంది. దీనికి చరిత్ర, వివిధ వ్యాప్తి మార్గాలు, అవయవాలు, కణాల ఆధారంగా వర్గీకరణలు ఉన్నాయి. ప్రస్తుతం జరుగుతున్న పరిశోధనలు ఈ వ్యాధిపై కొత్త ఆశను రేకెత్తిస్తున్నాయి. క్యాన్సర్ అనే పేరు వినగానే చాలా మందికి మదిలో భయం మొదలవుతుంది. అసలు క్యాన్సర్ అంటే ఏంటి? అది మానవ శరీరంలో ఎలా పుడుతుంది? ఎన్ని రకాల క్యాన్సర్లు ఉన్నాయి? వాటిలో ఏది అత్యంత ప్రమాదకరమైనది? ఈ ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.. . క్యాన్సర్ ప్రస్తావన గ్రీకు, రోమన్ పుస్తకాల్లో ఉంది. క్రీస్తు పూర్వం 470, 370 మధ్యలో గ్రీకు వైద్యానికి పితామహుడిగా భావించే హిప్పోక్రటిస్ తొలుత క్యాన్సర్‌కు సంబంధించి కార్సినోస్ లేదా కార్సినోమా అనే పదాలను వాడారు. కార్సినోస్ అంటే గ్రీకు భాషలో పీత అని అర్థం. క్యాన్సర్ రోగులలో కనిపించే గట్టి గడ్డలు, అవి ఒక భాగం నుంచి మరో భాగానికి వ్యాపించడం, తుదిదశలో భరించలేని నొప్పి వంటి లక్షణాలను పీత గట్టి వెనుక భాగం,  కాటుతో వచ్చే నొప్పికి పోల్చడం ద్వారా ఈ పేరు వచ్చింది. గ్రీకు ఫిజిషియన్ గాలిన్ అంకోస్ (గ్రీకులో ఉబ్బడం) అనే పదాన్ని ప్రసిద్ధం చేశారు. రోమన్ ఫిజిషియన్ సెల్సస్ తొలుత లాటిన్ పదం క్యాన్సర్‌ను వాడారు. 17వ శతాబ్దంలో మైక్రోస్కోప్‌ను కనుగొన్న తర్వాతే క్యాన్సర్‌పై పరిశోధనలు మొదలయ్యాయి. 19వ శతాబ్దంలో వైద్య పురోగతితో క్యాన్సర్ రహస్యం మరింత బయటపడటం మొదలైంది. మానవ శరీరం కోట్లకొద్దీ కణాలతో రూపొందుతుంది. కొత్త కణాలు పుట్టడం, వాటి పనులు నిర్వర్తించడం, వాటి పని పూర్తయిన తర్వాత నశించడం, మళ్లీ కొత్త కణాలు పుట్టడం అనేది శరీరంలో జరిగే ఒక నియంత్రిత ప్రక్రియ. కణాలలోని జన్యువులు ఈ ప్రక్రియను నియంత్రిస్తాయి. అయితే, కార్సినోజెన్ ఎక్స్‌పోజర్, ఇన్ఫెక్షన్లు (వైరల్ ఇన్ఫెక్షన్లు), లేదా వంశపారంపర్యం వంటి కారణాల వల్ల ఈ జన్యువులలో మ్యుటేషన్ సంభవిస్తే, కణాలు నియంత్రణ కోల్పోయి అనియంత్రిత స్థాయిలో పెరుగుతాయి. వాటి పరిమాణం, సహజత్వంలో మార్పులు సంభవిస్తాయి. దీన్నే క్యాన్సర్ అంటారు. క్యాన్సర్ కణాలు నశించవు, వ్యాధి నిరోధక వ్యవస్థ నుంచి తప్పించుకుంటూ శరీరంలో ఒక భాగం నుంచి మరో భాగానికి విస్తరించి, ఇతర కణాలను, అవయవాలను దెబ్బతీస్తాయి. సాధారణ గడ్డలకు భిన్నంగా క్యాన్సర్ కణితులు శరీరంలోని ఏ భాగానికైనా విస్తరించగలవు.

## యాపిల్ కట్ చేసిన కాసేపటికే నల్లగా మారుతాయి ఎందుకు?



పండ్లు, కూరగాయలు కోసిన తర్వాత వాటి రంగు మారడం సహజమైన ప్రక్రియ అయినప్పటికీ దీని వల్ల వంట ప్రక్రియ ఆలస్యమవుతుంటుంది. ముఖ్యంగా బంగాళాదుంపలు, యాపిల్ కోసిన తర్వాత తక్కువ సమయంలోనే నల్లగా మారుతాయి. బంగాళాదుంపలు, యాపిల్‌లలో నల్లగా మారే ప్రక్రియను శాస్త్రీయంగా ఎంజైమాటిక్ బ్రౌనింగ్ అంటారు. బంగాళాదుంపలు, యాపిల్ పండ్లలో ‘పాలీఫినాల్ ఆక్సిడేస్’ అనే ఎంజైమ్ ఉంటుంది. ఈ ఎంజైమ్ కోసే వరకు కణాల లోపల సురక్షితంగా ఉంటుంది. అయితే కోసిన తర్వాత, ఈ కణాలు గాలిలోని ఆక్సిజన్‌తో సంబంధంలోకి వస్తాయి. ఆక్సిజన్, ఎంజైమ్‌ల మధ్య రసాయన ప్రతిచర్య మెలనిన్ అనే వర్ణద్రవ్యాన్ని ఉత్పత్తి చేస్తుంది. దీని వలన కోసిన ప్రాంతం నల్లగా లేదా గోధుమ రంగులో కనిపిస్తుంది. కట్ చేసిన బంగాళాదుంపలు, యాపిల్‌లు తాజాగా ఉంచడానికి మీరు ఖచ్చితంగా ఇంట్లో కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. బంగాళాదుంపలను కోసిన వెంటనే చల్లటి నీటిలో నానబెట్టాలి. ఇది గాలితో వాటి సంబంధాన్ని తెంచుకుంటుంది. దీంతో నల్లగా మారకుండా నిరోధిస్తుంది. ఇది సులభమైన చిట్కా. యాపిల్ కోసి తర్వాత తినాలనుకుంటే ముక్కలపై కొంచెం నిమ్మరసం రాయాలి. నిమ్మకాయలోని విటమిన్ సి (యాంటీఆక్సిడెంట్) ఆక్సీకరణ ప్రక్రియను నెమ్మదిస్తుంది. అలాగే, ఒక గిన్నెలో నీళ్ల తీసుకుని దానికి చిటికెడు ఉప్పు వేయాలి. అందులో బంగాళాదుంప లేదా యాపిల్ ముక్కలను ఉంచాలి. దీనివల్ల రంగు మారదు. యాపిల్ఎక్కువసేపు తాజాగా ఉంచాలనుకుంటే, రెండు కప్పుల నీటిలో రెండు టేబుల్ స్పూన్ల తేనె కలిపి అందులో యాపిల్ ముక్కలను ఉంచాలి. దాదాపు 3-5 నిమిషాల తర్వాత ముక్కలను తొలగించాలి. అలాగే కోసిన పండ్లను వెంటనే ఉపయోగించకూడదనుకుంటే, వాటిని క్లాంగ్ ఫిల్మ్‌తో గట్టిగా చుట్టండి లేదా రిఫ్రిజిరేటర్‌లో గాలి చొరబడని కంటైనర్‌లో నిల్వ చేయండి. దీనితో పాటు బంగాళాదుంపలు లేదా యాపిల్ నల్లబడకుండా ఆపాలనుకుంటే ఒక గిన్నెలో నీరు తీసుకొని దానికి ఒక చెంచా వెనిగర్ కలపండి. కట్ చేసిన బంగాళాదుంపలు లేదా యాపిల్ ముక్కలను ఈ నీటిలో 2-3 నిమిషాలు ముంచండి. ఇది వాటి రంగును తెల్లగా, చాలా కాలం పాటు తాజాగా ఉంచుతుంది. కానీ తినడానికి లేదా వంట చేయడానికి ముందు వాటిని ఒకసారి సాధారణ నీటితో శుభ్రం చేసుకోవడం మంచిది.

## నల్లశనగలతో అద్భుతమైన ఆరోగ్యం!



మన రోజువారీ ఆహారంలో పప్పుదినుసులు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. అందులో ముఖ్యంగా నల్ల శనగలు (కల చనా) ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. పోషకాలు సమృద్ధిగా ఉండటం వల్ల నల్ల శనగలను సూపర్ ఫుడ్‌గా కూడా పరిగణిస్తారు. ఇవి శరీరానికి శక్తిని ఇవ్వడంతో పాటు అనేక రకాల వ్యాధులను దూరం చేయడంలో సహాయపడతాయి. నానబెట్టిన నల్లశనగలు రోజు ఒక వంద గ్రాములు తిన్నారంటే శక్తి పెరిగి జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. కండరాలు బలంగా మారుతాయి. ఆ రోజంతా మంచి ఎనర్జీతో ఉత్సాహంగా ఉంటారు. అంతేకాదు, మీ శరీరానికి కావలసిన అన్ని రకాల ప్రోటీన్లు ఈ నల్ల శనగలలో పుష్కలంగా ఉండటం వలన అలసట రాదు. శరీరానికి కావాల్సిన పోషకాలు: నల్ల శనగల్లో ప్రోటీన్, ఫైబర్, ఐరన్, కాల్షియం, మాగ్నీషియం, పొటాషియం వంటి ముఖ్యమైన పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరానికి శక్తిని అందించి కండరాల పెరుగుదలకి సహాయపడతాయి. ముఖ్యంగా శాకాహారులు ప్రోటీన్ కోసం నల్ల శనగలను ఎక్కువగా తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. నల్ల శనగల్లో ఉన్న విటమిన్లు, ఖనిజాలు శరీరంలోని రోగనిరోధక శక్తిని పెంచుతాయి. దీని వల్ల చిన్నపాటి ఇన్ఫెక్షన్లు, జలుబు వంటి సమస్యల నుండి రక్షణ లభిస్తుంది. జీర్ణక్రియ మెరుగుపరుస్తాయి: నల్ల శనగల్లో ఉన్న ఫైబర్ జీర్ణవ్యవస్థను బలపరుస్తుంది. మలబద్ధకం సమస్యను తగ్గించి జీర్ణక్రియను సక్రమంగా జరగేలా చేస్తుంది. కడుపు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. రక్తహీనత నివారణ: నల్ల శనగల్లో ఐరన్ అధికంగా ఉంటుంది. ఇది రక్తంలో హీమోగ్లోబిన్ స్థాయిలను పెంచడంలో సహాయపడుతుంది. రక్తహీనత సమస్య ఉన్నవారు నల్ల శనగలను ఆహారంలో చేర్చుకుంటే మంచి ఫలితాలు పొందవచ్చు. గుండె ఆరోగ్యం మెరుగుదల: నల్ల శనగల్లో ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండటం వల్ల గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించి గుండె సంబంధిత సమస్యల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. బరువు తగ్గడంలో సహాయం: నల్ల శనగల్లో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల తిన్న తర్వాత ఎక్కువసేపు ఆకలి వేయదు. దీంతో అధికంగా తినే అలవాటు తగ్గి బరువు నియంత్రణలో ఉంటుంది. అందుకే డైట్ ఫాలో అయ్యే వారు నల్ల శనగలను తమ ఆహారంలో చేర్చుకుంటారు. నల్ల శనగలను రాత్రి నీటిలో నానబెట్టి ఉదయం తింటే ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అలాగే కూరలు, సలాడ్లు, స్నాక్స్ రూపంలో కూడా తీసుకోవచ్చు. క్రమం తప్పకుండా వీటిని ఆహారంలో చేర్చుకుంటే శరీరానికి కావాల్సిన పోషకాలు అందుతాయి. పోషకాలు సమృద్ధిగా ఉన్న నల్ల శనగలు ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమైన ఆహారం. రోజూ పరిమిత మోతాదులో వీటిని తీసుకుంటే జీర్ణక్రియ మెరుగుపడి, గుండె ఆరోగ్యం బాగుండి, శరీరానికి శక్తి లభిస్తుంది. అందుకే నల్ల శనగలను ఆరోగ్యకరమైన ఆహారంలో భాగంగా చేసుకోవడం మంచిదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.



## ప్రెగ్నెన్సీ టైంలో టీ తాగొచ్చా?

చాలా మంది టీతో తమ రోజును ప్రారంభిస్తుంటారు. కానీ గర్భధారణ సమయంలో టీ తాగే అలవాటు పట్ల జాగ్రత్తగా ఉంటాలి. టీలోని కెఫిన్, పాలు, చక్కెర శరీరాన్ని వివిధ రకాలుగా ప్రభావితం చేస్తాయి. గర్భధారణ సమయంలో ఆహారం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఎందుకంటే ఈ కాలంలో గర్భిణీ తనకు మాత్రమే కాకుండా గర్భంలో ఉన్న బిడ్డకు కూడా పోషకాలను అందించాలి. బలహీనత, అలసట, తలతిరగడం, రక్తహీనత, ఆమ్లత్వం, జీర్ణ సమస్యలను కలిగిస్తుంది. పోషకాల లోపం శిశువు అభివృద్ధిని కూడా ప్రభావితం చేస్తుంది. అందువల్ల గర్భధారణ సమయంలో ఏమి తినాలో, ఏమి నివారించాలో తెలుసుకోవడం చాలా ముఖ్యం. చాలా మంది టీతో తమ రోజును ప్రారంభిస్తుంటారు. కానీ గర్భధారణ సమయంలో టీ తాగే అలవాటు పట్ల జాగ్రత్తగా ఉంటాలి. టీలోని కెఫిన్, పాలు, చక్కెర శరీరాన్ని వివిధ రకాలుగా ప్రభావితం చేస్తాయి. గర్భధారణ సమయంలో టీని మితంగా తాగడం సాధారణంగా సురక్షితమైనదిగా భావిస్తారని డాక్టర్ అనామిక గౌర్ అంటున్నారు. అయితే దీని అధిక వినియోగం హానికరం. టీలోని కెఫిన్ శరీరంలోని ఐరన్ శాతాన్ని తగ్గిస్తుంది. ఇది రక్తహీనత ప్రమాదాన్ని పెంచుతుంది. అంతేకాదు, ఎక్కువ టీ తాగడం వల్ల ఆమ్లత్వం, గ్యాస్, గుండెల్లో మంట వస్తుంది. గర్భధారణ సమయంలో ఇటువంటి సమస్యలు సర్వసాధారణం కాబట్టి, అవి పెరిగే అవకాశం ఉంది. కొంతమంది స్త్రీలలో టీ వినియోగం నిద్రలేమి, వేగవంతమైన హృదయ స్పందనకు కారణమవుతుంది. అందువల్ల రోజుకు ఒకటి కంటే ఎక్కువ కప్పుల టీ తాగకూడదు. ఆమ్లత్వం లేదా వాంతులు సమస్యలు ఉంటే టీని నివారించడం మంచిది. నిజానికి వైద్యుల సలహా మేరకు మాత్రమే టీ తాగడం సురక్షితం. గర్భిణీలకు టీకి బదులుగా ఆరోగ్యకరమైన ఎంపికలు చాలానే ఉన్నాయి. వేడిగా పాలు తాగవచ్చు. ఇది కాల్షియంను అందిస్తుంది. ఎముకలను బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. నీళ్లు శరీరాన్ని హైడ్రేట్ చేస్తుంది. అలసటను కూడా తగ్గిస్తుంది. నిమ్మకాయ నీళ్లు జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది కాబట్టి ఇవి తాగవచ్చు. బదులుగా అల్లం టీ తాగే అలవాటు ఉంటే దానిని కూడా తాగవచ్చు. ఇది వాంతుల అనుభూతిని తగ్గించడంలో సహాయపడుతుంది. అంతే కాదు సుగంధ ద్రవ్యాల పానీయాలను కూడా తాగవచ్చు. కానీ వీటిని తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిది. ఈ ప్రత్యామ్నాయాలు శరీరానికి పోషకాలను అందిస్తాయి, ఆమ్లత ప్రమాదాన్నీ తగ్గిస్తాయి.

# బిజినెస్

## ఖాతాదారులకు బిగ్ అలర్ట్..




తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బ్యాంకు ఖాతాదారులకు అలర్ట్. ఇవాళ బ్రాంచ్ సేవలు దూరం కాబోతున్నాయి. బ్యాంకులు ఓపెన్ గా ఉన్నప్పటికీ, ఖాతాదారులకు సంబంధించిన సేవలు మాత్రం నిలిపివేయనున్నారు. ఆర్థిక సంవత్సరం ముగింపునకు సంబంధించిన పనులను బ్యాంక్ సిబ్బంది పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే కస్టమర్లకు ఈ రోజు బ్యాంకులు అందుబాటులో ఉండబోవు. కానీ మొబైల్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఏటీఎం లాంటి సేవలు మాత్రం యథావిధిగా కొనసాగుతాయి. కానీ బ్యాంక్ బ్రాంచీలలో నగదు జమ, విత్ డ్రాయల్ లాంటి సేవలు ఉండబోవు. ఇక ఏప్రిల్ 2వ తేదీన గురువారం బ్యాంకులు యథావిధిగా పనిచేస్తాయి. అటు ఏప్రిల్ మూడవ తేదీన గుడ్ ఫ్రైడే. ఆ రోజున మాత్రం మళ్లీ బ్యాంకులకు సెలవు ఉంటుంది. ఈ విషయాలను గుర్తించి లావాదేవీలు చేసుకోవాలని బ్యాంకు అధికారులు చెబుతున్నారు.

## ఏప్రిల్ 1వ తేదీ నుంచి జరిగే మార్పులు ఇవే !



భారతదేశ ప్రజలకు బిగ్ అలర్ట్. ఏప్రిల్ 1వ తేదీ నుంచి కొత్త రూల్స్ అమలులోకి రాబోతున్నాయి. ప్రతి నెల ఒకటో తారీఖు వచ్చిందంటే చాలు ధరలు హెచ్చుతగ్గులు కావడం, లేదా బ్యాంకులకు సంబంధించిన ఏదైనా అప్డేట్ రావడం లాంటివి జరుగుతూ ఉంటాయి. అయితే ఇవాళ్టి నుంచి కూడా కొన్ని కీలక మార్పులు జరగబోతున్నాయి. ముఖ్యంగా డిజిటల్ చెల్లింపులు చేసేటప్పుడు కేవలం ఓటీపీ ద్వారా మనం చేసేవాళ్లం. కానీ ఇకపై ప్రతి ట్రాన్సాక్షన్ కు పిన్/పాస్ వర్డ్, రిజిస్టర్డ్ డివైజ్, ఫింగర్ ప్రింట్ లేదా ఫేస్ ఐడీ లాంటివి కనీసం రెండు ఉండాలి. సైబర్ స్కాంలను నియంత్రించేందుకు గాను ఈ చర్యలు తీసుకుంటున్నారు. అలాగే ఇండియాలోని అన్ని పెట్రోల్ బంక్ ల్లో ఇ-20 పెట్రోల్ తప్పనిసరి చేసింది కేంద్రం. కేవైసీ చేయని ఫాస్ట్ ట్యాగ్ అకౌంట్లు బ్లాక్ అవుతాయి. ఇక కొన్ని బ్యాంకులు డెబిట్ కార్డు నిర్వహణ చార్జీలను అమాంతం పెంచేశాయి. అలాగే ఇకపైన కొత్త బీమా పాలసీలను తప్పనిసరిగా ఎలక్ట్రానిక్ రూపంలోనే జారీ చేయాల్సి ఉంటుంది. అలాగే గోల్డ్ లోన్ రీ-పేమెంట్ గడువు 180 రోజుల నుంచి 270 రోజులకు పెంచినట్లు తెలుస్తోంది.

## ఇ-కామర్స్ ఎగుమతులపై సీబీఐసీ సంస్కరణలు

ఇ-కామర్స్ ఎగుమతులు, కొరియర్ ఆధారిత దిగుమతులు - ఎగుమతులను బలోపేతం చేయడానికి, క్రమబద్ధీకరించడానికి ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చేలా సమగ్ర సంస్కరణలను కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ) ప్రారంభించింది. వ్యాపార సౌలభ్యాన్ని పెంచే లక్ష్యంతో, కొరియర్ ఎగుమతులపై ఒక్కో సరకు రవాణాకు ఉన్న రూ.10 లక్షల విలువ పరిమితిని పూర్తిగా తొలగించడం, తిరిగి వచ్చిన, తిరస్కరణకు గురైన పార్సిళ్లను నిర్వహించడానికి ఒక క్రమబద్ధమైన విధానాన్ని ప్రవేశపెట్టడం, క్లియర్ కాని సరకుల కోసం చట్టబద్ధంగా ఆమోదించిన 'రిటర్న్ టు ఆరిజన్' (ఆర్టీఓ) యంత్రాంగాన్ని ప్రవేశపెట్టడం వంటి సంస్కరణలు ఇందులో ఉన్నాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ మంగళవారం తెలిపింది. ఇది లాజిస్టిక్స్ లోపాలను తగ్గిస్తుందని, ముఖ్యంగా ఎంఎస్ఎంఈలు, చేతివృత్తుల వారు, అంకురాల నిర్వాహకుల ప్రపంచ ఎగుమతి పోటీతత్వాన్ని బలోపేతం చేస్తుందని ఆర్థిక శాఖ పేర్కొంది.

# లక్ష మార్క్ ఆశలు ఆవిరి




స్టాక్ మార్కెట్లలో లాభాల పంట పండుతుందని ఆశించిన ఇన్వెస్టర్లకు గతేడాది కోలుకోని దెబ్బ తీసింది. గడిచిన ఏడాది కాలంగా అంతర్జాతీయ యుద్ధ మేఘాలు, ముడి చమురు సెగలు, రూపాయి పతనం, దేశీయ వృద్ధి రేటుపై అనుమానాలు, భయాలు వంటి ముప్పేట దాడులతో దలాల్ స్ట్రీట్ అతలాకుతలమైంది. కష్టపడి దాచుకున్న లక్షల కోట్ల రూపాయల సంపద కళ్లముందే హరించుకుపోవడంతో సామాన్య ఇన్వెస్టర్ల నుండి బడా ట్రేడర్ల వరకు అంతా గొల్లుమంటున్నారు. ఆర్థిక సంవత్సరం 2025-26లో అమ్మకాల ఒత్తిడితో సెన్సెక్స్ 7 శాతం, నిఫ్టీ 5 శాతం మేర కుంగిపోవడంతో ఈ ఆర్థిక సంవత్సరం ఇన్వెస్టర్లకు భారీ నష్టాలను మిగిల్చింది. విదేశీ ఇన్వెస్టర్లు సుమారు రూ.1.80 లక్షల కోట్ల నిధులను వెనక్కి తీసుకోవడం మార్కెట్లను మరింత అగాధంలోకి నెట్టింది. మరోవైపు చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రూపాయి 95 మార్కును దాటడం ఇన్వెస్టర్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది. వెరసి గతేడాది మార్కెట్ సంబరం కాస్తా విషాదంగా మారి మదుపర్ల జేబులకు భారీ చిల్లులు పెట్టింది. గతేడాది సెప్టెంబర్ నుంచి భారత ఈక్విటీ మార్కెట్లు పెట్టుబడిదారులను తీవ్ర నిరాశకు గురిచేశాయి. ఒకానొక దశలో సెన్సెక్స్ 1,00,000 మార్కును చేరుకుంటుందని విశ్లేషకులు అంచనా వేయగా.. దానికి విరుద్ధంగా ప్రస్తుతం సూచీలు రెండేళ్ల కనిష్ట స్థాయికి పడిపోయాయి. దీంతో 2025-26 మార్కెట్లకు గడ్డుకాలంగా మారింది. 2025 మార్చి ముగింపు నాటికి సెన్సెక్స్ 77,414 వద్ద ముగిసింది. ఈ ఏడాది సెన్సెక్స్ 5,467 పాయింట్లు లేదా 7 శాతం పతనమై మార్చి 30 నాటికి 72,000 దిగువన 71,947కు పరిమితమయ్యింది. గత రెండేళ్లలో సెన్సెక్స్ రెండుసార్లు 85,000 మార్కును తాకినప్పటికీ ఆ స్థాయిని నిలబెట్టుకోలేకపోయింది. మార్కెట్ అస్థిరతను సూచించే 'ఇండియా విఐఎక్స్ ఇండెక్స్ గత ఏడాది కాలంలో 120 శాతం పెరిగి 27.89 వద్ద ముగియడం మార్కెట్లలో నెలకొన్న భయాందోళనలకు అద్దం పడుతోంది. 2025-26లో బిఎస్ఇలో లిస్టింగ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.413.75 లక్షల కోట్ల నుండి రూ.412.41 లక్షల కోట్లకు పడిపోయింది. అంటే ఇన్వెస్టర్లు సుమారు రూ.1,34,414 కోట్ల మేర తమ సంపదను కోల్పోయారు.

# 12,000మంది భారతీయ ఉద్యోగులపై ఒరాకిల్ వేటు




అమెరికాకు చెందిన ఐటి సంస్థ ఒరాకిల్ సుమారు 12,000మంది భారతీయ ఉద్యోగులపై వేటు వేసింది. నెలరోజుల్లో మరో విడత తొలగింపులు వుండవచ్చని ప్రభావిత ఉద్యోగులు మంగళవారం తెలిపారు. సమాచారమిచ్చిన ఉద్యోగుల్లో ఒకరు ఆ సంస్థ మానవ వనరుల విభాగానికి చెందిన వారు. తొలగించిన ఉద్యోగులతో కలిపి ఒరాకిల్ ఇండియాలో సుమారు 30,000మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఈ సంస్థ 30,000మంది ఉద్యోగులను తొలగించింది. సంస్థ పునర్వ్యవస్థీకరణ, కార్యకలాపాల క్రమబద్ధీకరణలో భాగంగా వారి విధులు సంస్థకు అవసరం లేదని ఉద్యోగులకు పంపిన ఈమెయిల్‌లో తెలిపింది. అదనంగా మూడు నెలల జీతం, సంస్థలో పనిచేసిన ప్రతి ఏడాదికి 15 రోజుల జీతం, మిగిలిన సెలవులను నగదుగా మార్చుకునే అవకాశం, వేతనం ఆధారంగా గ్రాట్యుటీ చెల్లించనున్నట్లు తెలిపింది. అయితే గడువుతేదీలోగా స్వచ్ఛందంగా, స్నేహపూర్వకముగా రాజీనామా చేసిన ఉద్యోగులు మాత్రమే ఈ పరిహారం పొంతుతారని పేర్కొంది. ఉద్యోగుల తొలగింపులపై వ్యాఖ్యానించేందుకు ఒరాకిల్ నిరాకరించింది. భారత్‌లో ఒరాకిల్ అమలు చేస్తున్న 16 గంటల పనివిధానానికి వ్యతిరేకంగా నిరసన తెలిపినందుకు గాను, సెప్టెంబర్‌లో తనను ఉద్యోగం నుండి తొలగించారని ఆ సంస్థ మాజీ ఉద్యోగి ఒకరు తెలిపారు. స్థానిక చట్టాలు చాలా కఠినంగా ఉన్నందున, అమెరికాలో చాలా మంది భారతీయ ఉద్యోగులు ప్రభావితమయ్యారని సంబంధిత వర్గాలు తెలిపాయని అన్నారు.

# ఢిల్లీ బోణీ.. లక్నోపై ఘన విజయం

### సమీర్ అజేయ అర్ధ సెంచరీతో విజృంభణ

### రాణించిన ఎన్గిడ్,నటరాజన్





**లక్నో :** ఐపీఎల్‌లో ఢిల్లీ బోణీ కొట్టింది. బుధవారం లక్నోతో జరిగిన పోరులో ఢిల్లీ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. లక్నో నిర్దేశించిన 142 పరుగుల లక్ష్యాన్ని ఢిల్లీ 17.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 145 పరుగులు చేసింది. సమీర్ రిజ్వి(47 బంతుల్లో 70 నాటౌట్, 5ఫోర్లు, 4సిక్స్‌లు) అజేయ అర్ధసెంచరీతో అదరగొట్టగా, స్టబ్స్(32 బంతుల్లో 39 నాటౌట్) సాధికారిక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. ప్రిన్స్ యాదవ్(2/20) రెండు వికెట్లు తీశాడు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో.. క్యాపిటల్స్ బౌలర్ల ధాటికి 18.4 ఓవర్లలో 141 రన్స్‌కే కుప్పకూలింది. అబ్దుల్ సమద్ (25 బంతుల్లో 36, 3 ఫోర్లు, 1 సిక్స్), మిచెల్ మార్ష్ (28 బంతుల్లో 35, 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) మినహా మిగిలినవారంతా విఫలమయ్యారు. ఢిల్లీ బౌలర్లలో ఎంగిడి (3/27), నటరాజన్ (3/29) తలా మూడు వికెట్లు పడగొట్టగా స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ (2/31) రెండు వికెట్లు తీశాడు.

#### జెయింట్స్ తడబాటు

బౌలర్లకు సహకరించే లక్నో పిచ్‌పై టాస్ గెలవగానే అక్షర్ మరో ఆలోచన లేకుండా బౌలింగ్ ఎంచుకోగా అతడి నిర్ణయాన్ని సరైనదే అని నిరూపిస్తూ క్యాపిటల్స్ బౌలర్లు ఆరంభం నుంచే కట్టుదిట్టంగా బంతులేశారు. గత సీజన్‌లో మార్ష్‌కు అండగా రాణించిన ఓపెనర్ మార్క్‌్రమ్ కాదని బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకొచ్చిన కెప్టెన్ రిషభ్ పంత్ (7).. రెండో ఓవర్లోనే దురదృష్టవశాత్తూ రనౌట్ అయ్యాడు. అక్షర్ వేసిన పవర్ ప్లే ఆఖరి ఓవర్లో లాంగాన్ మీదుగా సిక్స్ కొట్టిన మార్క్మ్ (11) తర్వాతి బంతికే క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. తర్వాత నటరాజన్.. బదోనిని ఔట్ చేయగా ఎంగిడి, ప్రమాదకర పూరన్ (8)ను బౌల్డ్ చేశాడు. టాపార్డర్ విఫలమవుతున్నా అడపాదడపా షాట్లు ఆడిన మార్ష్.. కుల్‌దీప్ ఓవర్లో లాంగాఫ్ మీదుగా భారీ షాట్ ఆడబోయి స్టబ్స్ చేతికి చిక్కడంతో లక్నో కష్టాలు మరింత రెట్టింపయ్యాయి. 10 ఓవర్లకు ఆ జట్టు చేసింది 80/5 పరుగులే. ఈ క్రమంలో సమద్ కాస్త ప్రతిఘటించి వికెట్ల పతనానికి అడ్డుకట్ట వేశాడు. ముకుల్ (14), షాబాజ్ (15బి)తో కలిసి ఆ జట్టుకు విలువైన పరుగులు జతచేశాడు. కానీ నటరాజన్ తన ఆఖరి ఓవర్లో సమద్‌ను ఔట్ చేయడంతో లక్నో ఇన్నింగ్స్ ముగియడానికి పెద్దగా టైమ్ పట్టలేదు. 4 పరుగుల వ్యవధిలో ఆ జట్టు చివరి నాలుగు వికెట్లను కోల్పోయి ఆలౌట్ అయింది.

#### రిజ్వి, స్టబ్స్ విజృంభణ

26/4. స్వల్ప ఛేదనలో 4 ఓవర్లకు ఢిల్లీ స్కోరిది. లక్ష్యం చిన్నదే అయినా ఆ జట్టు ఛేదన కష్టంగానే సాగింది. పటిష్టమైన బౌలింగ్ లైనప్‌నకు తోడు పిచ్ సహకరిస్తుండటంతో లక్నో బౌలర్లు పవర్ ప్లేలో క్యాపిటల్స్ బ్యాటర్లకు చుక్కలు చూపించి టాపార్డర్‌ను పెవిలియన్‌కు పంపారు. తొలి బంతికి రాహుల్‌ను షమీ డకౌట్ చేయగా రెండు బౌండరీలు ఓ సిక్స్ కొట్టిన నితీశ్ రాణా (15)ను మోహ్సిన్ ఖాన్ పెవిలియన్‌కు పంపాడు. తర్వాతి ఓవర్లో ప్రిన్స్ యాదవ్.. ఈ లీగ్‌లో అరంగేట్రం చేసిన లంక ఓపెనర్ పతుమ్ నిస్సంక (1)తో పాటు అక్షర్ పటేల్‌నూ ఔట్ చేయడంతో ఢిల్లీ ఆత్మరక్షణలో పడింది. ఈ క్రమంలో రిజ్వి, స్టబ్స్ వికెట్లను కాపాడుకునేందుకు ప్రాధాన్యమిచ్చారు. క్రీజులో కుదురుకున్నాక షాబాజ్ పదో ఓవర్లో రిజ్వి.. 3 ఫోర్లతో 16 రన్స్ రాబట్టాడు. మార్క్మ్ 14వ ఓవర్లో 6, 4తో 37 బంతుల్లో అతడి అర్ధ శతకం పూర్తయింది. ఆఖరి 6 ఓవర్లలో క్యాపిటల్స్ విజయానికి 36 పరుగులు అవసరం కాగా...రిజ్వి ఆకాశమే హద్దుగా చెలరేగాడు. మోహిసిన్ వేసిన 16వ ఓవర్‌లో ఓ ఫోర్, సిక్స్‌తో రిజ్వి 13పరుగులు పిండుకోవడంతో గెలుపు సమీకరణం కాస్తా 24 బంతుల్లో 16కు చేరింది. అప్పటి వరకు పొదుపు బౌలింగ్ చేసిన మోహిసిన్ అదే ఒరవడి కొనసాగించలేకపోయాడు. ఆఖర్లో సమద్ బౌలింగ్‌లో సిక్స్‌తో రిజ్వి..ఢిల్లీకి విజయాన్ని కట్టబెట్టాడు.

#### సంక్షిప్త స్కోర్లు

లక్నో: 18.4 ఓవర్లకు 141 ఆలౌట్ (సమద్ 36, మార్ష్ 35, ఎంగిడి 3/27, నటరాజన్ 3/29)

ఢిల్లీ: 17.1 ఓవర్లలో 145/4(రిజ్వి 70 నాటౌట్, స్టబ్స్ 39 నాటౌట్, ప్రిన్స్ 2/20, షమీ 1/28)

# స్పోర్ట్స్

## క్వార్టర్స్‌కు విశ్వనాథ్, సచిన్



**ఉలన్‌బాతర్ (మంగోలియా) :** ఏషియా బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో మూడో రోజూ భారత బాక్సర్లు దుమ్మురేపారు. మంగోలియాలో జరుగుతున్న ఈ టోర్నీలో భాగంగా విశ్వనాథ్ సురేశ్, సచిన్ సివాచ్ క్వార్టర్స్‌కు దూసుకెళ్లారు. పురుషుల 50 కిలోల క్యాటగిరీలో విశ్వనాథ్.. 5-0తో కిర్గిస్థాన్ బాక్సర్ బెక్జట్ ఎర్గెషోవ్‌పై ఏకపక్ష విజయం సాధించి తదుపరి రౌండ్‌కు ముందంజ వేశాడు. మెన్స్ 60 కిలోల విభాగంలో సచిన్.. 4-1తో బుయండలై బయర్ఖు (మంగోలియా)ను ఓడించి క్వార్టర్స్ చేరాడు.

## జింబాబ్వే పర్యటనకు భారత్



**ముంబై :** వరల్డ్ చాంపియన్ భారత జట్టు ఈ ఏడాది జులైలో జింబాబ్వే పర్యటనకు వెళ్లనుంది. ఆఫ్రికా దేశంతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడేందుకు గాను టీమ్ఇండియా.. జింబా బ్వే పర్యటనకు వెళ్లనున్నట్టు బుధవారం బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. ఇటీవలే పొట్టి ప్రపంచకప్‌ను వరుసగా రెండోసారి దక్కించుకున్న భారత్.. చివరిసారిగా 2024లో జిం బాబ్వే టూర్‌కు వెళ్లింది. ప్రపంచకప్ విజయం తర్వాత టీమ్ఇండియాకు ఇదే తొలి ద్వైపాక్షిక సిరీస్. హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జులై 23, 25, 26 తేదీల్లో ఇరుజట్ల మధ్య మూడు మ్యాచ్‌లు జరుగుతాయి.

# అందుకే తెలుగు సినిమాల్లో నటించడం లేదు మలయాళ స్టార్‌టొవినో థామస్



మలయాళ స్టార్ హీరో టొవినో థామస్ నటిస్తున్న భారీ బడ్జెట్ మూవీ "పళ్లిచట్టంబి". ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ ఫిలింస్, సి క్యూబ్ బ్రోస్ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్స్ పై నౌఫల్, బ్రిజీష్, చాణక్య చైతన్య చరణ్ నిర్మిస్తున్నారు. డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో కయదు లోహర్ హీరోయిన్ గా నటిస్తోంది. ఏప్రిల్ 10న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ నేపథ్యంలో తాజాగా హీరో టొవినో థామస్, హీరోయిన్ కయదు లోహర్ మీడియాతో ముచ్చటించారు. హీరో టొవినో థామస్ మాట్లాడుతూ.. డిజో పళ్లిచట్టంబి కథ చెప్పినప్పుడు చాలా ఎగ్జైటింగ్ గా అనిపించింది. ఈ సినిమా చేయాలని ఫిక్స్ అయ్యాం. ఆ తర్వాత నేను కమిట్ మూవీస్ ఫినిష్ చేశాను. డిజో కూడా జనగణమన సినిమాతో పాటు మరో మూవీ రూపొందించాడు. ఆ తర్వాత ఈ సినిమా వర్క్ ప్రారంభించాం. కొద్ది రోజుల తర్వాత ప్రొడ్యూసర్ మారారు. మేము వేరే ప్రొడ్యూసర్స్ ను ప్రాజెక్ట్ లోకి తీసుకున్నాం. ఈ కథ ప్రకారం హీరో బలంగా కనిపించాలి. విలన్స్ ను విసిరిపారేసేలా ఉండాలి. అందుకే వెయిట్ పెరిగాను. అప్పటిదాకా డైటింగ్ చేసే నేను ఈ చిత్రం కోసం డైటింగ్ పక్కనపెట్టాను. హెయిర్ స్టైల్, మీస కట్టుతో ఒక మంచి లుక్ లోకి మారాను. డిజోతో వర్క్ చేయడంలో ఎలాంటి ప్రెజర్ ఉండదు. సెట్ లో కూల్ గా వర్క్ చేసుకుంటూ వెళ్తాడు. ఆయనకు కోపం వస్తుందా అనేది కూడా తెలియదు. పళ్లిచట్టంబి సినిమా 50వ దశకంలో కేరళలో జరిగిన ఇన్సిడెంట్స్ స్ఫూర్తిగా ఫిక్షనల్ గా సాగే మూవీ. అప్పుడు సామాజికంగా ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో వాటినే మూవీలో చూపించాం. అంతేకానీ ఆ పరిస్థితుల నేపథ్యాన్ని మా అభిప్రాయ కోణంలో చూపించలేదు. మీరు ఒక్కసారి సినిమా చూస్తే మూవీ సోల్ అర్థమవుతుంది. మా మూవీలో మానవత్వం ముఖ్యమనే పాయింట్ ను చూపిస్తున్నాం. నా వ్యక్తిగత అభిప్రాయంలో కూడా మనమంతా ఒక్కటే. ఎవరు తక్కువ, ఎవరు ఎక్కువ కాదు. పళ్లిచట్టంబి ఒక బ్యూటిఫుల్ ఎమోషనల్ ఫిలిం, ఫ్యామిలీ అంతా కలిసి చూసేలా ఉంటుంది.



# ఆ అవకాశం ఇప్పటివరకూ రాలేదు మాళవికా నాయర్

"చిత్ర పరిశ్రమలో ఇన్నేళ్ల నా సినీ ప్రయాణం పట్ల ఒక నటిగా హ్యాపీగా ఉన్నాను. అయితే సంతృప్తిగా లేను. నేను పూర్తి స్థాయిలో సంతృప్తి చెందే పాత్ర చేసే అవకాశం ఇప్పటివరకు రాలేదు. ఇంకా మంచి పాత్రలు చేయాలని కోరుకుంటున్నాను. అయితే 'బైకర్' సినిమాలో నటనకి ప్రాధాన్యం ఉన్న పాత్ర చేశాను. ఈ చిత్రం కుటుంబ ప్రేక్షకులకు ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతుంది" అని హీరోయిన్ మాళవికా నాయర్ చెప్పారు. శర్వానంద్, మాళవికా నాయర్ జోడీగా నటించిన చిత్రం 'బైకర్'. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వం వహించారు. విక్రమ్ సమర్పణలో యూవీ క్రియేషన్స్‌పై వంశీ--ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 3న విడుదల కానుంది. ఈ సందర్భంగా మాళవికా నాయర్ విలేకరులతో మాట్లాడుతూ-- "బైకర్' కథ మూడు టైమ్‌లైన్స్‌లో సాగుతుంది. నా పాత్ర కూడా ఇన్‌వాల్వ్ అవుతూ ఉంటుంది. రేసింగ్ బ్యాక్‌డ్రాప్ సినిమా అయినప్పటికీ మంచి ఫ్యామిలీ ఎమోషన్స్ కూడా ఉన్నాయి. తండ్రీ కొడుకుల భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి. ఈ సినిమా స్ఫూర్తినిస్తుంది. ఇక ప్రతిసారీ కొత్త క్యారెక్టర్ చేయాలని ఉండటం వల్లే గ్యాప్ వస్తోంది. ఓ పాత్ర చేసే ముందు ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుంటాను... కొత్తగా అనిపిస్తేనే చేస్తాను" అని తెలిపారు.

# పాతికేళ్ల యువకుడిగా...

## వందో సినిమాలో ఫ్యాన్స్‌కి ట్రీట్



సెంచరీ టచ్ చేయడమంటే ఆ మజా వేరు. ప్రస్తుతం నాగార్జున ఆ జోష్‌లోనే ఉన్నారు. నటుడిగా నూరవ సినిమా మైల్ స్టోన్‌ని టచ్ చేశారు నాగ్. కెరీర్‌లో అత్యంత కీలకమైన మలుపు కాబట్టి తన నూరవ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ పై అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. నాగార్జున హీరోగా ఈ చిత్రాన్ని తమిళ దర్శకుడు ఆర్ఏ కార్తీక్ తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే 45 శాతం చిత్రీకరణ పూర్తయింది. ఈ నేపథ్యంలో ఒక ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో నాగార్జున ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈ చిత్రంలో తాను 25 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వరకు వివిధ దశల్లో, విభిన్న గెటప్స్‌లో కనిపించనున్నట్లు నాగార్జున ఆ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. పాతికేళ్ల యువకుడిగా కనిపించడానికి 'డీ--ఏజింగ్' టెక్నాలజీని ఉపయోగిస్తున్నారట. అభిమాన హీరో ఇలా తక్కువ వయసులో కనిపించడం అనేది ఫ్యాన్స్‌కి మంచి ట్రీట్‌లాంటిదని చె??పచ్చు. ఇక సాదా సీదా స్థాయి నుంచి కోటీశ్వరుడిగా ఎదిగే ఒక వ్యక్తి ప్రయాణం నేపథ్యంలో సాగే ఈ చిత్రకథ తండ్రీ--కూతుళ్ల మధ్య ఉండే సెంటిమెంట్ చుట్టూ తిరుగుతుందని కూడా నాగార్జున పేర్కొన్నారు. ఈ చిత్రంలో టబు, సుస్మితా భట్, విజయేంద్ర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి 'కింగ్ 100, కింగ్ 100 నాటౌట్, లాటరీ కింగ్' వంటి టైటిల్స్‌ని పరిశీలిస్తున్నారట. ఈ చిత్రాన్ని దసరాకి రిలీజ్ చేయాలనుకుంటున్నారని సమాచారం.

# వంద దేవుళ్లు సాంగ్.. విజయ్ ఆంటోనీ, స్వాసిక 'ఇది కలనో' సాంగ్

తెలుగు, తమిళ ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని యాక్టర్ విజయ్ ఆంటోని. ఈ మల్టీ టాలెంటెడ్ యాక్టర్ శశి డైరెక్షన్‌లో నటించిన చిత్రం బిచ్చగాడు. ఈ మూవీ బాక్సాఫీస్ ఏ రేంజ్‌లో షేక్ చేసిందో తెలిసిందే. తాజాగా ఈ ఇద్దరి కాంబోలో వస్తోన్న మూవీ 'వంద దేవుళ్లు'. ఈ చిత్రం నుంచి ఇది కలనో సాంగ్ విడుదల చేశారు. భాష్య శ్రీ రాసిన ఈ పాటను శిభి శ్రీనివాసన్, శిరీష భాగవతుల వాయిస్ అందరినీ ఇంప్రెస్ చేసేలా సాగుతుంది. ఇప్పటికే విడుదల చేసిన ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచుతోంది. రైతు సమస్యల చుట్టూ తిరిగే బలమైన సామాజిక సందేశంతో వస్తోన్న ఈ మూవీలో స్వాసిక, అజయ్, కావ్య, శక్తి, పదిని, కర్నాస్, బాలాజీ శక్తివేల్, దివాకర్, అరుళ్ దాస్, బక్స్, వినోదిని, మునిష్ కాంత్, కొడంగి వడివేలు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి భాష్య శ్రీ డైలాగ్ రైటర్‌గా కూడా పనిచేస్తున్నాడు. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పొరేషన్, ఫాతిమా విజయ్ ఆంటోనీ సమర్పణలో సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్ మీద రామంజనేయులు జవ్వాజి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీని వేసవిగా కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు.




# ఒక్కో గిరిజన కుటుంబానికి ఆవు, గేదె ఇస్తాం

అసోంలో వరుసగా మూడోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రంలో చొరబాటుదారులను అరికడుతుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. అలాగే చొరబాటుదారులను అసోం నుంచి వెనక్కి పంపుతుందని వెల్లడించారు. గిరిజన వర్గాల అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారిస్తుందని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ప్రతి జిల్లాలో ఒక పెద్ద డెయిరీని ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నారు. ప్రతి గిరిజన కుటుంబానికి ఒక ఆవు, ఒక గేదెను ఇస్తుందని స్పష్టం చేశారు. అసోంను కాంగ్రెస్ పార్టీ చొరబాటుదారులకు అడ్డాగా మార్చిందని ఆరోపించారు. ఈ మేరకు అసోంలోని గోల్పారాలో జరిగిన బహిరంగ సభలో అమిత్ షా వ్యాఖ్యానించారు. "కాంగ్రెస్ అసోంను చొరబాటుదారులకు కేంద్రంగా మార్చింది. వారి ప్రభుత్వం అధికారంలోకి వస్తే గిరిజన ప్రాంతాల్లోకి కూడా చొరబాటుదారులు వస్తారు. వరుసగా మూడోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చొరబాటుదారులను ఎంపిక చేసి వెనక్కి పంపుతుంది. చొరబాటుదారులందరినీ గుర్తించాం. ప్రస్తుతం సమయం కొంచెం తక్కువగా ఉంది. మాకు ఐదేళ్ల సమయం ఇవ్వండి. మేము గుర్తించిన చొరబాటుదారులను దేశం నుంచి వెళ్లగొడతాం. కాంగ్రెస్ పాలనలో గిరిజన సమాజ అభివృద్ధికి కేటాయించిన బడ్జెట్ రూ. 25,000 కోట్లు. నరేంద్ర మోదీ ప్రభుత్వం దాన్ని రూ. 1.38లక్షల కోట్లకు పెంచింది" అని అమిత్ షా పేర్కొన్నారు.

**గిరిజనుల సంక్షేమం గురించి కాంగ్రెస్ మాట్లాడదు : అమిత్ షా**

కాంగ్రెస్ పదేపదే ఎన్నికల్లో పోటీ చేయడానికి అసోంకు వస్తుందని, కానీ ఇక్కడి గిరిజనుల సంక్షేమం గురించి ఒక్కసారి కూడా మాట్లాడలేదని అమిత్ షా ఆరోపించారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచాయని, కానీ వారు (కాంగ్రెస్) ఒక్క గిరిజన మహిళనూ రాష్ట్రపతిని చేయలేదని




అన్నారు. కేవలం ప్రధాని మోదీ మాత్రమే గిరిజన సోదరి ద్రౌపదీ ముర్మును రాష్ట్రపతిని చేశారని వెల్లడించారు. "దేశవ్యాప్తంగా ఉన్న గిరిజన వర్గాల కళ, సంస్కృతి, వంటకాలు, వస్త్రధారణ, సంగీతం, నృత్యాలను ప్రధాని మోదీ ప్రపంచ వేదికపై ప్రోత్సహించారు. ఈ దుధ్నోయ్ నదిని పాల నది అని పిలుస్తారు. అందుకే దీనికి దుధ్నోయ్ అనే పేరు వచ్చింది. ఇక్కడ ఒక్క డెయిరీ అయినా ఉందా?. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే అసోంలో ప్రతి జిల్లాలోనూ ఒక డెయిరీని ఏర్పాటు చేస్తుంది. అలాగే ప్రతి గిరిజన కుటుంబానికి ఒక ఆవు, ఒక గేదెను అందిస్తుంది" అని అమిత్ షా స్పష్టం చేశారు.

**వివక్ష లేని పాలనను అందించడానికి ఎన్డీఏ కృషి : యూపీ సీఎం యోగి**

బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం దేశ సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేసిందని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తెలిపారు. అలాగే ఎన్డీఏ సర్కార్ సేవా దృక్పథంతో వివక్ష లేని పాలనా ప్రయోజనాలను దేశంలోని ప్రతి పౌరుడికి అందించడానికి కృషి చేస్తోందన్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం గత పదేళ్లలో అసోం పునరుజ్జీవాన్ని సాకారం చేయడానికి తన నిబద్ధతను చాటుకుందని చెప్పారు. కాంగ్రెస్ తన పాలనలో అసోంలో అరాచకత్వం, అల్లర్లు, చొరబాట్లను ప్రోత్సహించిందని ఆరోపించారు. తద్వారా అసోంలో పౌరుల భద్రతకు ఆటంకం కలిగించిందని మండిపడ్డారు. బార్పేటలో జరిగిన బహిరంగ సభలో యోగి పాల్గొని ఈ వ్యాఖ్యలు చేశారు.

**కాంగ్రెస్‌పై నితిన్ నబీన్ మండిపాటు**

అసోంకు దక్కాల్సిన హక్కులు దక్కేలా చూడటానికి తాము పోరాడుతామని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కామరూప్?లో జరిగిన బహిరంగ సభలో వ్యాఖ్యానించారు. ఆనాటి కాంగ్రెస్ సర్కార్ అక్రమంగా చొరబాటుదారులకు అప్పగించిన భూములను తిరిగి అసోం ప్రజలకు అప్పగించడానికి హిమంత బిశ్వశర్మ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కార్ కృషి చేసిందని కొనియాడారు.

**అసోంలో ఎన్డీఏ హ్యాట్రిక్ ఖాయం : కేంద్ర సహాయ మంత్రి పవిత్ర**

అసోంలోని ప్రతి నియోజకవర్గంలోనూ ప్రజలు తమను ఆశీర్వదిస్తున్నారని కేంద్ర సహాయ మంత్రి పవిత్ర మార్గరీటా తెలిపారు. వరుసగా మూడోసారి ఎన్డీఏ ప్రభుత్వమే అధికారం చేపట్టబోతోందని తమకు పూర్తి నమ్మకం ఉందన్నారు. నజీరా నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి మయూర్ బోర్గొహైన్ కనీసం 30,000 ఓట్ల మెజారిటీతో విజయం సాధిస్తారని అంచనా వేశారు.

కాగా, అసోంలో ఏప్రిల్ 9న ఒకే విడతలో ఎన్నికల పోలింగ్ జరగనుంది. మే 4న ఎన్నికల ఫలితాలు విడుదల కానున్నాయి. అధికార ఎన్డీఏ హ్యాట్రిక్ కొట్టేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తోంది. పదేళ్ల తర్వాత అధికారాన్ని చేజిక్కించుకునేందుకు విపక్ష కాంగ్రెస్ కూటమి సర్వశక్తులు ఒడ్డుతోంది.

# రాజకీయ లబ్ధి కోసమే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు

మోదీ సర్కార్ పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను నిర్వహించడంపై కాంగ్రెస్ తీవ్ర ఆరోపణలు చేసింది. బంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందడం కోసమే కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తోందని విమర్శించింది. మహిళా రిజర్వేషన్ల చట్ట సవరణ, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులను ఆమోదించేందుకు ఇలా చేస్తోందని వ్యాఖ్యానించింది. ఇది ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఘోరంగా ఉల్లంఘించడమేనని మండిపడింది. తొందరపాటుతో నియోజకవర్గాల పునర్విభజన కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం ప్రమాదకరమైన పరిణామాలకు దారితీస్తుందని విమర్శించింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్) జైరాం రమేశ్ మీడియా సమావేశంలో వ్యాఖ్యానించారు.

"నారీ శక్తి వందన అధినియమ్- 2023 బిల్లు ఆమోదం పొంది 30 నెలలు అయ్యింది. ఇంతకాలం ప్రభుత్వం నిద్రపోయిందా ఎన్నికల సమయంలో రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వం ఇలా చేస్తోంది. నియోజకవర్గాల పునర్విభజనపై ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక సమాచారం గానీ, ప్రతిపాదన గానీ రాలేదు. అయితే అనధికారికంగా లోక్‌సభ సీట్లలో దామాషా ప్రకారం పెరుగుదల ఉంటుందని మాకు తెలిసింది. దామాషా ప్రకారం లోక్‌సభ సీట్లలో పెరుగుదల ఉంటుందని చెబుతున్నప్పటికీ, వాస్తవానికి చిన్న రాష్ట్రాలు, అలాగే దక్షిణ, ఈశాన్య, పశ్చిమ రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయి. ప్రతిపాదిత బిల్లుతో ఉత్తర్‌ప్రదేశ్‌లో లోక్‌సభ సీట్లు 120కి పెరుగుతాయి. దక్షిణాది రాష్ట్రమైన కేరళలో లోక్‌సభలో సీట్ల సంఖ్య గరిష్ఠంగా 40కి మాత్రమే చేరుకుంటుంది. అనధికారికంగా మాకు అందిన సమాచారం ప్రకారం దామాషా ప్రకారం లోక్‌సభ సీట్ల పెంపు చాలా రాష్ట్రాలకు ప్రమాదకరం" అని జైరాం రమేశ్ తెలిపారు.



**'15రోజుల తర్వాత ప్రత్యేక సమావేశాలు నిర్వహించొచ్చు కదా'**

ఈ ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను 15రోజుల తర్వాత (ఏప్రిల్ 29 తర్వాత) ఏర్పాటు చేయలేకపోయారా? అని జైరాం రమేశ్ ప్రశ్నించారు. తమిళనాడు, బంగాల్ ఎన్నికలను ప్రభావితం చేయడం, రాజకీయ లబ్ధి పొందడమే లక్ష్యంగా ఈ స్పెషల్ సెషన్‌ను ఏర్పాటు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ప్రభుత్వం కథన నిర్వహణ సూత్రంపై పనిచేస్తుందని ఆరోపించారు. "ఏప్రిల్ 16, 17, 18 తేదీల్లో ఉభయ సభలు సమావేశమవుతాయని, అందుకోసం పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తున్నామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. నారీ శక్తి వందన అధినియమ్‌లో సవరణలు చేసేందుకు కాంగ్రెస్‌తో చర్చలు జరపాలని ప్రభుత్వం కోరుకుంటోందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మార్చి 16న కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గేకు లేఖ రాశారు. దానిపై ఖర్గే స్పందిస్తూ ప్రభుత్వం విభజించి పాలించు విధానాన్ని పాటిస్తుందని అన్నారు. అందుకే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉండడం, రాజకీయ పార్టీలు ఎన్నికల్లో బిజీగా ఉన్నందున ఏప్రిల్ 29 తర్వాతే ఆల్ పార్టీ మీటింగ్ ఏర్పాటు చేయాలని విపక్ష పార్టీలు మార్చి 24న రిజిజుకు లేఖలు రాశాయి. రెండు రోజుల తర్వాత అంటే మార్చి 26న రాజ్యాంగ సవరణపై చర్చలు జరిపేందుకు కాంగ్రెస్ తమను కలవాలని రిజిజు ఖర్గేకి లెటర్ రాశారు. ఏప్రిల్ 29 తర్వాత అఖిలపక్ష సమావేశం జరపాలని ఖర్గే పునరుద్ఘాటించారు."

**మోదీ సర్కార్ ఏకపక్ష నిర్ణయం తీసుకుంది : జైరాం రమేశ్**

కేరళ, అసోం ఎన్నికలకు ముందు ఏప్రిల్ ఆరంభంలోనే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించుకుందని జైరాం రమేశ్ ఆరోపించారు. అయితే కొంతకాలం పాటు లేఖల మార్పిడి కొనసాగడంతో వారి ప్రయత్నం విఫలమైందన్నారు. ఇప్పుడు బంగాల్, తమిళనాడులో ఎన్నికల ప్రచారం జరుగుతున్నప్పుడు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి కూడా అమల్లో ఉన్న సమయంలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను నిర్వహించాలని మోదీ ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయం తీసుకుందని విమర్శించారు.

"ఈ లేఖలన్నింటిలో మహిళా రిజర్వేషన్ బిల్లు సవరణ గురించి మాత్రమే ప్రస్తావన ఉంది. కానీ ఇప్పుడు ఈ ప్రత్యేక సమావేశం నియోజకవర్గాల పునర్విభజన గురించి కూడా అని స్పష్టమైంది. డీలిమిటేషన్ కూడా అజెండాలో ఉందని కిరణ్ రిజిజు ఎప్పుడూ చెప్పలేదు. 2023 సెప్టెంబర్‌లో మహిళా రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందినప్పుడు జనాభా లెక్కలు, డీలిమిటేషన్ తర్వాత దానిని అమలు చేస్తామని ప్రభుత్వం చెప్పింది. జనాభా లెక్కలు, నియోజకవర్గాల పునర్విభజన వరకు అవసరం లేదు, వెంటనే మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయాలని ఖర్గే అప్పట్లో డిమాండ్ చేశారు" అని జైరాం రమేశ్ పేర్కొన్నారు.

# హార్మూజ్ జలసంధి సంక్షోభం

పశ్చిమాసియా సంక్షోభం తీవ్రరూపం దాల్చుతున్న వేళ, ప్రపంచానికి అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధి పరిస్థితిపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. ఆ జలసంధిలో జరిగిన దాడుల్లో ఇప్పటివరకు భారతీయ నావికులే ప్రాణాలు కోల్పోవడం గమనార్హమని విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలో జలసంధిని తిరిగి తెరవాల్సిన అవసరాన్ని భారత్ బలంగా నొక్కి చెప్పింది.

**అంతర్జాతీయ జలమార్గాల భద్రత అత్యంత కీలకం**


బ్రిటన్ నేతృత్వంలో 60కిపైగా దేశాలు పాల్గొన్న అంతర్జాతీయ వర్చువల్ సమావేశంలో భారత్ తరఫున విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ పాల్గొన్నారు. ఆ సమావేశంలో సముద్రయాన స్వేచ్ఛ, అంతర్జాతీయ జలమార్గాల భద్రత అత్యంత కీలకమని భారత్ స్పష్టం చేసింది. ప్రపంచ వాణిజ్యానికి, ముఖ్యంగా ఇంధన సరఫరాకు హార్మూజ్ జలసంధి ఎంత ముఖ్యమో వివరించింది.

**నేరుగా దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం**

హార్మూజ్ జలసంధి ప్రపంచ చమురు సరఫరాలో దాదాపు 20 శాతం వాటాను కలిగి ఉంది. ఈ మార్గం మూసివేయడం వల్ల గ్లోబల్ మార్కెట్లలో చమురు ధరలు భారీగా పెరిగాయి. ఈ ప్రభావం భారత్‌పై కూడా తీవ్రంగా పడుతోందని అధికారులు తెలిపారు. భారత్ ప్రపంచంలో అతిపెద్ద ముడి చమురు దిగుమతి దేశాల్లో ఒకటి కావడంతో, ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు నేరుగా దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు.

**సముద్ర భద్రతపై మరింత అప్రమత్తంగా!**

ఇప్పటివరకు హార్మూజ్ జలసంధిలో జరిగిన దాడుల్లో విదేశీ జెండాలు కలిగిన వాణిజ్య నౌకల్లో పనిచేస్తున్న ముగ్గురు భారతీయ నావికులు మరణించారు. మరో నావికుడు గాయపడ్డాడు. ఈ విషయాన్ని భారత షిప్పింగ్ డైరెక్టరేట్ జనరల్ ధ్రువీకరించింది. ఈ ఘటనల నేపథ్యంలో భారత్ సముద్ర భద్రతపై మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది.



**దేశానికి సవాలు**

సమావేశంలో విక్రమ్ మిస్రీ మాట్లాడుతూ, ప్రస్తుత సంక్షోభానికి ఏకైక పరిష్కారం యుద్ధం ముగింపు మరియు చర్చల ద్వారానే సాధ్యమని స్పష్టం చేశారు. అన్ని దేశాలు పరస్పర సంభాషణ ద్వారా ఉద్రిక్తతలను తగ్గించుకోవాలని పిలుపునిచ్చారు. దౌత్య మార్గమే శాంతి సాధనకు ఉత్తమ మార్గమని ఆయన అభిప్రాయపడ్డారు. పశ్చిమాసియాలో జరుగుతున్న పరిణామాలు భారత్ ఇంధన భద్రతపై ప్రత్యక్ష ప్రభావం చూపుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో స్థిరత్వం లేకపోవడం వల్ల సరఫరా వ్యవస్థ దెబ్బతింటోందని, ఇది దేశానికి సవాలుగా మారుతోందని చెప్పారు. ఇదిలా ఉండగా, కీలక సమావేశానికి అమెరికా తరఫున ఎవరూ హాజరుకాలేదు. ఇది అంతర్జాతీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే ఇతర దేశాలు కలిసి సమస్య పరిష్కారానికి మార్గాలు అన్వేషిస్తున్నాయి. గల్ఫ్ దేశాల్లో సుమారు ఒక కోటి భారతీయులు నివసిస్తున్నట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ ప్రాంతంలో ఉన్న భారతీయుల భద్రతపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అన్ని దేశాల్లోని భారత రాయబార కార్యాల యాలు అక్కడి భారతీయులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తున్నాయని విదేశాంగ శాఖ తెలిపింది.

**204 మంది భారతీయులను భూభాగ మార్గం ద్వారా!**

ఇప్పటివరకు ఈ సంక్షోభంలో మొత్తం ఎనిమిది మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. ఒకరు ఇంకా కనిపించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు, ఇరాన్‌లో చిక్కుకుపోయిన భారతీయులను సురక్షితంగా బయటకు తీసుకురావడానికి చర్యలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే 204 మంది భారతీయులను భూభాగ మార్గం ద్వారా అజర్‌బైజాన్‌కు తరలించారు. మరికొందరిని కూడా త్వరలో తరలించే ఏర్పాట్లు జరుగుతున్నాయి.

## ఇండియన్ నేవీ అమ్ములపొదిలోకి

భారత నౌకాదళ అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరింది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో అణుశక్తితో రూపొందించిన జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిదమాన్‌ను లాంఛనంగా ప్రవేశపెట్టారు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్. ఫలితంగా అణు నావికాదళ విభాగం మరింత బలోపేతం అయింది. అంతకుముందు అత్యాధునిక యుద్ధ నౌక ఐఎన్ఎస్ తారాగిరి శుక్రవారం జలప్రవేశం చేసింది. విశాఖ నేవల్ డాక్ యార్డులో జరిగిన కార్యక్రమంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతుల మీదుగా దీన్ని కమిషన్ చేశారు. ఈ కార్యక్రమానికి సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్, నౌకాదళ అధిపతి దినేశ్ కె.త్రిపాఠి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. భారత్ అత్యంత గోప్యంగా షిప్ సబ్‌మెర్సిబుల్ బాలిస్టిక్ న్యూక్లియర్ ప్రాజెక్ట్‌ను తీసుకువచ్చింది. ఈ ప్రాజెక్ట్ కింద ఐఎన్ఎస్ అరిహంత్ మొదటి నౌక కాగా, దాని తర్వాత ఐఎన్ఎస్ అరిఘాట్ అనే మరో నౌక వచ్చింది. తాజాగా మూడో నౌక ఐఎన్ఎస్ అరిదమాన్?ను కమిషన్ చేశారు. విశాఖపట్నంలో నిర్మించిన ×చీూ అరిదమాన్‌ను ఈ నౌకను అనేక నెలల పాటు సముద్ర పరీక్షలు చేసిన తర్వాత నౌక దళంలోకి ప్రవేశపెట్టారు. ఐఎన్ఎస్ అరిహంత్ భారత్ మొట్టమొదటి స్వదేశీ అణు జలాంతర్గామి. దీనిని జూలై 2009లో ప్రారంభించి 2016లో నౌకాదళంలోకి ప్రవేశపెట్టారు. రెండో నౌక ×చీూ అరిఘాట్‌ను ఆగస్టు 2024లో ప్రవేశపెట్టింది. అణుశక్తితో నడిచే జలాంతర్గాములను కలిగి ఉన్న కొన్ని దేశాల జాబితాలో భారత్? కూడా చేరింది. ప్రస్తుతం అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా వద్ద ఈ జలాంతర్గాములు ఉన్నాయి.

**శత్రువుల రాడార్‌లకు కనిపించకుండా పనిచేసే సామర్థ్యం**

స్టెల్త్ సాంకేతికతతో రూపొందించిన తారాగిరి భారత సముద్ర సరిహద్దు రక్షణలో కీలక పాత్ర పోషించనుంది. నీలగిరి శ్రేణి 17-ఏలో నాలుగో ప్రాజెక్టుగా ఈ యుద్ధనౌకను ముంబయిలోని మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ (ఎండీఎల్)లో నిర్మించారు. స్వదేశీ ఆధునిక సాంకేతికత వినియోగంలో 75 శాతానికిపైగా సూక్ష్మ, చిన్న మధ్య తరహా పారిశ్రామిక రక్షణ ఉత్పత్తుల తయారీ సంస్థలు భాగస్వామ్యం అయినట్లు నేవీ వర్గాలు వివరించాయి. శత్రువుల రాడార్‌లకు కనిపించకుండా పనిచేసే సామర్థ్యం ఈ యుద్ధనౌక ప్రత్యేకత. ఐఎన్ఎస్ తారాగిరిని గతేడాది నవంబరు 28న నేవీకి అప్పగించారు.

**ఐఎన్ఎస్ తారాగిరి విశేషాలివే**

149 మీటర్ల పొడవు, 17.8 మీటర్ల వెడల్పుతో 6,670 టన్నుల బరువు ఉండే ఐఎన్ఎస్ తారాగిరి కంబైన్డ్ డీజిల్/గ్యాస్ ఆధారిత ప్లాంటుతో సముద్ర జలాల్లో గంటకు 28 నాట్స్ వేగంతో ప్రయాణించగలదు. ఇందులో నిశ్శబ్ద ఫిరంగుల (స్టెల్త్ ఫ్రిగేట్)తో కూడిన ఆధునిక టెక్నాలజీ ఉంది. బరాక్-8 వంటి విమాన విధ్వంసక, 8 బ్రహ్మోస్ నౌకా విధ్వంసక క్షిపణులు ఇందులో ఉన్నాయి. యాంటీ సబ్‌మెరైన్ వార్ఫేర్ వ్యవస్థతోపాటు, శత్రువుల జాడను, ముప్పును ముందే పసిగట్టే రాడార్ వ్యవస్థ ఉంది. భారత్‌ను బలమైన నౌకాదళ శక్తిగా తీర్చిదిద్దడంలో నావల్ సైన్స్, టెక్నలాజికల్ లాబొరేటరీ చేస్తున్న కృషిని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు.

## మందుబాబులకు 'పెగ్గు' మరింత ఖరీదు!

పశ్చిమాసియాలోని యుద్ధ భయం భారత్‌లో మందుబాబుల పాలిట శాపంగా మారింది. ఇజ్రాయెల్-ఇరాన్ ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ సరఫరా గొలుసులో తలెత్తిన ఆటంకాలు మన దేశంలోని మద్యం బాటిళ్ల ధరలను పెంచేలా కనిపిస్తున్నాయి. ఇప్పటికిప్పుడు వీటి ధరలు పెరగకపోయినా సమీప భవిష్యత్తులో మద్యం మరింత ప్రియం కానుందని కొందరు భావిస్తున్నారు. మద్యం తయారీలో ముడిసరుకు కంటే ప్యాకేజింగ్ ఖర్చే ఇప్పుడు కంపెనీలకు భారంగా మారింది. దీనికి ప్రధాన కారణం సహజ వాయువు. మద్యం బాటిళ్లు తయారు చేసే గాజు ఫర్నేస్‌లను(కొలిమి) నిరంతరం మండించాలంటే గ్యాస్ తప్పనిసరి. బీర్ తయారీ ఖర్చులో ప్యాకేజింగ్ వాటా సుమారు 40% కాగా, స్పిరిట్స్ (విస్కీ, బ్రాండీ తదితరాలు)లో ఇది 20% వరకు ఉంటుంది. ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద సహజ వాయువు దిగుమతిదారు అయిన భారత్ తన అవసరాల కోసం 40% వరకు ఖతార్ పైనే ఆధారపడుతోంది. పశ్చిమ ఆసియాలో యుద్ధ వాతావరణం వల్ల గ్యాస్ సరఫరాకు ఆటంకం ఏర్పడితే అది నేరుగా గాజు బాటిళ్ల ఉత్పత్తిపై దెబ్బకొడుతుంది.

**ధరల పెరుగుదల ఎంత ఉండవచ్చు?**

ఇండియన్ మాల్ట్ విస్కీ అసోసియేషన్ (ఐఎండబ్ల్యూఏ) డైరెక్టర్ జనరల్ మేజర్ జనరల్ రాజేష్ చోప్రా అంచనా ప్రకారం, కేవలం గ్యాస్ ధరల వల్లే గాజు బాటిళ్ల ధర 15-20% పెరిగింది. దీనికి అదనంగా షిప్పింగ్ ఛార్జీలు తోడవ్వడంతో కంపెనీలు బ్రాండ్ల వారీగా 10-15% ధరల సవరణ కోరుతున్నాయి. ముఖ్యంగా ప్రీమియం సెగ్మెంట్లలో ఈ ప్రభావం తక్షణమే కనిపించనుంది.

## నా మౌనాన్ని ఓటమిగా భావించొద్దు

రాజ్యసభలో ఆమ్ ఆద్మీ పార్టీ ఉపనేత పదవి నుంచి తొలగించడంపై ఎంపీ రాఘవ్ చడ్డా స్పందించారు. ఈ వ్యవహారంపై తాను మౌనంగా ఉన్నానంటే దాని ఉద్దేశం ఓడిపోయినట్టు కాదన్నారు. ఈ మేరకు ఓ వీడియో సందేశాన్ని రాఘవ్ చడ్డా విడుదల చేశారు. పార్లమెంటులో తన గొంతు నొక్కేందుకు సొంత పార్టీయే ప్రయత్నించిందని మండిపడ్డారు. తనకు ఎప్పుడు అవకాశం లభించినా, ప్రజా సమస్యలనే ప్రస్తావించినట్లు చెప్పారు. ప్రజా సమస్యలను ఎత్తిచూపడం నేరమా అని ఆయన ప్రశ్నించారు. సభలో తనకు మాట్లాడే అవకాశం ఇవ్వొద్దని ఆప్ నాయకత్వం, రాజ్యసభ సెక్రటరీని కోరుతూ లేఖ రాయటం తనను విస్మయానికి గురిచేసిందన్నారు. సామాన్యులకు మేలు చేసే ఎన్నో అంశాలను తాను లేవనెత్తానన్న రాఘవ్ చడ్డా, దానివల్ల ఆమ్ ఆద్మీ పార్టీకి వచ్చిన నష్టం ఏమిటని నిలదీశారు. తాను ప్రజల పక్షాన ఉంటానని, వారికోసం ఎంత దూరమైనా వెళ్తానని రాఘవ్ చడ్డా స్పష్టం చేశారు. "పార్లమెంట్‌లో నాకు ఎప్పుడు మాట్లాడే అవకాశం లభించినా ప్రజా సమస్యలనే లేవనెత్తుతా. బహుశా నేను ప్రస్తావించే అంశాలను సభలో సాధారణంగా చర్చించరేమో. కానీ, ప్రజా సమస్యలను ఎత్తిచూపడం ఏమైనా నేరమా? నేనేమైనా తప్పు చేశానా? పార్లమెంట్‌లో నాకు మాట్లాడే అవకాశం ఇవ్వొద్దని మా పార్టీ స్వయంగా రాజ్యసభ సెక్రటరీకి చెప్పింది. అందుకే ఈ రోజు నేను ఈ ప్రశ్నలు అడగాల్సి వచ్చింది. ఎయిర్‌పోర్టుల్లో ఆహార ధరలు, టోల్ ప్లాజా దోపిడీ, గిగ్ వర్కర్ల సమస్యలు, టెలికాం కంపెనీల రీఛార్జ్ విధానాల సమస్యలను లేవనెత్తితే అది ఆమ్ ఆద్మీ పార్టీకే ప్రయోజనం కదా. దీని వల్ల పార్టీకి ఏం నష్టం జరుగుతోంది? ఎందుకు నన్ను మాట్లాడకుండా అడ్డుకుంటున్నారు? ఇలాంటి చర్యలతో నా గళాన్ని మీరు అణచివేయ గలరు. కాని, ఇది నా ఓటమి కాదు. ప్రజలు నా పక్షాన ఉన్నారు. వారికోసం ఎంత దూరమైనా వెళ్తాను. నేను నది లాంటి వాడిని. సమయం వచ్చినప్పుడు వరదలా విరుచుకు పడతా" మరోవైపు రాఘవ్ చడ్డా వ్యాఖ్యలపై ఆప్ స్పందించింది. ప్రధాని మోదీకి వ్యతిరేకంగా మాట్లాడేందుకు ఆయన భయపడుతున్నారని ఆరోపించింది. ఎయిర్‌పోర్ట్ క్యాంటీన్లలో సమోసా ధరలు తగ్గించడం వంటి అంశాలపై మాట్లాడటం ఏంటి అని ప్రశ్నించింది. "మేము అరవింద్? కేజ్రీవాల్ సైనికులం. నిర్భయత్వం మా సహజ లక్షణం. మోదీని చూసి భయపడేవాడు అసలు దేశం కోసం ఎలా పోరాడగలడు? పార్లమెంటులో ఒక పార్టీకి మాట్లాడటానికి పరిమిత సమయం మాత్రమే కేటాయిస్తారు. ఆ సమయం లోపల ఒకరు దేశాన్ని రక్షించడానికి పోరాటం చేయవచ్చు. లేదా కేవలం విమానాశ్రయ క్యాంటీన్‌లో సమోసాల ధరలు తగ్గించమని కూడా ప్రచారం చేసుకోవచ్చు. గుజరాత్‌లో మా పార్టీ కార్యకర్తలను వందల సంఖ్యలో బీజేపీ నియంత్రణలో ఉన్న పోలీసులు అరెస్టు చేశారు.

## విజయ్ రెండు చోట్ల పోటీ.. ఎన్నికల అఫిడవిట్లలో తేడాలు

తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తోన్న విషయం తెలిసిందే. పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ స్థానాల్లో నామినేషన్ వేయగా.. ఇందుకు సంబంధించి విజయ్ సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌లలో తేడాలు ఉన్నట్లు తెలిసింది. దీంతో ఎన్నికలకు ముందు ఈ వ్యవహారం న్యాయ పరిశీలనకు దారితీయవచ్చని పలువురు అంటున్నారు. పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ అసెంబ్లీ స్థానాల కోసం రూపొందించిన అఫిడవిట్‌లలో పెండింగ్ క్రిమినల్ కేసులు, ఎన్నికల బ్యాంకు ఖాతాలకు సంబంధించిన వివరాలు విరుద్ధంగా ఉన్నట్లు సమాచారం. పెరంబూర్‌లో ఇచ్చిన అఫిడవిట్‌లో ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని పేర్కొన్నట్లు తెలిసింది. అదే తిరుచ్చి ఈస్ట్ కోసం సమర్పించిన నామినేషన్ పత్రాల్లో పెండింగ్‌లో రెండు ఎఫ్ఐఆర్‌లు ఉన్నట్లు పేర్కొనడం గమనార్హం.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137